PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 302 | విజయవాడ, గురువారం 6 జూన్ 2024 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Thursday 6 June 2024 | Rs

సామాన్యులకు వినోదం భారం

- ధరలు పెంచనున్న ఛానళ్లు
- త్వరలోనే 5-8 శాతం ధరల పెంపు..!
- వయోకామ్-18 ఏకంగా25 శాతం వడ్డింపు
- బ్రాడ్‌కాస్ట్ పరిశ్రమ వర్గాల వెల్లడి

3

చెలరేగిన బౌలర్లు

- హార్దిక్, బుమ్రా దెబ్బకు ఐర్లాండ్ ఢమాల్
- ఎనిమిది వికెట్ల తేడాతో టీమిండియా గెలుపు

6

ఎన్‌డిఎ నాయకులతో కలిసి విక్టరీ సింబల్ చూపుతున్న ప్రధాని నరేంద్ర మోడీ, చంద్రబాబు, పవన్ తదితరులు

9న ప్రమాణస్వీకారం

- మోడీకి మూడవసారి అధికార పగ్గాలు
- ఎన్డీయే పార్లమెంటరీ నేతగా 7న లాంఛనంగా ఎన్నిక
- 17వ లోక్‌సభ రద్దు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పద్దెనిమిదో లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి మెజార్టీ కోల్పోయినప్పటికీ నరేంద్ర మోడీనే మళ్లీ ప్రధానిని చేయాలని ఎన్డీయే నిర్ణయించింది. ఎన్డీయేకు మద్దతుగా లేఖలు పంపుతామని ఈ కూటమిలో భాగస్వాములైన చంద్రబాబు (తెలుగుదేశం), నితీష్ కుమార్ (జెడియు) ప్రకటించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశానికి ఎన్డీయేలోని 16 పార్టీల నేతలతోబాటు మోడీ అనుంగు సహచరుడు అమిత్‌షా కూడా హాజరయ్యారు. ఈ నెల 7న ఎన్డీయే ఎంపీలందరూ సమావేశమై తమ కూటమి పార్లమెంటరీ నేతగా మోడీని లాంఛనంగా ఎన్నుకుంటారు. 9వ తేదీన మూడవ సారి ప్రధానమంత్రిగా మోడీ ప్రమాణ స్వీకారం చేస్తారు. .వరుసగా మూడు సార్లు ప్రధానిగా ఒకే వ్యక్తి ఎన్నికల కావడం 60 ఏళ్ల క్రితం ఒకసారి జరిగింది. బుధవారం నాడిక్కడ జరిగిన ఎన్డీయే నేతల భేటీలో నరేంద్ర మోడీని ఎన్డీయే నేతగా నియమిస్తూ ఏకగ్రీవంగా తీర్మానించారు. అనంతరం మోడీ నేతృత్వంలో ఎన్డీయే నేతలు రాష్ట్రపతిని కలసి ప్రభుత్వ ఏర్పాటుకు తమను ఆహ్వానించాలని కోరారు. ఎన్డీయే భాగస్వామ్య పక్షాలు ఎక్కడ చేజారిపోతాయోనన్న ఉద్దేశంతో కాబోలు బిజెపి కొత్త ప్రభుత్వ ఏర్పాటు యత్నాలను వేగవంతం చేసింది. ఎన్డీయే భాగస్వామ్య పార్టీలు మంత్రిపదవులు, ఇతర డిమాండ్లకు సంబంధించిన లిస్టును మోడీ ముందుంచినట్లు సమాచారం. మోడీ నాయకత్వం పట్ల విశ్వాసం వ్యక్తం చేస్తూ, ఆయన పదేళ్ల పాలనను పొగుడుతూ ఎన్డీయే నేతలు ఒక తీర్మానం చేశారు. అంతకుముందు ప్రధాని మోడీ నివాసంలో జరిగిన కేంద్ర మంత్రివర్గం చివరి సారి సమావేశమై 17వ లోక్‌సభ రద్దుకు సిఫారసు చేయగా, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వెంటనే దానికి ఆమోద ముద్ర వేశారు. ప్రస్తుత లోక్‌సభ పదవీకాలం జూన్ 16తో ముగియనుంది.17వ లోక్‌సభకు రద్దు కావడంతో 18వ లోక్‌సభ ఏర్పాటుకు లైన్ క్లియరైంది.

తిరుపతి, కోస్తాంధ్రలో భారీ వర్షాలు

- పిడుగుపాటుకు మహిళ మృతి

భారీగా ఆశావహులు

- మంత్రివర్గంలో ఎవరెవరు ?
- మిత్రపక్షాల వాటా ఎంత

లోపలి పేజీలో..

ఫైళ్లు మాయమైతే అధికారులదే బాధ్యత

- వారికి సెలవులివ్వొద్దు
- మౌఖిక ఆదేశాలు!

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కొత్త ప్రభుత్వం ఏర్పాటు అయిందాకా ఉన్నతాధికారులకు సెలవులు ఇవ్వొద్దని మౌఖిక ఆదేశాలు జారీచేశారు. ఉన్నతాధికారులెవరూ సెలవుపై వెళ్లడానికి వీల్లేదని, విదేశీ పర్యటలను కూడా రద్దు చేసుకోవాలని సూచించారు. బుధవారం ఉదయం సిఎస్, డిజిపి టిడిపి అధినేత చంద్రబాబును మర్యాద పూర్వకంగా కలిశారు. అంతకుముందే సిఐడి డిజి సంజయ్ విదేశాలకు వెళ్లడానికి అనుమతి కోరారని వార్తలు వచ్చిన నేపథ్యంలో ఉన్నతాధికారుల నుండి ఈ మేరకు ఆదేశాలు వెళ్లినట్లు తెలిసింది. అన్ని డిపార్టుమెంట్లకు సంబంధించిన సమాచారం ఇవ్వాల్సి ఉన్న నేపథ్యంలో ఉన్నతాధికారులు లేకపోతే సమస్యలు వస్తాయని, దీన్ని దృష్టిలో ఉంచుకుని ఐఎఎస్, ఐపిఎస్‌లకు ఎవరికీ సెలవులు ఇవ్వొద్దని సిఎస్, డిజిపికి చంద్రబాబు సూచించినట్లు సమాచారం. సమాచారం లేకుండా పోలీసు అధికారులు కూడా ఎవరూ బయటకు వెళ్లొద్దనీ ఆదేశించారని తెలిసింది. దీంతో ఇప్పటి వరకూ వైసిపికి అనుకూలంగా ఏకపక్షంగా వ్యవహరించిన అధికారులకు భయం పట్టుకుంది. మరోవైపు నారా లోకేష్ కూడా అక్రమాలు, అన్యాయాలు చేసే అధికారుల పేర్లు తాను రెడ్‌బుక్‌లో రాసుకుంటున్నానని, వారిని వదిలేది లేదని ప్రకటించడం కూడా సెలవులు ఇవ్వొద్దని చెప్పడానికి ప్రధాన కారణమని చెబుతున్నారు. వెలగపూడి సచివాలయంలోని అన్ని విభాగాల్లోనూ ఎటువంటి ఫైళ్లు కదిలించొద్దని, కంప్యూటర్ల పాస్‌వర్డులు మార్చొద్దని, హార్డ్‌డిస్కులూ తీయొద్దని ఆయా విభాగాల అధిపతులకూ ఆదేశాలు వెళ్లాయి. సిఎఫ్‌ఎంఎస్, ఐటి విభాగాల్లో పోలీసు అధికారులు వెళ్లి ఇప్పటివరకూ రికార్డులు, ఫైళ్లు, హార్డ్ డిస్కుల్లో ఉన్న ఫైళ్ల నెంబర్లు నమోదు చేసుకుని వెళ్లారని తెలిసింది. వీటిల్లో ఎటువంటి మార్పులు జరిగినా విభాగ అధిపతిపైనా, సిబ్బందిపైనా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించినట్లు తెలిసింది. దీంతో అధికారుల్లో వణుకు మొదలైంది.

ప్రజాతీర్పును బాధ్యతగా స్వీకరిస్తా

పాలకుల్లా కాకుండా సేవకులుగా వ్యవహరిస్తాం

పాలన ఎలా ఉండకూడదనడానికి జగన్ ఒక కేస్ స్టడీ

మీడియా సమావేశంలో చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

'ప్రజలు అపూర్వమైన తీర్పు నిచ్చారు. దీనిని బాధ్యతగా స్వీకరిస్తా' అని తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు అన్నారు. రాష్ట్ర శాసనసభకు జరిగిన ఎన్నికల్లో భారీ విజయం సాధించిన తరువాత మొదటి సారిగా బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఉండవల్లిలోని తన నివాసంలో జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటువంటి చరిత్రాత్మక ఎన్నికలను ఎప్పుడూ చూడలేదన్నారు. అటువంటి తీర్పు ఇచ్చిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. పాలకులుగా కాకుండా తాము సేవకులుగా వ్యవహరిస్తామని చెప్పారు. జగన్ పాలనలో చోటుచేసుకున్న కొన్ని సంఘటనలను ప్రస్తావించిన ఆయన కొంత ఉద్విగ్నతకు లోనయ్యారు. శాసనసభలో తన కుటుంబానికి అవమానం జరిగిందని మిగతా 2లో

చంద్రబాబు నాయుడుకు అభినందనలు తెలుపుతున్న సిఎస్ జవహర్‌రెడ్డి

ఎన్‌డిఎలోనే ఉన్నాం

'ప్రస్తుతానికి ఎన్‌డిఎలోనే ఉన్నాం. ఎన్‌డిఎ సమావేశానికే వెళ్తున్నాం.' అని ఒక ప్రశ్నకు జవాబుగా చంద్రబాబు చెప్పారు. 'దేశంలో ఎన్నో రాజకీయ పరిణామాలను చూశా. కొన్నింటిలో ప్రత్యక్షంగానే ఉన్నా. ప్రస్తుతానికి ఎన్‌డిఎలోనే ఉన్నాం. కాలక్రమంలో ఏమైనా జరిగితే మీకు చెబుతా..' అని చంద్రబాబు అన్నారు.

విద్యుత్ సంస్కరణల ఘనత మాదే...

రాష్ట్రంలో విద్యుత్ సంస్కరణలను తీసుకువచ్చిన ఘనత తమదేనని చంద్రబాబు అన్నారు. అప్పట్లో విద్యుత్ సరఫరా అధ్వానంగా ఉండేది. కరెంటు కోసం కమ్యూనిస్టులు రోజూ ధర్నాలు చేసేవారు. మేం కూడా ప్రతి రోజూ గంటల కొద్ది దానిగురించే సమీక్షించేవాళ్లం. విద్యుత్ సంస్కరణలను తీసుకు వచ్చి దానిని బాగుచేశా. కరెంటు కోతలు లేకుండా చూశా! ఆ తరువాత వచ్చిన పాలకులు దానిని పాడు చేశారు. మళ్ళీ నేను అధికారంలో వచ్చి సంస్కరణలతో సరిచేశా. జగన్ పాలనలో పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. తొమ్మిది సార్లు ఛార్జీలను పెంచి ప్రజలపై భారాలు వేసింది. ఈ పరిస్థితిని మళ్లీ చక్కదిద్దాలి.' అని చంద్రబాబు చెప్పారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా

సరైన సమయంలో సరైన నిర్ణయం

- బిజెపికి ప్రజలు గట్టిగానే బుద్ధి చెప్పారు
- ప్రజా వ్యతిరేక విధానాలపై పోరు కొనసాగుతుంది
- ఇండియా బ్లాక్ సమావేశం అనంతరం ఖర్గే

మల్లికార్జునఖర్గే నివాసంలో సమావేశమైన ఇండియా బ్లాక్ నేతలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో బిజెపి పాలనను అంతమొందించాలన్న ప్రజల ఆకాంక్షను సాకారం చేసేందుకు సరైన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకుంటామని ఇండియా ఫోరం ప్రకటించింది. లోక్‌సభ ఎన్నికల ఫలితాలను సమీక్షించడానికి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే నివాసంలో జరిగిన సమావేశంలో ప్రభుత్వ ఏర్పాటుకు బిజెపి ప్రయత్నానికి వ్యతిరేకంగా తొందరపాటు చర్యలు తీసుకోకూడదని ఇండియా ఫోరం నిర్ణయించింది. బలమైన ప్రతిపక్షంగా ప్రజా సమస్యలను లేవనెత్తుతామని, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఐక్యంగా వ్యతిరేకిస్తామని ఇండియా ఫోరం నేతలు స్పష్టం చేశారు.

సమావేశ అనంతరం మల్లికార్జున్ ఖర్గే మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల్లో బిజెపి ద్వేషపూరిత రాజకీయాలకు ప్రజలు తగిన సమాధానం చెప్పారన్నారు. ఇది రాజ్యాంగ పరిరక్షణ కోసం అలాగే, ధరల పెరుగుదల, నిరుద్యోగం, మోడీ పాలనలో సృష్టించిన బిజెపి క్రోనీ క్యాపిటలిజానికి వ్యతిరేకంగా ఇచ్చిన తీర్పు అని ఆయన వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్య పరిరక్షణపై ఓటర్లు ఆసక్తి చూపారని, ఇండియా ఫోరానికి అండగా నిలిచిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. మోడీ నాయకత్వంలో బిజెపి ఫాసిస్టు పాలనకు వ్యతిరేకంగా ఇండియా ఫోరం పోరాటం కొనసాగుతునే ఉంటుంది. తగిన సమయంలో తగిన నిర్ణయం తీసుకుంటామని అన్నారు. ఇండియా ఫోరం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకుంటుందని ఖర్గే చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాని నరేంద్ర మోడీకి వ్యతిరేకంగా ప్రజలు స్పష్టంగా తీర్పు రాశారని ఇండియా బ్లాక్ నేతలు పేర్కొన్నారు. రాజ్యాంగ ప్రవేశికలో పొందుపరిచిన విలువలకు మిగతా 2లో

15వ శాసనసభ రద్దు నోటిఫికేషన్ విడుదల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

15వ శాసనసభ బుధవారంతో రద్దయ్యింది. ఈ మేరకు బుధవారం గవర్నర్ అబ్దుల్ నజీర్ నోటిఫికేషన్ విడుదల చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 174లోని క్లాజ్(2)(బి) ద్వారా సంక్రమించిన అధికారాలను ఉపయోగించడంతోపాటు మంత్రిమండలి సలహా మేరకు 15వ శాసనసభను రద్దు చేస్తున్నట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి నూతన ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించే వరకు ఈ ఉత్తర్వులు అమల్లో ఉంటాయని పేర్కొన్నారు. ఈ మేరకు ప్రభుత్వం జిఎంఎస్ నెంబరు 25ను కూడా విడుదల చేసింది.

పిన్నెల్లి అరెస్టుకు రంగం సిద్ధం?

నేటితో ముగియనున్న మధ్యంతర బెయిలు

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అరెస్టుకు రంగం సిద్ధమైంది. ఆయనకు రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన షరతులతో కూడిన మధ్యంతర బెయిలు గడువు గురువారంతో ముగియనుంది. దీంతో, అదే రోజు హైకోర్టు ఇవ్వనున్న ఉత్తర్వులకు అనువుగా చర్యలు తీసుకోవడానికి పోలీసులు సన్నద్ధంగా ఉన్నారు. ఎన్నికల ఘర్షణలో టిడిపి కార్యకర్తలపై దాడుల ఘటనల్లో మూడు హత్యాయత్నం కేసులు, గత నెల 13న ఇవిఎంల ధ్వంసం కేసులు పిన్నెల్లిపై నమోదయ్యాయి. ఈ కేసుల్లో ఆయనకు హైకోర్టు షరతులతో కూడిన బెయిలు మంజూరు చేసింది. జూన్ ఆరో తేదీ వరకూ ఆయనను అరెస్టు చేయవద్దని పోలీసులను ఆదేశించింది. అయితే, ఇవిఎంల ధ్వంసం కేసులో బెయిల్ ఇవ్వడాన్ని సుప్రీంకోర్టు సోమవారం తప్పుబట్టింది. దీంతో, హైకోర్టులో గురువారం ఆయన బెయిల్ రద్దయ్యే అవకాశం ఉందని పోలీసు అధికారులు భావిస్తున్నారు. ఆయనను అరెస్టు చేసేందుకు సన్నద్ధం చేశారు. ప్రస్తుతం నరసరావుపేట లోక్‌సభ వైసిపి అభ్యర్థి పి.అనిల్‌కుమార్ నివాసంలో పిన్నెల్లి ఉంటూ హైకోర్టు ఉత్తర్వుల మేరకు రోజు పల్నాడు ఎస్‌పి కార్యాలయానికి వెళ్లి సంతకం చేస్తున్నారు. బెయిల్ గడువు ముగియనుండడంతో పిన్నెల్లిపై అధికారులు బుధవారం నుంచి నిఘా పెంచారు. ఆయన ఉంటున్న నివాసం చుట్టూ పోలీసులు మోహరించారు. బెయిలును హైకోర్టు కొనసాగిస్తుందా? లేక రద్దు చేస్తుందా? అనే అంశంపై ఉత్కంఠ నెలకొంది. మళ్లీ బెయిల్ లభించకపోతే ఆయన అరెస్టు ఖాయమని పోలీసు వర్గాలు అంటున్నాయి.

హిందూపురం శ్రీ చైతన్య పాఠశాల ముందు ఆందోళన చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ఫీజుల పట్టికను ప్రదర్శించాల్సిందే

- పుస్తకాల పేరుతో దోపిడీని అరికట్టండి
- ఎస్‌ఎఫ్‌ఐ ఆందోళన

ప్రజాశక్తి-హిందూపురం

ఫీజులు, పుస్తకాల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులను నిలువు దోపిడీ చేస్తున్న హిందూపురం శ్రీచైతన్య పాఠశాల యాజమాన్యానికి వ్యతిరేకంగా ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో స్కూల్ ఎదుట బుధవారం ఆందోళన చేశారు. కార్పొరేట్, ప్రయివేటు విద్యా సంస్థలు ఆయా విద్యా సంస్థల ఎదుట ఫీజుల పట్టికను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అందుకు నూతన ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాబావలి మాట్లాడుతూ..విద్యార్థుల తల్లిదండ్రులకు మాయమాటలు చెప్పి ముందస్తు అడ్మిషన్లకు శ్రీచైతన్య యాజమాన్యం చేపడుతోందని విమర్శించారు.

అనుమతులు లేకుండా నడుపుతున్న బ్రాంచ్‌లను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యాసంస్థల పేర్లతో ముద్రించిన పుస్తకాలను రూ.6000 నుంచి రూ.12 వేల వరకు విక్రయిస్తున్నారని తెలిపారు. విద్యాశాఖ అధికారులు స్పందించి ముందస్తుగా అడ్మిషన్లు చేస్తున్న శ్రీ చైతన్య విద్యాసంస్థలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు చంద్రశేఖర్, తరుణ్, హర్ష కుమార్, భగత్, పవన్, మహేష్, జస్వంత్, మణికంఠ, శివ, శ్రీనివాస్, హసేన్ పాల్గొన్నారు.

కీలక అంశాలపై శ్వేతపత్రాలు

- కసరత్తు చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్రంలో నూతన ప్రభుత్వం త్వరలో కొలువు తీరనున్న నేపథ్యంలో కీలక అంశాలపై శ్వేతపత్రాలను సిద్ధం చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. గతంలో ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన తరువాత చంద్రబాబునాయుడు వివిధ శాఖలకు సంబంధించి శ్వేతపత్రాలు విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈసారి కూడా అదే విధంగా చేసే అవకాశం ఉందని భావిస్తున్న అధికారయంత్రాంగం ఈ విషయమై దృష్టి సారించింది.

ప్రధానంగా రాష్ట్ర ఆర్థిక స్థితిగతులను ముఖ్యమంత్రికి వివరించాలని అధికారులు భావిస్తున్నారు. ఈ శాఖకు సంబంధించి ఐదేళ్ల కాలంలో తీసుకున్న రుణాలు, వచ్చిన ఆదాయం, చేసిన వ్యయం వంటి అంశాలతో పూర్తిస్థాయిలో నివేదికను సిద్ధం చేయనున్నారు. అలాగే కేంద్రం నుంచి తీసుకున్న రుణాలు, వచ్చిన గ్రాంట్లు, రాష్ట్రంలోని పథకాలకు ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు, నబార్డ్, హడ్కో, జైకా వంటి జాతీయ, అంతర్జాతీయ విత్త సంస్థల నుంచి తీసుకున్న సాయం వంటి అంశాలను కూడా పూర్తిగా ఆ నివేదికలో పొందుపరిచేందుకు నిర్ణయించారు. అలాగే 2014 నుంచి 2019 వరకు ఉన్న ఆర్థిక స్థితి, ఆ తరువాత 2019 నుంచి 2024 ఉన్న పరిస్థితులను ఆర్థిక సంవత్సరాల వారీగా పోలుస్తూ మరో నివేదికను కూడా రూపొందించాలని అధికారులు భావిస్తున్నారు.

ఇదే సమయంలో నీటిపారుదల రంగంలో జరిగిన అభివృద్ధి, రాష్ట్రంలో మౌళికాభివృద్ధి కోసం తీసుకున్న చర్యలు, ఖర్చు చేసిన నిధులు, విద్యుత్ రంగంలో పరిస్థితి, పెంచిన ఛార్జీల వివరాలు, విద్యుత్ కొనుగోళ్ల కోసం చేసిన ఖర్చు, అందుకు చేసిన రుణాలు వంటివి కూడా సిద్ధం చేయాలని ఆయా శాఖలకు ఉన్నతాధికారుల నుండి ఆదేశాలు వెళ్లినట్లు తెలిసింది.

అమరావతిపై ప్రత్యేకంగా

రాజధాని అమరావతిపై ప్రత్యేకంగా మరో శ్వేతపత్రాన్ని రూపొందించడానికి కూడా అధికారులు కసరత్తు ప్రారంభించారు. గత టిడిపి పాలనలో రాజధానిలో జరిగిన పనులు, అప్పట్లో వివిధ విదేశీ సంస్థలతో కుదుర్చుకున్న ఒప్పందాలు, ప్రస్తుత వాటి స్థితి తదితర అంశాలను ఈ నివేదికలో పొందుపరచనున్నట్లు సమాచారం. రాజధాని నిర్మాణానికి జరిగిన ఖర్చు, నిర్మాణాల స్థితి, జరిగిన మార్పులు తదితర అంశాలతో నివేదికను సిద్ధం చేయాలని ఇప్పటికే సూచనలు వచ్చినట్లు అధికారులు అంటున్నారు.

అధికారులతో బాబు మంతనాలు

రాష్ట్ర ఉన్నతాధికారులు కొంతమంది తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబును బుధవారం కలిశారు, ఈ సందర్భంగా ఇవే అంశాలు చర్చకు వచ్చినట్లు చెబుతున్నారు. అన్ని శాఖలకు సంబంధించి పూర్తి వివరాలతో నివేదికలను రూపొందించాలని ఈ సందర్భంగా చంద్రబాబు ఆదేశించినట్లు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సిఎస్ జవహర్‌రెడ్డి, ఎన్నికల నేపథ్యంలో డిజిపిగా నియమితులైన హరీష్‌కుమార్‌గుప్తా, ఇంటలిజెన్స్ చీఫ్ వంటి వారు చంద్రబాబును కలిసారు. ఈ సందర్భంగా తొమ్మిదో తేదీన జరిగే ప్రమాణ స్వీకారోత్సవ ఏర్పాట్లు, ఇతర అంశాలపై అధికారులు వివరించినట్లు తెలిసింది. ప్రస్తుత సిఎస్ త్వరలో పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో ఆ పదవికి రేసులో ఉంటారని భావిస్తున్న అటవీ, పర్యావరణ శాఖ ప్రత్యేక కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్, ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు, మాజీ డిజిపి ఆర్‌పి ఠాకూర్ కూడా చంద్రబాబును కలిసిన వారిలో ఉన్నారు.

పాలస్తీనాకు స్లొవేనియా గుర్తింపు

జుబ్లజానా : పాలస్తీనాను స్వతంత్ర దేశంగా స్లొవేనియా మంగళవారం గుర్తించింది. ఈ నిర్ణయానికి అనుకూలంగా స్లొవేనియా పార్లమెంట్ ఓటు వేసింది. ఇటీవల స్పెయిన్, నార్వే, ఐర్లాండ్ దేశాలు ఇదే నిర్ణయాన్ని తీసుకున్నాయి. దీంతో ఈ చర్య తీసుకున్న నాల్గవ యురోపియన్ దేశంగా అవతరించింది. పాలస్తీనాను స్వతంత్ర సార్వభౌమ దేశంగా గుర్తించాలని కోరుతూ స్లొవేనియా ప్రభుత్వం గత వారం ఒక తీర్మానాన్ని ఆమోదించింది. తుది ఆమోదం నిమిత్తం పార్లమెంట్‌కు పంపింది. దానిని పార్లమెంట్ అత్యధిక మెజారిటీతో ఆమోదించింది. 90 మంది సభ్యులుగల పార్లమెంట్‌లో 52 మంది అనుకూలంగా ఓటు వేయగా, ఒక్కరు కూడా వ్యతిరేకంగా వేయలేదు. మిగిలిన వారు ఆ సమయంలో సభలో లేరు. ప్రధాన ప్రతిపక్షమైన మధ్యే మితవాద పార్టీ స్లొవేనియన్ డెమోక్రటిక్ పార్టీ (ఎస్‌డిఎస్) సభ్యుల్లో చాలామంది ఈ పార్లమెంటరీ సమావేశానికి హాజరు కాలేదు. పార్లమెంట్ ఓటును 30 రోజుల పాటు వాయిదా వేయడానికి రెఫరెండం చేపట్టాలని ప్రతిపాదించారు. కాగా, స్లొవేనియా తీసుకున్న ఈ నిర్ణయం ఒక ఆశను కలిగిస్తుందని, శాంతిని చిగురింప చేస్తుందని స్లొవేనియా విదేశాంగ మంత్రి టాంజా ఫాజాన్ ఎక్స్‌లో పోస్టు చేశారు. ఇప్పటి వరకు 140కి పైగా దేశాలు పాలస్తీనాను గుర్తించాయి.

భారీగా ఆశావహులు

- మంత్రివర్గంలో ఎవరెవరు ?
- మిత్రపక్షాల వాటా ఎంత

యనమల రామకృష్ణుడు | వంగలపూడి అనిత | కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి | నిమ్మల రామానాయుడు | పయ్యావుల కేశవ్,

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో టిడిపి కూటమి అతికొద్ది రోజుల్లోనే కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేయబోతున్న నేపథ్యంలో మంత్రివర్గంలో స్థానం కోసం ఎవరి ప్రయత్నాల్లో వారున్నారు. టిడిపి, జనసేన, బిజెపి సభ్యులతో ఉమ్మడిగా క్యాబినెట్ ఏర్పాటవుతుందనే చర్చ జరుగుతోంది. మంత్రులుగా 25 మందికి అవకాశం ఉంది. వీటిలో పార్టీల వారీగా ఎన్ని అనేది తేలాల్సి ఉంది. టిడిపి నుంచి మాజీమంత్రి, ప్రస్తుత ఎమ్మెల్సీ యనమల రామకృష్ణుడు పేరు మాత్రం మొదటి వరుసలో ఉంది. ఆయనకు గతంలో లానే ఆర్థిక, న్యాయ శాఖలు అప్పగించే అవకాశం ఉంది. 2019 నుండి 2024 వరకూ అసెంబ్లీలో ప్రతిపక్ష సభ్యులుగా కీలకపాత్ర పోషించిన వారికి తొలి ప్రాధాన్యత ఇచ్చే అవకాశం ఉందని తెలిసింది. ఉమ్మడి జిల్లాల వారీగా చూసుకుంటే శ్రీకాకుళం జిల్లా నుంచి ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ ఇద్దరిలో ఒకరికి ఇచ్చే అవకాశం ఉంది. విజయనగరం నుంచి మాజీ మంత్రులు కిమిడి కళా వెంకట్రావు, కె మురళీమోహన్, ఆర్‌విఎస్‌కెకె రంగరావు, అదితి గజపతిరాజు ఆశిస్తున్నట్లు తెలిసింది. విశాఖపట్నం నుంచి వంగలపూడి అనిత, చింతకాయల అయ్యన్నపాత్రుడు, గంటా శ్రీనివాసరావుకు అవకాశం ఉంటుందని అంటున్నారు. తూర్పు గోదావరి జిల్లా నుంచి మాజీమంత్రి నిమ్మకాయల చినరాజప్ప, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, జ్యోతుల నెహ్రూ, వేగుళ్ల జోగేశ్వరరావు రేసులో ఉన్నారు. పశ్చిమ గోదావరి నుంచి పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు, ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు, పితాని సత్యనారాయణ, ఉమ్మడి కృష్ణా నుంచి కొల్లు రవీంద్ర, కొలుసు పార్థసారథిలో ఇద్దరిలో ఒకరికి, గద్దె రామ్మోహన్‌రావు, బొండా ఉమామహేశ్వరరావు, మైలవరం ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పోటీపడుతున్నారు. గుంటూరు నుంచి రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, మహిళా కోటాలో గుంటూరు పశ్చిమ నుండి భారీ మెజార్టీతో గెలిచిన గల్లా మాధవి రేసులో ఉన్నారు. ప్రకాశం నుంచి అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవి, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, కొండెపి ఎమ్మెల్యే డోలా బాల వీరాంజనేయస్వామి పేర్లు వినిపిస్తున్నాయి. వీరిలో బాల వీరాంజనేయస్వామి గత అసెంబ్లీలో తన వాణిని వినిపించారు. నెల్లూరు జిల్లా నుంచి మాజీ మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, పి నారాయణ, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిల పేర్లు రేసులో ఉన్నాయి. ఈ జిల్లాకు రెండు మంత్రి పదవులు ఖాయంగా దక్కుతాయని చెబుతున్నారు. కడప జిల్లా నుంచి కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి, పుట్టా సుధాకర్ యాదవ్, కర్నూలు జిల్లా నుంచి టిజి భరత్, మైనార్టీ కోటాలో ఎన్ఎండి ఫరూక్, కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత పేర్లు వినిపిస్తున్నాయి. అనంతపురం జిల్లా నుంచి ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత రేసులో ఉన్నారు. చిత్తూరు నుంచి పలమనేరు ఎమ్మెల్యే ఎన్ అమర్‌నాథ్ రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి పేర్లు వినిపిస్తున్నాయి. పిఠాపురం సీటు జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు త్యాగం చేసిన వర్మకు ఎమ్మెల్సీ ఇచ్చే అవకాశం ఉంది.

జనసేన, బిజెపిలోనూ ఎక్కువే

కూటమిలో మిత్రపక్షాలైన జనసేన, బిజెపి పార్టీల నుంచి కూడా మంత్రి పదవులు కోరుతున్న ఆశావహులు ఎక్కువగానే ఉన్నారు. జనసేన నుంచి తెనాలి నుంచి గెలిచిన ఆ పార్టీ పిఎసి చైర్మన్ నాదెండ్ల మనోహర్, అనకాపల్లి నుంచి గెలిచిన మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ, నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవి, విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ యాదవ్, నిడదవోలు ఎమ్మెల్యే కందుల దుర్గేష్, రాజోలు ఎమ్మెల్యే దేవవరప్రసాద్ పేర్లు వినిపిస్తున్నాయి. బిజెపి నుంచి విజయవాడ పశ్చిమ నుంచి గెలిచిన సుజనా చౌదరి, అనంతపురం జిల్లా ధర్మవరం నుంచి గెలిచిన సత్యకుమార్, జమ్మలమడుగు నుంచి గెలిచిన ఆదినారాయణ రెడ్డి, ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు, విశాఖపట్నం ఉత్తరం ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు పేర్లు వినిపిస్తున్నాయి.

కీలక ఫైళ్లు ప్రాసెస్ చేయొద్దు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కీలక ఫైళ్లను ప్రాసెస్ చేయవద్దని స్పెషల్ సిఎస్ రజిత్‌భార్గవ్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఉత్తర్వులు జారీ చేశారు. కాంట్రాక్టర్లకు నిధులు విడుదలతోపాటు భూ కేటాయింపుల ఫైళ్లను నిలిపి వేయాలని పేర్కొన్నారు. రెవిన్యూశాఖ మంత్రి పేషీలోని రికార్డుల ఫైళ్లను జాగ్రత్తపరచాలని అధికారులను ఆయన ఆదేశించారు. వీటితోపాటు ఉద్యోగుల బదిలీలకు సంబంధించిన ఫైళ్లను కూడా తక్షణమే నిలిపివేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

టిడిపి కార్యకర్త హత్య

- దారికాచి దాడి చేసిన వైసిపి కార్యకర్తలు

ప్రజాశక్తి-దుగ్గిరాల (గుంటూరు జిల్లా)

ఖాసిం

గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలంలో దారుణం చోటుచేసుకుంది. చిలువూరు గ్రామంలో టిడిపి కార్యకర్త షేక్ ఖాసింపై.. వైసిపి కార్యకర్తలు మంగళవారం దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఖాసిం బుధవారం మృతి చెందారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం తెలుగుదేశం పార్టీ గెలిచిందన్న సంతోషంతో చిలువూరు గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త షేక్ ఖాసిం తన ద్విచక్ర వాహనానికి ఆ పార్టీ జెండా కట్టుకొని వెళ్తున్నారు. వైసిపి ఓటమిని తట్టుకోలేక తుమ్మపూడి గ్రామానికి చెందిన ఆ పార్టీ కార్యకర్తలు కర్రలు, క్రికెట్ బ్యాట్‌తో దారి కాచి దాడి చేశారు. ఖాసిం తలకు తీవ్ర గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు మంగళగిరిలోని ఎన్ఆర్ఐ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. తుమ్మపూడి గ్రామానికి చెందిన జూపూడి హర్షవర్ధన్, పోపూరి హదయ రాజు, బోడపాటి కమలాకర్, నీరుకొండ చిన్నబాబులపై దుగ్గిరాల ఎస్ఐ పి.మహేంద్ర కేసు నమోదు చేశారు. తుమ్మపూడిలో ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా పోలీస్ టికెట్ ఏర్పాటు చేశారు.

ఎన్నికల కోడ్ పేరుతో సస్పెండ్ చేసిన వారిని విధుల్లోకి తీసుకోండి

- ఎస్‌డబ్ల్యుఎఫ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఎన్నికల కోడ్ పేరుతో ఎపిఎస్ ఆర్‌టిసిలోని ఉద్యోగులపై విధించిన అక్రమ సస్పెన్షన్లను తక్షణం ఎత్తివేయాలని ఎపిపిటిడి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం ఎపిఎస్‌ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావుకు ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎస్‌కె జిలానిబాషా వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో జనరల్ ఎన్నికల సందర్భంగా 154 మంది ఆర్‌టిసి ఉద్యోగులను మోడల్ కోడ్ ఆఫ్ కాంటాక్ట్ పేరుతో అకారణంగా సస్పెండ్ చేశారని వివరించారు. తక్షణం వీరందరికీ తమ నిర్దోషిత్వాన్ని నిరూపించుకునేందుకు అవకాశం కల్పించి సస్పెన్షన్‌ను ఎత్తివేసేందుకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. తక్షణం సస్పెండ్ అయిన ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలని కోరారు.

వైసిపి ఓట్లకు కాంగ్రెస్ గండి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో వైసిపి దారుణ ఓటమికి కాంగ్రెస్ తెచ్చిన ఓట్ల చీలక కూడా కారణమైందని పలువురు అభిప్రాయపడుతున్నారు. 2014కు ముందు రాష్ట్రంలో బలంగా వున్న కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర విభజన తరువాత నామమాత్రంగా మారిన విషయం తెలిసందే. ఆ పార్టీ నాయకులతో పాటు ఓటింగ్ కూడా వైసిపికి బదిలీ అయింది. 2014, 2019లో జరిగిన ఎన్నికల్లో ఈ ప్రభావం కనిపించింది. 2014, 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ తరుపున పోటీచేసిన వారికి నోటా కంటే తక్కువ ఓట్లు వచ్చాయి. 2024 నాటికి పరిస్థితులు కొంత మారాయి. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుమార్తె వైఎస్ షర్మిల వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో విభేదించి కాంగ్రెస్‌లో చేరి ఏకంగా పిసిసి పగ్గాలు చేపట్టడంతో ఒక్కసారిగా కాంగ్రెస్‌పార్టీకి కలిసి వచ్చినట్లు అయ్యింది. రాష్ట్ర వ్యాప్తంగా ఆమె పర్యటనలకు ప్రజలు భారీ ఎత్తున రావడంతో ఏదోఒక రోజు రాష్ట్రంలో కాంగ్రెస్‌కు భవిష్యత్ వుంటుందని వైసిపిలో ఇమడలేని నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. వైసిపి టికెట్ ఇవ్వకపోవడంతో నలుగురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారు. చాలా నియోజకవర్గాల్లో మైనార్టీలు కాంగ్రెస్‌వైపు మొగ్గు చూపడంతో రాష్ట్రంలో దాదాపు 10 నియోజకవర్గాల్లో తెలుగుదేశానికి వచ్చిన మెజారిటీల ఓట్లకంటే కాంగ్రెస్‌కు ఎక్కువ ఓట్లు వచ్చాయి. చీరాల నియోజవర్గంలో టిడిపి అభ్యర్థి కొండయ్య 72,700 ఓట్లు రాగా వైసిపి అభ్యర్థి కరణం వెంకటేష్‌కు 51,716 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ నుండి బరిలో నిలిచిన ఆమంచి కృష్ణమోహన్ 41,859 ఓట్లు తెచ్చుకోవడంతో టిడిపి అభ్యర్థి 20,984 ఓట్లతో గెలుపొందారు. ఇక్కడ కృష్ణమోహన్ ఓట్లను చీల్చకపోతే వైసిపిదే విజయమయ్యేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. జగన్‌మోహన్‌రెడ్డి సొంతజిల్లా కడపలోనూ ఈ ఓట్ల చీలిక వైసిపికి గండికొట్టింది. కడపలో డిప్యూటి సిఎం అమ్జాద్‌భాషపై తెలుగుదేశం అభ్యర్థి రెడ్డిగారి మాదవి 18,860 ఓట్ల మెజారిటీతో గెలుపొందగా ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన అఫ్జల్ ఖాన్‌కు 24,500 ఓట్లు వచ్చాయి. రాయచోటి నియోజవర్గం నుండి వైసిపి తరుపున పోటీ చేసిన గడికోట శ్రీకాంత్‌రెడ్డి 2,495 ఓట్లతో టిడిపి అభ్యర్థి రాంప్రసాద్‌రెడ్డి చేతిలో ఓటమి కారణం అక్కడ కాంగ్రెస్ అభ్యర్థి షేక్ అల్లాబక్ష్ 5,571 ఓట్లను చీల్చడమే.

గిద్దలూరు అసెంబ్లీ నియోజకవర్గం నుండి తెలుగుదేశం పార్టీ అలాగే గెలిచింది. గిద్దలూరు అసెంబ్లీకి పోటీచేసిన ఎం అశోక్‌రెడ్డి కేవలం 973 ఓట్లతో ఓటమి పాలయ్యారు. అశోక్‌రెడ్డికి 98,463 ఓట్లు పోలవగా వైసిపి అభ్యర్థి కె నాగార్జునరెడ్డికి 97,490 ఓట్లు వచ్చాయి. ఇక్కడ పోటీ చేసిన కాంగ్రెస్ అభ్యర్థి పి పెద్దరంగస్వామికి 2,879 ఓట్లు వచ్చాయి. ధర్మవరం నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి అశ్వర్ధనారాయణ 3,758 ఓట్లు తెచ్చుకోవడంతో వైసిపి కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి బిజెపి అభ్యర్థి కెసత్యకుమార్ చేతిలో 3,734 ఓట్ల తేడాతో ఓటమి చవిచూశారు.అలాగే రాష్ట్రంలోని సత్యవేడు నియోజకవర్గం, గుంతకల్లు, మడకశిర, నందికొట్కూర్, మదనపల్లె తదితర నియోజకవర్గాల్లోనూ కాంగ్రెస్ సాధించిన ఓట్లు వైసిపి ఓటమికి దారితీసిందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ప్రభుత్వ సలహాదారు పదవికి సజ్జల రామకృష్ణారెడ్డి రాజీనామా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వం ఓడిపోవడంతో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు బుదవారం సజ్జల రామకృష్ణారెడ్డితోపాటు 20మంది ప్రభుత్వ సలహాదారులు తమ రాజీనామా లేఖలను సిఎస్ జవహర్‌రెడ్డికి పంపారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రభుత్వ సలహాదారులు పెద్దసంఖ్యలో వున్నా సజ్జల రామకృష్ణారెడ్డి ప్రభుత్వంలో కీలకపాత్ర పోషించేవారు. జాతీయ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్, ఉన్నత విద్యామండలి ఛైర్మన్ హేమచంద్రారెడ్డి, టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, అధికార భాషా సంఘం అధ్యక్షులు విజయ్‌బాబులు ఇప్పటికే రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఎన్నికలకు ముందు తన డిప్యూటేషన్ పొడిగించాలని దరఖాస్తు చేసుకుని అనుమతి పొందిన సమాచార పౌర సంబంధాలశాఖ కమిషనర్ తుమ్మా విజయ్‌కుమార్‌రెడ్డి వైసిపి ఓటమి పాలవడంతో తనను రిలీవ్ చేయాలని ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. కడప ఆర్కిటెక్చర్ వర్సిటీ రిజిస్ట్రార్ పదవి నుంచి రిలీవ్ చేయాలని జగన్ బంధువు ఇసి సురేంద్రనాథ్ రెడ్డి కోరారు.

సెలవుపై అమెరికాకు సిఐడి చీఫ్ ఎన్ సంజయ్

గత ప్రభుత్వ హయాంలో ప్రతిపక్షనేత నారా చంద్రబాబునాయుడితోపాటు పలువురిని వేధించి అక్రమ కేసులను బనాయించారనే ఆరోపణలను ఎదుర్కొంటున్న సిఐడి చీఫ్ ఎన్.సంజయ్ సెలవుపై వెళ్లేందుకు ప్రభుత్వం వద్ద అనుమతులను పొందారు. ఈ నెల 6వ తేదీ నుండి 28 రోజులపాటు ఎన్ సంజయ్ అమెరికాకు వెళ్లేందుకు సిఎస్ జవహర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

తెనాలికి పూర్వ వైభవం తెస్తాం

- ఎమ్మెల్యే నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి తెనాలి (గుంటూరు జిల్లా)

తెనాలికి పూర్వ వైభవం తెస్తామని ఎమ్మెల్యే నాదెండ్ల మనోహర్ తెలిపారు. ప్రజా తీర్పు ఎంతో విలువైనదని, ప్రభుత్వ మార్పు కోసం వేచి చూసిన ప్రజలు మంచి తీర్పును ఇచ్చారని అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఘన విజయం సాధించిన మనోహర్ బుధవారం తెనాలిలోని జనసేన పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఐదేళ్ల జగన్ పాలనతో ప్రజలు విసిగిపోయారని, వేసవి తీవ్రతను సైతం లెక్కచేయకుండా బారులు తీరి ఓటు హక్కును వినియోగించుకున్నారని తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డి చేతకాని పాలనతో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో నెట్టేశారని, సామాన్యుల జీవితాలను చిన్నాభిన్నం చేశారని, ప్రజలు స్వేచ్ఛగా మాట్లాడే హక్కులు సైతం హరించి వారిని భయభ్రాంతులకు గురిచేసి చేశారని ధ్వజమెత్తారు. ప్రశ్నించే సత్తా ఉన్న యువతను నోరు మెదపకుండా గంజాయికి బానిసలను చేశారని ఆరోపించారు. వైసిపి పాలనలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో పేదలకు సరైన వైద్యం అందలేదని, ఆరోగ్యశ్రీ సేవలకు బిల్లులు సకాలంలో చెల్లించకుండా ఆ సేవలకు విఘాతం కలిగించారని పేర్కొన్నారు. తెలుగు భాష కోసం పోరాటం చేయాల్సిన దుస్థితి తెచ్చారన్నారు. అధికారం ఇచ్చిన ప్రజలకు సేవ చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందని గుర్తించాలన్నారు. కూటమిని ఆశీర్వదించిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. తన గెలుపు కోసం అహర్నిశలు శ్రమించిన మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎంపి పెమ్మసాని చంద్రశేఖర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తెనాలికి పూర్వ వైభవం తెస్తామని హామీ ఇచ్చారు.

జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండండి

- అల్లూరి జిల్లా డిఎంహెచ్ఒ జమాల్‌బాషా

ప్రజాశక్తి - పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా)

మలేరియా, ఇతర జ్వరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అల్లూరి సీతారామరాజు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సి జమాల్ బాషా తెలిపారు. పాడేరు మండలం వనుగుపల్లి పంచాయతీ శివారు పివిటిజి గ్రామమైన చింతగున్నలులో బుధవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఆ గ్రామంలో గత నెలలో మలేరియా పాజిటివ్ కేసులు నమోదవడం తో బాధితుల ఆరోగ్య పరిస్థితులను, అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఎపిడిమిక్ సీజన్లో మలేరియా, డెంగీ, టైఫాయిడ్, పచ్చకామెర్లు వంటి వ్యాధులు ప్రబలకుండా ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ఫీవర్ సర్వే చేశారు. దోమలు అభివృద్ధి చెందకుండా, కుట్టకుండా జాగ్రత్తలు తీసు కోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకో వాలని ప్రజలకు సూచించారు. తొలుత ఆయన మినుములూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులను పరిశీలించి, మాతా శిశు మరణాలు సంభవించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పిహెచ్‌సి వైద్యాధికారి ఎ గోపాలకృష్ణకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మినుములూరు సబ్ సెంటర్‌లో జరుగుతున్న జాతీయ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో పాల్గొని గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆయన వెంట మినుములూరు వైద్య సిబ్బంది ఎలీషారావు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

ఎన్ఎఒబి నిర్వాసితుల ధర్నా

ప్రజాశక్తి - రాంబిల్లి (అనకాపల్లి జిల్లా)

తమ సమస్యలను పరిష్కరించాలంటూ నేవల్ ఆల్టర్‌నేటివ్ ఆపరేషన్ బేస్ (ఎన్ఎఒబి) ప్రాజెక్టు నిర్వాసితులు గురువారం అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలంలోని పెద్దకలవలపల్లి గ్రామంలో ధర్నా చేశారు. ఎన్ఎఒబి కోసం డిఆర్‌డిఒ తమ గ్రామ రెవెన్యూలో ఏడు కిలోమీటర్ల మేర ప్రహరీ నిర్మాణం చేపడుతుండడంతో తమకు జరిగే నష్టాన్ని పేపర్లపై రాసి ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. వారినుద్దేశించి మాజీ ఎంపిటిసి సభ్యులు రావి దేముళ్ళ మాట్లాడుతూ తమ పూర్వీకుల నుంచి గొర్రెలు, మేకలు, గేదెలు, ఆవులను మేపుకుంటూ సమీపంలోని కొండలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నామన్నారు. కాంట్రాక్టర్ల నుండి పెద్ద మొత్తంలో లంచాలు తీసుకుని నిర్వాసితులకు అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ఎఒబికి అవసరమైన భూమి తీసుకునేటప్పుడు గ్రామ సభ నిర్వహించి ప్రజల ఇబ్బందులను తెలుసుకోవాల్సిన అధికారులు అవేమీ పట్టించుకోకుండా ముందుకెళు న్నారన్నారు. కొత్తగా కొలువుదీరే ప్రభుత్వమైనా దీనిపై పూర్తి విచారణ జరిపి అవినీతికి పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు గుర్రం నూకినాయుడు, యలమంచిలి శ్రీను, భారీగా మహిళలు పాల్గొన్నారు.

తిరుమల ఘాట్ రోడ్డులో ప్రమాదం

ప్రజాశక్తి - తిరుమల

తిరుమల మొదటి ఘాట్ రోడ్డులో రోడ్డు ప్రమాదం జరిగింది. 24వ మలుపు ఆంజనేయస్వామి విగ్రహం దగ్గర డివైడర్‌ను జీపు ఢీకొంది. ఈ ప్రమాదంలో నలుగురు యాత్రికులకు గాయాలయ్యాయి. తిరుమల నుంచి తిరుపతికి వస్తుండగా ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. ఘటనాస్థలికి చేరుకున్న విజిలెన్స్ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. గాయపడ్డ వారిని తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు.

లోకేష్‌ను కలిసిన టిడిపి ఎంపిలు, ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను టిడిపి ఎంపిలు, ఎమ్మెల్యేలు కలిశారు. ఉండవల్లిలోని ఆయన నివాసంలో బుధవారం కలిసి పలు అంశాలపై చర్చించారు. విజయవాడ, నరసరావుపేట, ఒంగోలు ఎంపిలు కేశినేని శివనాథ్, లావు కృష్ణదేవరాయలు, మాగుంట శ్రీనివాసులురెడ్డి కలిశారు.

రేపల్లె, ఆచంట, పాలకొల్లు, పెదకూరపాడు, నూజివీడు, మచిలీపట్నం, విజయవాడ తూర్పు, పొన్నూరు, గన్నవరం, అమలాపురం, తిరువూరు ఎమ్మెల్యేలు అనగాని సత్యప్రసాద్, పితాని సత్యనారాయణ, నిమ్మల రామానాయుడు, భాష్యం ప్రవీణ్‌కుమార్, కొలుసు పార్థసారథి, కొల్లు రవీంద్ర, గద్దె రామ్మోహన్‌రావు, ధూళిపాళ్ల నరేంద్ర, అయితాబత్తుల ఆనందరావు, యార్లగడ్డ వెంకట్రావు, కొలికపూడి శ్రీనివాస్, జనసేన పార్టీ విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ యాదవ్, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, మాజీ కేంద్రమంత్రి పనబాక లక్ష్మి, శాసన మండలి మాజీ ఛైర్మన్ ఎంఎ షరీఫ్, ఎమ్మెల్యేలు మంతెన రామరాజు, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ తదితరులు లోకేష్‌కు అభినందనలు తెలిపారు. వీరితోపాటు మంగళగిరి నియోజకవర్గం ప్రజలు, టిడిపి నాయకులు, కార్యకర్తలు లోకేష్‌ను కలిసి అభినందనలు తెలిపారు.

కరకట్టపై కోలాహలం

ఎన్నికల్లో గెలుపొందిన టిడిపి ఎంపి, ఎమ్మెల్యేలు చంద్రబాబు నివాసానికి బుధవారం క్యూ కట్టారు. వీరితోపాటు పలువురు ఐఎఎస్, ఐపిఎస్ అధికారులు, టిడిపి నేతలు, కార్యకర్తలు రావడంతో ఉండవల్లిలోని కరకట్ట వద్ద కోలాహలం నెలకొంది.

విభజన హామీలకు కట్టుబడితేనే మద్దతివ్వండి

- బాబు, పవన్‌లకు వైఎస్ షర్మిల విజ్ఞప్తి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రజల ఆకాంక్షల మేరకు టిడిపి, జనసేన, బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి పెట్టాలని పిసిసి రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సూచించారు. నూతన ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తున్న టిడిపి అధ్యక్షులు చంద్రబాబునాయుడు, జనసేన అధ్యక్షులు పవన్‌కల్యాణ్‌లకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రజలు ఇచ్చిన తీర్పును తాము గౌరవిస్తున్నామన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా రావాలని, పోలవరంతో సహా అన్ని ప్రాజెక్టులు పూర్తి కావాలని, రాజధాని నిర్మాణం జరగాలని ఆమె పేర్కొన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం ఆలోచన చేసి విభజన హామీలు అమలు, ప్రత్యేక హోదాకోసం కట్టుబడితేనే కేంద్రంలో ప్రభుత్వ ఏర్పాటుకు మద్దతివ్వాలని వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. ప్రజల పక్షాన పోరాటాలు చేస్తూ జనం గొంతుకగా కాంగ్రెస్ పార్టీ మారిందన్నారు. రాష్ట్ర ప్రజల పక్షాన కాంగ్రెస్ పార్టీ నిలబడి పోరాడుతుందన్నారు.

ప్రజలపై నెపాన్ని నెట్టడం సిగ్గుచేటు

- జగన్‌పై టిడిపి ఎమ్మెల్యే నిమ్మల ఆగ్రహం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల్లో ప్రజాతీర్పుపై ఆత్మవిమర్శ చేసుకోకుండా ప్రజలపై నెపాన్ని నెట్టడం సిగ్గుచేటని టిడిపి ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలే తనను మోసం చేశారంటూ జగన్ మాట్లాడటం కంటే సిగ్గుమాలిన, హేయమైన చర్య మరొకటి లేదని విమర్శించారు. టిడిపి కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జగన్ అరాచక, నిరంకుశ, నియంతృత్వ పాలనను కూకటివేళ్లతో ప్రజలు పెకిలించారని అన్నారు. అమరావతి నిర్మాణానికి ఒక్క ఇటుక రాయి కూడా వేయకుండా రాజధాని లేని రాష్ట్రంగా చేశారని పేర్కొన్నారు. పోలవరాన్ని ముంచినందుకే వైసిపిని పాతిపెట్టారని తెలిపారు. పాలకులు అనే వాళ్లు యజమానులు కాదు సేవకులు అనే విషయాన్ని జగన్ మరచిపోయారని చెప్పారు.

ఉత్కంఠంగా పట్టభద్రుల కౌంటింగ్!

- కొనసాగుతున్న మొదటి రౌండ్ లెక్కింపు, మల్లన్న ముందంజ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక కౌంటింగ్ ఉత్కంఠ రేపుతోంది. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం 4 గంటల వరకూ కట్టలు కట్టడం పూర్తయింది. ఆ తర్వాత మొదటి రౌండ్ ఓట్ల లెక్కింపు ప్రారంభించారు. బుధవారం రాత్రి పది గంటల వరకు అందిన సమాచారం మేరకు లెక్కించిన ఓట్లలో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న ముందంజలో ఉన్నారు. కాంగ్రెస్‌కు 2167 ఓట్లు రాగా, బిఆర్ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డికి 1573 ఓట్లు వచ్చాయి. చెల్లని ఓట్లు కూడా భారీగా పడినట్టు సమాచారం. బిజెపి అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డికి 750 ఓట్లు పడ్డాయి. పట్టభద్రుల నియోజకవర్గంలో మొత్తం 4,63,839 ఓట్లు ఉండగా, గత నెల 27న జరిగిన పోలింగ్‌లో 3,36,013 ఓట్లు నమోదయ్యాయి.

మొదటి ప్రాధాన్యత ఓటుతోనే గెలుపు తీన్మార్ మల్లన్న

పట్టభద్రులు అన్ని విధాలుగా ఆలోచించి ఓట్లు వేశారని, విజయం తనదేనని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న ధీమా వ్యక్తం చేశారు. కౌంటింగ్ కేంద్రం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు.

నీట్ 2024 ఫలితాల్లో శ్రీచైతన్య సరికొత్త రికార్డ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నీట్ 2024 ఫలితాల్లో శ్రీచైతన్య ఆల్‌టైం రికార్డు సృష్టించింది. ఓపెన్ కేటగిరిలో 720కి 720 మార్కులతో తొమ్మిది ఆలిండియా ఫస్ట్ ర్యాంకులు సాధించింది. టాప్ ర్యాంకులతో పాటు టోటల్ ర్యాంకుల్లోనూ శ్రీచైతన్య విద్యార్థులు తిరుగులేని ఆధిపత్యం ప్రదర్శించారు. ఓపెన్ కేటగిరిలో వి. కల్యాణ్, పి.పవన్ కుమార్ రెడ్డి, ముఖేష్ చౌదరి, భానుతేజసాయి, ఇరాన్ ఖ్వాజీ, దర్శ్ పగ్దార్, ఇషా కొఠారి, ఆదర్శ్ సింగ్ మోయల్, అమీనా అరిఫ్ కడివాలాలు ఒకటవ ర్యాంకు సాధించారు. 720మార్కులతో తొమ్మిది మంది, 715 మార్కులు ఆపైన 57మంది, 700 మార్కులు ఆ పైన 132 మంది, 650 మార్కులు ఆపైన 852 మంది శ్రీ చైతన్య విద్యార్థులే. ఈ సందర్భంగా శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మ మాట్లాడుతూ..నీట్ 2024లో తమ విద్యార్థుల అద్భుత ప్రతిభ గర్వంగా ఉందన్నారు. ఈ విజయానికి కారణమైన విద్యార్థులకు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులందరికీ అభినందనలు తెలిపారు. ఎయిమ్స్‌లో 27శాతం మంది వైద్యులు శ్రీచైతన్యలో చదివినవారేననీ చెప్పారు. త్వరలో జరిగే ఐఐటి అడ్వాన్స్‌లోనూ తమ విద్యార్థులు సత్తా చాటుతారని ఆమె ఆశాభావం వ్యక్తంచేశారు.

ప్రజాతీర్పును బాధ్యతగా స్వీకరిస్తా

(మొదటి పేజీ తరువాయి)

చెప్పారు. 'బాంబుల దాడిని కూడా తట్టుకుని నిలబడ్డా. కానీ, ఆ అవమానాన్ని భరించలేకపోయాను' అని ఆయన గద్గద స్వరంతో చెప్పారు. పాలన ఎలా ఉండకూడదో చెప్పడానికి జగన్ ఒక కేస్ స్టడీ అని వ్యాఖ్యానించారు. 'జగన్ అహంకారం, అవినీతి, విధ్వంసంతో ప్రతి ఒక్కరూ దెబ్బతిన్నారు. ఐదేళ్లుగా స్వేచ్ఛ, స్వతంత్రాలను కోల్పోయారు. అరాచకాన్ని చవిచూశారు. బతకడంపై ఆశను కోల్పోయారు.'అని చంద్రబాబు అన్నారు. 'ఇటువంటి పాలనను నా అనుభవంలో చూడలేదు. అందుకే ప్రజలు గెలవాలి. రాష్ట్రం నిలవాలి అని పిలుపునిచ్చా. ప్రజలు అనూహ్యంగా మద్దతు ఇచ్చారు. వైసిపి ఐదేళ్ల పాలనలో 30 ఏళ్ల నష్టం జరిగింది' అని అన్నారు. 'రాజకీయాల్లో ఎవరూ శాశ్వతం కాదు. దేశం, ప్రజాస్వామ్యం, పార్టీలే శాశ్వతం. పంథా లేని పార్టీలు ఎన్నో కనుమరుగయ్యాయి.' అని చంద్రబాబు చెప్పారు.

కార్యకర్తల త్యాగాల వల్లే

కార్యకర్తలు చేసిన అసమాన త్యాగాలే తెలుగుదేశం పార్టీని గెలుపు బాట పట్టించాయని చెప్పారు. 'ప్రాణాలు తీస్తున్నా జై తెలుగుదేశం అంటూ చంద్రయ్య వంటి వారు త్యాగాలు చేశారు. దానివల్లే ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోగలిగాం.' అని అన్నారు. జగన్ అందర్నీ ఇబ్బందులకు గురిచేశారని మీడియా నూ కూడా వదల లేదని చెప్పారు. మీడియా ప్రతినిధులను కోర్టుల చుట్టూ, సిఐడి ఆఫీసుల చుట్టూ తిప్పారని అన్నారు. పవన్‌ను కూడా విశాఖ నగర బహిష్కరణ చేశారని, కేసులు ఎందుకు పెట్టారో కూడా చెప్పకుండా ఆరెస్టు చేయించారని అన్నారు. పవన్ కల్యాణ్ ముందుకొచ్చి కూటమికి బీజం వేసినందుకు అభినందిస్తున్నానని తెలిపారు. ఇసుక, మైనింగ్, పొలాలనూ తవ్వేశారని ప్రాణభయంతో రైతులు కూడా మాట్లాడలేని పరిస్థితిని సృష్టించారని అన్నారు.

ప్రజలు సహకరించారు

అసెంబ్లీలో తన కుటుంబాన్ని అవమానపరిచినప్పుడు మళ్లీ సిఎంగా గెలిచే సభలోకి వస్తానని ప్రతిన చేసి బయటకు వచ్చానని, ఆ ప్రతినను నెరవేర్చేందుకు ప్రజలు ఎంతగానో సహకరించారని చెప్పారు. శాసనసభను మళ్లీ గౌరవ సభగా మారుస్తానన్నారు. ఓట్లు వేయడమే కాకుండా పాలనలో కూడా ప్రజల నుండి సహకారం కావాలని, ప్రభుత్వ పనితీరుపై ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందించాలని కోరారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సరైన సమయంలో సరైన నిర్ణయం

(మొదటి పేజీ తరువాయి)

ప్రాథమిక నిబద్ధత ఉన్న ఏ రాజకీయ పార్టీనైనా ఇండియా ఫోరంలోకి స్వాగతిస్తామని అన్నారు. మోడీకి, ఆయన రాజకీయ శైలికి వ్యతిరేకంగా తీర్పు వచ్చిందన్నారు. మోడీ వ్యక్తిగతంగా, రాజకీయంగా తీవ్ర నష్టాన్ని, నైతిక పరాజయాన్ని చవిచూశారన్నారు. కానీ మోడీ ఇప్పటికీ ప్రజల తీర్పును తారుమారు చేయాలనే పట్టుదలతో ఉన్నారని ఖర్గే విమర్శించారు.

సిపిఎం ప్రధాన కార్యాదర్శి సీతారాం ఏచూరి మాట్లాడుతూ తొలుత తాము ఎన్నికల ఫలితాల ప్రాధాన్యతను విశ్లేషించామని చెప్పారు. ఎలా ముందుకు వెళ్లాలనేదానిపై భాగస్వామ్య పార్టీలను సంప్రదించామని చెప్పారు. తమకు చాలా సమయం ఉందని, ఎన్డీయే కూడా వారి ప్రయత్నాలు వారు చేసుకుంటారని అన్నారు. బిజెపి ఏకైక అతిపెద్ద పార్టీగా ముందుకొస్తే ఏమవుతుందని ఆయన ప్రశ్నించారు. బిజెపి, మోడీలకు గట్టి ఎదురుదెబ్బ తగిలిందన్నారు. ధనబలం, అధికార బలంతో అధికారాన్ని చేజిక్కించుకోవాలని ప్రయత్నించారని, కాని సాధ్యం కాలేదని అన్నారు. కేంద్ర సంస్థలను ఉపయోగించి ప్రతిపక్ష నేతలపై దాడికి దిగారని, పెద్ద మొత్తంలో డబ్బు ఖర్చు చేశారని అన్నారు. అయినా ఫలితం దక్కలేదని అన్నారు. రాజకీయ నేతలను ఎలా ఎన్నుకోవాలో యుపి ప్రజలు చూపించారని సీతారాం ఏచూరి అన్నారు.

ఈ సమావేశంలో కాంగ్రెస్ నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, తమిళనాడు ముఖ్యమంత్రి, డిఎంకె అధినేత ఎంకె స్టాలిన్, సిపిఎం ప్రధాన కార్యాదర్శి సీతారాం ఏచూరి, సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, సిపిఐఎంఎల్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, ఎన్‌సిపి అధినేత శరద్ పవార్, ఎస్పీ నేత అఖిలేష్ యాదవ్, జెఎంఎం నేత, జార్ఖండ్ ముఖ్యమంత్రి చంపయి సోరెన్, జెఎంఎం నేత కల్పనా సోరెన్, ఆర్జెడి నేత తేజస్వి యాదవ్, టిఎంసి నేత అభిషేక్ బెనర్జీ, శివసేన నేత సంజయ్ రౌత్, ఆప్ నేత రాఘవ్ చద్దా, నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఫరూక్ అబ్దుల్లా, కేరళ కాంగ్రెస్ నేత మణి, ఫార్వర్డ్ బ్లాక్ నేత దేవరాజన్ తదితరులు హాజరయ్యారు.

తిరుపతి, కోస్తాంధ్రలో భారీ వర్షాలు

పిడుగుపాటుకు మహిళ మృతి

ప్రజాశక్తి - యంత్రాంగం

రుతుపవనాల ప్రభావంతో తిరుపతి, కోస్తాంధ్రలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. భారీ ఈదురుగాలులకు రహదారులపై చెట్లు విరిగిపడ్డాయి. పలుచోట్ల విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. పశువుల రేకుల షెడ్లు దెబ్బతిన్నాయి. కాకినాడలో పిడుగుపాటుకు మహిళ మృతి చెందారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో మూగజీవాలు మృత్యువాతపడ్డాయి.

తిరుపతి జిల్లా బాలాయపల్లి మండలంలో వడగండ్ల వర్షం కురిసింది. అలిమిలి, వెంకటరెడ్డిపల్లి, అంబలపూడి, నిండలి గ్రామాల్లో మామిడి కాయలు నేల వాలాయి. వడగండ్ల వాన, ఈదురుగాలులతో అపార నష్టం వాటిల్లిందని రైతులు వాపోయారు. తిరుపతిలోనూ దాదాపు రెండు గంటల పాటు భారీ వర్షం కురిసింది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పలుచోట్ల వర్షం కురిసింది. రామచంద్రపురం, రాజమహేంద్రవరం రూరల్, కడియం, సామర్లకోట, పెద్దాపురం, రాజానగరం, కాకినాడ, రౌతులపూడి, తొండంగి, అమలాపురం, కొత్తపేట, రావులపాలెం మండలాల్లో గంటపాటు భారీ వర్షం పడడంతో రోడ్లపైకి వర్షపు నీరు చేరింది. అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలంలో ఈదురు గాలులు, మెరుపులతో కూడిన వర్షం పడింది. కొండిబ పంచాయతీ తోకవలస గ్రామంలో పిడుగు పడటంతో కిల్లో బాలరాజుకు చెందిన ఆరు మేకలు మృత్యువాతపడ్డాయి. అనకాపల్లి జిల్లాలోని నక్కపల్లి, మాడుగుల మండలాల్లో కురిసిన భారీ వర్షం, గాలులకు చెట్లు నేలవాలాయి. దీంతో, విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. రావికమతం మండలం గుమ్మాలపాడులో ఓ ఇంటిపై పిడుగు పడడంతో స్లాబ్ కూలిపోయింది. కోటవురట్ల మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోకి వర్షపు నీరు చేరింది. విశాఖలోనూ పలుచోట్ల వర్షం కురిసింది. పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట, పాలకొండ మండలాల్లో కుండపోత వర్షం ఏకధాటిగా కురిసింది. ఉరుములు, మెరుపులతో వర్షం కురవడంతో ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. విజయనగరం జిల్లా వేపాడ మండలంలో ఉరుములతో కూడిన వర్షం పడింది.

అల్లూరి జిల్లా అనంతగిరిలో కురుస్తున్న వర్షం

పిడుగుపాటుకు మహిళ మృతి

కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం ఎస్.అగ్రహారంలో పిడుగుపాటుకు మహిళ మృతి చెందారు. ఎస్.అగ్రహారం గ్రామానికి చెందిన ఏలూరి నారాయణ, దేవి (30) దంపతులు వ్యవసాయ కార్మికులు. వంట చెరకు నిమిత్తం కట్టెలు తెచ్చుకునేందుకు వీరిద్దరూ బయటకు వెళ్లారు. కట్టెలను సేకరిస్తుండగా వారికి సమీపంలో పిడుగుపడింది. దీంతో దేవి అక్కడికక్కడే మరణించారు.

బాపయ్య చౌదరికి నీతి ఆయోగ్ సత్కారం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

నాట్స్ మాజీ అధ్యక్షులు నూతి బాపయ్య చౌదరి (బాపు)ని నీతి ఆయోగ్ సత్కరించింది. నాట్స్ మన గ్రామం-మన బాధ్యత కార్యక్రమంలో భాగంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో వేలాదిమందికి సేవలు, సహాయ కార్యక్రమాలు చేస్తున్నందుకు ఆ సంస్థకు నీతి ఆయోగ్ గుర్తింపునిచ్చింది. బుధవారం నాడిక్కడ జరిగిన కార్యక్రమంలో బాపునకు నీతి ఆయోగ్ సభ్యులు విజయ్ కుమార్ సరస్వత్ గుర్తింపు పత్రాన్ని అందజేసి, సత్కరించారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ సరస్వత్ మాట్లాడుతూ నాట్స్, స్పర్శ్ ఫౌండేషన్ సంస్థలు రెండు తెలుగు రాష్ట్రాల్లోని వికలాంగులకు, వృద్ధులకు సేవా కార్యక్రమాలతోపాటు మొబైల్ వ్యాన్ ఏర్పాటు చేసి డాక్టర్ల సేవలను అందించడం అభినందనీయమన్నారు. వీటితోపాటు వారికి పునరావాస కార్యక్రమాలు చేపట్టడం గ్రామీణ గిరిజన తండాల్లోని అవసరమైన వారిని గుర్తించి సహాయ కార్యక్రమాలు చేయటం స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో నాట్స్ కోఆర్డినేటర్ రవి తాంద్ర, స్పర్శ్ ఫౌండేషన్ అధినేత పంచముఖి, జ్యోతిర్మయి పాల్గొన్నారు.

బాపయ్య చౌదరిని సత్కరిస్తున్న నీతి ఆయోగ్ సభ్యులు విజయ్‌కుమార్ సరస్వత్

పేరు మార్చుకుంటున్నా...

- వైసిపి నేత ముద్రగడ పద్మనాభం

ప్రజాశక్తి - కిర్లంపూడి (కాకినాడ జిల్లా)



త్వరలో తన పేరును పద్మనాభరెడ్డిగా మార్చుకుంటానని కాపు ఉద్యమ నేత, వైసిపి నేత ముద్రగడ పద్మనాభం సంచలన ప్రకటన చేశారు. కాకినాడ జిల్లా కిర్లంపూడిలోని స్వగృహంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పిఠాపురంలో జనసేనాని పవన్‌కల్యాణ్‌ను ఓడిస్తానని సవాల్ చేసి ఓటమి చెందానన్నారు. ఆ సవాల్ మేరకు పేరును మార్చుకునేందుకు గెజిట్ పబ్లికేషన్ కోసం అంతా సిద్ధం చేసుకున్నానని తెలిపారు. రెండు, మూడు రోజుల్లో దరఖాస్తు చేయబోతున్నట్లు చెప్పారు. తన పేరు మారిన తర్వాత మళ్లీ ఆ వివరాలు తెలుపుతానన్నారు. ఎన్నికల ఫలితాలపై ముద్రగడ స్పందించారు. కోట్లది మంది పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేసిన వైసిపిని ఎందుకు ఆదరించలేదనేది పెద్ద ప్రశ్నగా మిగిలిందన్నారు. సంక్షేమం కన్నా అభివృద్ధికే ఆసక్తి చూపించారా? లేదా ఎదుటివారి సంక్షేమ పథకాల హామీలకు మొగ్గు చూపారా? అనేది పరిశీలించాల్సి ఉందన్నారు. సంక్షేమ పథకాలకు ప్రజలు ఓటు వేయనప్పుడు రాబోయే రోజుల్లో ఏ ముఖ్యమంత్రి కూడా వాటి జోలికి వెళ్లే సాహసం చేయబోరని చెప్పారు. జనం కోసం కష్టపడ్డ జగన్‌ని గౌరవించకపోవడం బాధాకరమన్నారు. తన రాజకీయ ప్రయాణం జగన్‌తోనే కొనసాగుతుందని చెప్పారు. గెలుపొందిన కూటమి నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఓట్ల లెక్కింపులో వినూత్న పద్ధతులు

- అధికారులకు సిఇఓ ముఖేష్‌కుమార్ మీనా అభినందనలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని శాంతియుతంగా పూర్తిచేయడంతోపాటు, వినూత్న పద్ధతులతో ఎన్నికల ప్రక్రియను ప్రొఫెషనల్‌గా నిర్వహించిన అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, ఆర్‌ఓలు, ఎన్నికల సిబ్బందికి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్‌మీనా అభినందనలు తెలిపారు. ప్రతిభావంతులైన అధికారుల బృందానికి నాయకత్వం వహిస్తున్నందుకు తానెంతో గర్వపడుతున్నానని మీనా తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో ఎన్నికలు విజయవంతంగా నిర్వహించడంతోపాటు ఓట్ల లెక్కింపు ప్రక్రియలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అనుసరించిన మంచి పద్ధతులను భవిష్యత్తు తరాల వారికి ఎంతో ఆదర్శంగా, మార్గదర్శకంగా ఉండే విధంగా ఒక కరదీపికను రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాల వారీగా అనుసరించిన వినూత్న పద్ధతులను కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లేందుకు నివేదికలను తమ కార్యాలయానికి మూడు రోజుల్లో పంపాలని కోరినట్లు తెలిపారు. అన్ని జిల్లాల నుంచి వచ్చే నివేదికల ఆధారంగా ఒక సమగ్రమైన నివేదికను రూపొందించి కేంద్ర ఎన్నికల సంఘానికి నివేదిస్తామని ముఖేష్‌కుమార్ మీనా వెల్లడించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎటువంటి విమర్శలకు ఆస్కారం లేకుండా ఓటర్ల జాబితా రూపొందించిన అధికారులు, సిబ్బందికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం 2024 మార్చి 16న ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినప్పటి నుంచి జూన్ 4న ఓట్ల లెక్కింపు ప్రకియ పూర్తి చేసేంత వరకూ రాష్ట్రస్థాయి నుంచి మండలస్థాయి వరకు పనిచేసిన ఎన్నికల యంత్రాంగం, పోలీస్ యంత్రాంగం ఎంతో నిబద్ధతతో వ్యవహరిస్తూ వారి విధులను సక్రమంగా నిర్వహించడం జరిగిందన్నారు. ఎన్నికల నేపథ్యంలో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీస్ యంత్రాంగం ఎంతో నిబద్ధతతో వ్యవహరించిందన్నారు. కొన్నిచోట్ల చెదురుమదురు సంఘటనలు మినహాయిస్తే మొత్తం ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించడంలో సహకరించిన రాజకీయ పక్షాల ప్రతినిధులు, మీడియా ప్రతినిధులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

చంద్రబాబు ప్రమాణ స్వీకారం ఎక్కడ..?

- స్థలం ఎంపికపై రాని స్పష్టత

ప్రజాశక్తి - తుళ్లూరు (గుంటూరు జిల్లా)

రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం ఎక్కడ చేస్తారు.. అన్న దానిపై ఇంకా పూర్తి స్పష్టత రాలేదు. ముఖ్యమంత్రిగా రాజధాని అమరావతిలో ప్రమాణ స్వీకారం చేస్తానని చంద్రబాబు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయానికే ప్రమాణ స్వీకారం ఏర్పాట్లకు సంబంధించిన మెటీరియల్‌తో వాహనాలు రాజధానికి చేరాయి. రాజధాని ప్రాంతమైన రాయపూడిలోని సీడ్ యాక్సెస్ రోడ్డు వద్దకు టెంట్లు, స్టేజీ నిర్మాణం, బారికేడ్లు ఇతర సామగ్రితో పలు వాహనాలు వచ్చాయి. బుధవారం కూడా మరికొన్ని వాహనాలతోపాటు జంగిల్ క్లియరెన్స్, రోడ్డు చదును చేసేందుకు జెసిబిలు సైతం సిద్ధం చేశారు. అయితే, స్థలం ఎంపిక విషయంలో ఇంకా స్పష్టత రాలేదు. ప్రమాణస్వీకారం ఎన్నడ నిర్వహించాలన్న దానిపై స్పష్టత వచ్చిన వెంటనే అక్కడకు తరలించేలా సిద్ధం చేశారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు వచ్చే అవకాశం ఉన్నందున మరింత అనువుగా ఉండే స్థలం కోసం అన్వేషిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. దొండపాడు సమీపంలో గత ప్రభుత్వం సెంటు స్థలాల పంపిణీ కోసం సిద్ధం చేసిన ప్రదేశం అనువుగా ఉంటుందని టిడిపి నాయకులు, అధికారులు భావిస్తున్నట్లు సమాచారం. దొండపాడులో వంద ఎకరాల స్థలం ఉందని, ప్రమాణ స్వీకారానికి ఎటువంటి ఇబ్బందీ ఉండదని దొండపాడు మాజీ ఎంపిటిసి సభ్యులు నెలకుదిటి వేంకటేశ్వరరావు చెప్పారు. రెండురోజుల్లో స్థలం ఎంపిక విషయంలో స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

ప్రమాణస్వీకారానికి సంబంధించిన సామగ్రితో రాయపూడికి చేరుకున్న వాహనాలు

ప్రకృతి రక్షణకై నడుం బిగిద్దాం

- ఎపిపిసిబి మెంబర్ సెక్రటరీ బి.శ్రీధర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రపంచ పర్యావరణ దినోత్సవ సదస్సులో మాట్లాడుతున్న శ్రీధర్

ప్రకృతిని రక్షిద్దాం.. భావితరాలకు ఆదర్శంగా నిలుద్దామని ఎపి పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్ సెక్రటరీ బి.శ్రీధర్ పిలుపునిచ్చారు. ఎపి కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యాన 52వ ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా విజయవాడ ఎస్ఎసి కల్యాణ మండపంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. మానవ మనుగడ సజావుగా సాగాలంటే ప్రకృతిని కాపాడుకోవాలన్నారు. ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన లేక పోతే భావితరాల భవిష్యత్తును చేజేతులా మనమే నాశనం చేసిన వాళ్లమవుతామన్నారు. ప్రధానంగా మట్టి, నీరు, గాలి, కలుషితం కాకుండా చర్యలు తీసుకునే విధంగా ప్రతి ఒక్కరూ ప్రతిజ్ఞ చేయాలన్నారు. బోర్డు ఆధ్వర్యంలో పర్యావరణ రక్షణకై పలు అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. వేస్ట్ నుంచి ఎనర్జీ దిశగా అడుగులు మరింత వేగంగా వేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పెద్ద సంఖ్యలో మొక్కలు నాటాలని పిసిబి మెంబరు సెక్రటరీ బి.శ్రీధర్ పిలుపునిచ్చారు. పర్యావరణ హిత జీవనశైలిని ప్రతి ఒక్కరూ ఆచరించాలని సూచించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకంపై ప్రతి ఒక్కరూ తమ వంతుగా నిషేధం పాటించాలని, మార్కెట్‌కు వెళ్లేటప్పుడు క్లాత్ సంచిని తీసుకెళ్లాలని సూచించారు. ఆహార వృథా సైతం పరోక్షంగా పర్యావరణ కాలుష్యానికి కారణమవుతోందన్నారు. అకడమిక్ డైరెక్టర్ జెఎన్‌టియు (కాకినాడ) ప్రొఫెసరు కెవిఎస్‌జి మురళీకృష్ణ మాట్లాడుతూ మానవుల ప్రవర్తన ప్రకృతిహితంగా ఉండాలని, పుడమి ఇచ్చిన అవకాశాన్ని నాశనం చేసుకోరాదని హెచ్చరించారు. ఆంధ్రా యూనివర్శిటీ మాజీ ప్రొఫెసరు డాక్టర్ కె. కామేశ్వరరావు మాట్లాడుతూ సహజ వనరులు వృథా చేసుకోవడం క్షమించరాని నేరమన్నారు. భూమిపై ఒక సెంటీమీటర్ మట్టిపొర ఏర్పడాలంటే కనీసం వందేళ్లు పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ ఎన్‌వి భాస్కరరావు, పరిరక్షణ సంస్థ అధ్యక్షులు ఎవి రత్నం, ఎపి కాలుష్య నియంత్రణ మండలి జోనల్ కార్యాలయ అధికారి పి.మునిస్వామి నాయుడు, ప్రాంతీయ కార్యాలయ అధికారి పి.శ్రీనివాసరావు, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్లు, అధికారులు పాల్గొన్నారు.

సామాన్యులకు వినోదం భారం

- త్వరలోనే 5-8 శాతం ధరలు పెంచనున్న ఛానళ్లు
- వయోకామ్ 18 ఏకంగా 25% వడ్డింపు
- బ్రాడ్‌కాస్ట్ పరిశ్రమ వర్గాల వెల్లడి

న్యూఢిల్లీ : సార్వత్రిక ఎన్నికలు ముగిశాయి. మూడో సారి మోడీ సర్కార్ గద్దెను ఎక్కనుంది. అదే క్రమంలో ఎప్పటిలాగే ప్రజలపై ధరల భారాలను పెంచనున్నట్లు స్పష్టమవుతోంది. సామాన్యులు కుటుంబంతో కలిసి వినోదాలు పొందే టివి ఛానళ్లు త్వరలోనే భారం కానున్నాయని రిపోర్టులు వస్తున్నాయి. ఛానళ్ల ధరల పెంపునకు కసరత్తు జరుగుతుందని బ్రాడ్‌కాస్ట్ పరిశ్రమ వర్గాలు వెల్లడించాయి. టివి ఛానళ్ల చందా రుసుములు 5-8 శాతం పెరుగుతాయని అంచనా వేస్తున్నారు. డిస్నీ స్టార్, వయాకామ్ 18, జి ఎంటర్‌టైన్‌మెంట్, సోనీ పిక్చర్స్ నెట్‌వర్క్స్ ఇండియా వంటి బ్రాడ్‌కాస్టర్లు తమ ఛానెళ్ల ధరల్ని పెంచడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు.

ప్రముఖ బ్రాడ్‌కాస్టర్లు జనవరిలో తమ బేస్ రేట్లను సుమారు 10 శాతం పెంచాలని నిర్ణయించాయి. అదే విధంగా భారతీయ క్రికెట్ హక్కులను చేజిక్కించుకోవడంతో సాధారణ ఎంటర్‌టైన్‌మెంట్ ఛానెళ్ల కంటే వయోకామ్18 అత్యధికంగా 25 శాతం పైగా రేట్లను పెంచింది. కొత్త ధరలు ఫిబ్రవరి ఒక్కటి నుంచే అమలులోకి రావాల్సి ఉంది. అయితే.. ఎన్నికల నేపథ్యంలో మోడీ సర్కార్ ఇందుకు అనుమతులు ఇవ్వక పోవడంతో ట్రాయ్ ధరల పెంపును తాత్కాలికంగా నిలిపివేసింది. ఎన్నికల తర్వాత పెంపునకు అంతర్గతంగా అంగీకారానికి వచ్చారని సమాచారం. ప్రస్తుతం సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగిసిన నేపథ్యంలో రేట్లు పెంచేందుకు యాజమాన్యాలు ఒత్తిడి చేస్తున్నాయి. త్వరలోనే మిగతా బ్రాడ్‌కాస్టర్స్ కూడా ధరలు పెంచనున్నట్లు తెలుస్తోంది. బ్రాడ్‌కాస్టర్లకు ట్రాయ్ అనుమతులిస్తే సామాన్యుడిపై టివి ఛానళ్ల పిడుగు భారం పడనుంది.

केनरा बैंक Canara Bank (A Government of India Undertaking) भारत सरकार का उपक्रम
सिंडिकेट Syndicate

కెనరా బ్యాంక్, ఏఆర్ఎం శాఖ: ఎంసిహెచ్ నం.10-3-163 & 10-3-163/ఎ, ప్లాట్ నం.85, సర్వే నం.628, గ్రౌండ్ ఫ్లోర్, సర్కిల్ ఆఫీసు బిల్డింగ్, రైల్ నిలయం ప్రక్కన, సికింద్రాబాద్-500026.

Ref: 7700/2752/158/CHV/2024/DNR/SN2 Date: 04/06/2024

అమ్మకపు ప్రకటన

ది సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 9(1)తో చదువబడే రూల్ 8(6)కు నియమాలతో చదువబడే, ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద, స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకపు ప్రకటన.

ఇందుమూలంగా సర్వజనులకు మరియు ప్రత్యేకించి రుణగ్రహీతలు మరియు హామీదారులకు ప్రకటన ఇవ్వడమేమనగా, దిగువ వివరించిన సిరాస్తి సెక్యూర్డ్ క్రెడిటర్‌కు తాకట్టుపెట్టబడినది, దానిని **అధీకృత అధికారి, ఎంసిబి సోమాజిగూడ** శాఖ చేత **భౌతిక స్వాధీనంచేసుకోబడినది** మరియు దానిని దిగువ వాటి కొరకు **కెనరా బ్యాంక్ ఏఆర్ఎం శాఖకు** బదిలీచేయబడినది, **మెసర్స్ చైతన్య వరుణ్ గిన్నింగ్ మిల్స్ ప్రైవేట్ లిమిటెడ్,** ప్రతినిధియైన దాని డైరెక్టర్లు& హామీదారులు **ఎ) శ్రీ అన్నం శ్రీనివాస రావు, తండ్రి ఎస్. వెంకట్ రావు, బి) శ్రీమతి అన్నం మణిమాల, భర్త అన్నం శ్రీనివాస రావు, సి) శ్రీ ఎ.వి.ఎస్. మానిక్య రావు, తండ్రి గోపయ్య, డి) శ్రీ కె. వేంకటేశ్వర్లు, తండ్రి సుబ్బారావు, ఇ) శ్రీ బిల్లా శివయ్య, తండ్రి నారాయణ** ల నుండి **కెనరా బ్యాంక్, ఎంసిబి సోమాజిగూడ** కు బకాయిగా **రూ.48,39,90,014.76 పై.లు (31.03.2024** నాటికి కాంట్రాక్చువల్ బకాయి) ప్లస్ **01.04.2024** నుండి వర్తించు లెక్కించని వడ్డీ, ఖర్చులు మరియు బ్యాంక్ చార్జీలుతో రికవరీచేయుట కొరకు **21.06.2024** న **"ఏది ఎక్కడ ఎలా ఉన్నది, అది అక్కడ అలాగే ఉంటుంది"** ప్రాతిపదికన **విక్రయించబడుతుంది.**

ఇ-వేలం తేది& సమయం: 21.06.2024న ఉ॥ 11:30గం.లు నుండి మ॥ 12:30గం.ల వరకు
(అమ్మకం ముగియు వరకు ప్రతిసారి 5 నిమిషాల వ్యవధితో అపరిమిత పొడిగింపు ఉంటుంది)
ధరావత్తు డిపాజిట్‌చేయుటకు చివరి తేది: 19.06.2024న లేదా ముందుగా సా॥5.00గం.లు

స్థిరాస్తి వివరాలు& పూర్తి వివరణ:

నరసారావుపేట్ రెవెన్యూ డివిజన్ పరిధిలో చిలకలూరిపేట సబ్-రిజిస్ట్రార్ పరిధిలో సేల్ డీడ్ నం.4225/2009 ద్వారా **శ్రీమతి అన్నం మనిమాల** పేరున, గణపవరం గ్రామం& గ్రామపంచాయతి, నాదేండ్ల మండలం, చిలకలూరిపేట్, గుంటూరు జిల్లా, ఆం.ప్ర.-522619 వద్దగల ఎన్‌టిఆర్ రోడ్, సర్వే నం.354 లో గల ప్లాంట్& మిషనరీతోసహా 2 ఎకరాల 40సెంట్లు విస్తీర్ణపు ఇండస్ట్రియల్/ ఫ్యాక్టరీ ల్యాండ్,తోపాటు కపాస్& సీడ్ హాలు, స్టాక్ పాయింట్ షెడ్, ప్రెస్ హాల్, 2 గిన్నింగ్ మిల్ యూనిట్స్, డస్ట్& స్టోర్ రూములు, ప్రెస్ స్టోర్ రూములు& ఆఫీసు భవనము (జి+1 అంతస్తులు)గల మొత్తం భాగం. మరియు **సరిహద్దులు: ఉత్తరం:** వాగు 210 లింకులు, **దక్షిణం:** సర్కిల్ డొంక 215 లింకులు, **తూర్పు:** జాడ కోటేశ్వర రావు ల్యాండ్ 1180 లింకులు, **పడమర:** కోట శ్రీ రామమూర్తి ల్యాండ్ 1314 లింకులు.

రిజర్వు ధర: రూ.2,40,00,000/- ధరావత్తు: రూ.24,00,000/- బిడ్ గుణాంకాలు: రూ.1,00,000/-

పై షెడ్యూలు ఆస్తిని కెనరా బ్యాంక్‌చేత భౌతిక స్వాధీనంచేసుకోబడినది.

బ్యాంకుకు తెలిసినంత వరకు రుణభారాలు లేవు. అయితే బిడ్డరుదారుల ఇ-వేలంలో పాల్గొనుటకు ముందే ఆస్తి యొక్క టైటిల్ మరియు రుణభారాలు మొ॥వాటి పట్ల స్వంత విచారణ జరుపుకోవలెను.

అమ్మకం యొక్క వివరణాత్మక నియమాలు& నిబంధనల కొరకు దయచేసి కెనరా బ్యాంక్ యొక్క వెబ్‌సైట్ (www.canarabank.com)లో ఇవ్వబడిన **"ఇ-వేలం"** లింకును చూడండి లేదా **సంప్రదించండి: అధీకృత అధికారి, ఏఆర్ఎం శాఖ, కెనరా బ్యాంక్, ఫోన్ నం.040-2772583/ 27725285** పై ఏదేని పనిదినమున ఆఫీసు పనివేళల్లో సంప్రదించవచ్చును.

ఆస్తిని అధీకృత అధికారితో ముందస్తు అనుమతితో, 14.06.2024న ఉ॥ 11:00గం.లు మరియు సా॥ 4:00గం.ల మధ్య పరిశీలించుకోవచ్చును.

తేది: 04.06.2024, ప్రదేశం: హైదరాబాద్ సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

బహిరంగ ప్రకటన

ICICI Bank **బ్రాంచ్ ఆఫీసు: ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్, 4/10, మైత్రీ టవర్, బొమ్మనహల్లి, హూసూర్ మెయిన్ రోడ్, బెంగళూరు-560068**

దిగువ పేర్కొన్న రుణగ్రహీత/లు వారు బ్యాంకు నుండి పొందిన రుణ సదుపాయాలకు సంబంధించి అసలు మరియు వడ్డీని తిరిగి చెల్లించుటలో డిఫాల్ట్ చెందినందున మరియు రుణాలు నాన్- పెర్ఫామింగ్ అసెట్స్ (ఎన్‌పిఏ)గా వర్గీకరించబడినవి. సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్-2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద నోటీసును వారి గతంలో తెలిసిన చిరునామాలు కలిగిన వారికి నోటీసు జారీచేయబడినది, అయితే, అది వారికి చేరకుండానే వెనుదిరిగింది కావున, ఈ బహిరంగ ప్రకటన రూపేనా తెలియజేస్తున్నాము.

క్ర. సం.	రుణగ్రహీత/ సహ-రుణగ్రహీత/ హామీదారు పేరు/ (రుణ ఖాతా నెంబరు) & చిరునామా	సెక్యూర్డ్ అసెట్/ స్వాధీనం చేసుకొను ఆస్తి చిరునామా	నోటీసు పంపిన తేదీ/ నోటీసు తేది నాటికి బకాయి మొత్తాలు	ఎన్‌పిఏ తేది
1	ఎలిశెట్టి సురేంద్ర / ఎలిశెట్టి సుమలత/డి 9 9వ లేన్ బాలాజీ నగర్, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ గుంటూరు-522007/ LBGTR00005452565	**షెడ్యూల్-ఏ:** గుంటూరు జిల్లా, పెదకాకాని సబ్‌జిల్లాలోని గుంటూరు మున్సిపల్ లిమిట్స్‌లోపు అగాతవరప్పాడు గ్రామంలోని డోర్ నెం.143/1 కలిగిన 4840చ.గ.ల విస్తీర్ణంలో 1194.46చ.గ.లు లేదా 998.72చ.మీ.ల విస్తీర్ణపు ఆస్తి మొత్తం భాగం. సరిహద్దులు: తూర్పు: విక్రేతల నెం.1,2,3 చే వదిలిన 30 అ.ల వెడల్పు రోడ్డు- 95'-0", దక్షిణం: ఇతరుల ఆస్తి 113'-2", పడమర: వెండర్స్ యొక్క నెం.1,2,3 యొక్క మిగిలిన సైట్-95'-0", ఉత్తరం: ఇతరుల ఆస్తి 113-2". **షెడ్యూల్-బి :** కోడాలి ఎన్‌క్లేవ్‌లోని థర్డ్ ఫ్లోర్‌లో ఫ్లాట్ నెం.404 గల డబుల్ బెడ్ రూమ్ ఫ్లాట్‌తో పాటు 1194.46చ.గ.లకుగాను 573.993లోని 46.474చ.గ.లు (లేదా) 38.85 చ.మీ.ల విస్తీర్ణపు విడదీయలేని మరియు పేర్కొనబడని విస్తీర్ణం. సరిహద్దులు: తూర్పు: ఓపెన్ టు స్కై, దక్షిణం: ఓపెన్ టు స్కై, పడమర: ఓపెన్ టు స్కై, ఉత్తరం: ఓపెన్ టు స్కై & ఉమ్మడి కారిడార్. ఈ నాలుగు సరిహద్దుల్లో 1140చ.అ.ల విస్తీర్ణంలో ఫ్లాట్ (ఉమ్మడి ఏరియా మరియు స్టిల్ట్ ఫ్లోర్‌లోనికార్ పార్కింగ్ ఏరియాతో సహా) కుడివైపున సాధారణ సౌకర్యాలు మరియు సాధారణ మార్గాలతో పాటు.	17/04/2024 / 3451308.00	06/04/ 2023
2	బాబాఖాన్ పఠాన్ / పఠాన్ అక్తరున్నీసా/ ఇ. నెం.16-16-134 అలి నగర్, 3వ లేన్ మసీదు రోడ్, పాత గుంటూరు, గుంటూరు బజార్, గుంటూరు- 522003 /LBGTR00005486929/ LBGTR00006089774	డోర్ నెం.16-16-134, టిఎస్ నెం.616, బ్లాక్ నెం.7, కొత్త వార్డు నెం.12, పాత వార్డ్ నెం.7, అసిస్‌మెంట్ నెం 22991, అలీ నగర్, 3వ లైన్ పాత గుంటూరు, గుంటూరు-522003 లో రుణ పత్రం/ ఆస్తి పత్రంలో వివరించినట్లుగా. ఏరియా విస్తీర్ణపు 2.29 645చ.అ.లు. సరిహద్దులు: ఉత్తరం: అబ్దుల్ రహీమ్ 48అ.లు, దక్షిణం: పి మస్తాన్ వలీ ఖాన్ సైట్ 48 అ.లు, తూర్పు: చిన్న మహమ్మద్ ఖాసిం సాహెబ్ సైట్ 16.4 అ.లు, పడమర: ఎంసి రోడ్ సైట్ 17.3 అ.లు	15/04/2024 / 4132783	03/06/ 2023
3	మైఖేల్ అశోక్ ప్రీతం/ మైఖేల్ లక్ష్మి మోనికా /71-5-510, 3వ లైన్ కిదాంబి తిరుమల చారీ పప్పుల మిల్లు దగ్గర, సంగటిగుంట గుంటూరు-522003/ LBGTR00005705113	43.145చ.గ.లు లేదా 36.07 చ.మీ.ల విస్తీర్ణపు సైట్ యొక్క అవిభక్త, పేర్కొనబడని మరియు అవిభాజ్యమైన వాటాను కవర్‌చేస్తున్న రుణ పత్రం/ ఆస్తి పత్రంలో వివరించినట్లుగా, డెవలపర్‌ల నుండి మొత్తం సైట్ మొత్తంలో వాటా మరియు అసంపూర్తి ఫ్లాట్ నెం.205, పార్క్ ఆర్కేడ్ యొక్క 1వ అంతస్తులో 1130చ.అ.లు, వీటిలో ఉమ్మడి మరియు కార్ పార్కింగ్ పై పేర్కొన్న సైట్ కొరకు నిర్మించబడినది. సరిహద్దులు: ఉత్తరం: ఓపెన్ టు స్కై, దక్షిణం: ఉమ్మడి కారిడార్, తూర్పు: ఓపెన్ టు స్కై మరియు మెట్లు, ఈ ఫ్లాట్ మరియు ఫ్లాట్ నెం.207 మధ్య, పడమర: ఈ మరియు ఫ్లాట్ నెం.203 మధ్య కారిడార్.	17/04/2024 / 2964898.00	03/08/ 2023
4	గుగులోతు చిన్న హుస్సేన్/ గుగులోతు మణి/ఇ.నెం-2-59 అన్నవరం గ్రామం, శ్రీ శ్రీ సింధు టెక్నికల్ వర్క్స్, అన్నవరం గ్రామం, ఆంధ్రప్రదేశ్, జగ్గయ్యపేట-521175/ LBJAP00005212798	డోర్ నెం.7-451, అసిస్ట్ నెం.1315, ఆర్.ఎస్.నెం.34/1, తొర్రగుంట పాలెంగ్రామం, చిల్లకల్లు పంచాయతీ, జగ్గయ్యపేట మండలం, జగ్గయ్యపేట సబ్-రిజిస్ట్రీ, కృష్ణా జిల్లా లోని ఆర్‌సిసి బిల్డింగ్‌తోపాటుగా ఎక 0.04 సెంట్లు 475చ.లింకులు లేదా 216.6చ.గ.ల సైట్ విస్తీర్ణం కవరుచేస్తున్న రుణ పత్రం/ ఆస్తి పత్రంలో వివరించినట్లుగా. సరిహద్దులు: ఉత్తరం: కొడాలి నాగేశ్వరరావు ఆస్తి, దక్షిణం: ప్యాసెజ్, తూర్పు: కొడాలి నాగేశ్వరరావు ఆస్తి, పడమర: రంగరావు ఆస్తి.	17/04/2024 / 1095042.00	03/02/ 2024
5	స్వామి కృష్ణ /స్వామి రజని/ ఇ.నెం.11-116-8, ఆజాద్‌నగర్ మార్కెట్ ఆఫీస్ ఎదురుగా, కోదాడ తెలంగాణ, నల్గొండ 508206/ LBVJW00003211463	**ఆస్తి యొక్క షెడ్యూల్ "ఏ":** కాజా గ్రామం, మంగళగిరి మండలం, గుంటూరు జిల్లా, ఆం.ప్రలోని సర్వే నెం.లు 83/ఎ (పార్ట్), 83/బి3 (పార్ట్), 84, 85/3 (పార్ట్) మరియు 86/ఏ (పార్ట్) లోని ఎక 13.75 సెంట్ల విస్తీర్ణపు స్థలం మొత్తం భాగం సరిహద్దులు: ఉత్తరం: యాక్సెస్ రోడ్డు మరియు రామ కృష్ణ హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ఆస్తి, తూర్పు: కీలకా ఆగ్రో ఫారమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ & ఇతరుల ఆస్తి, దక్షిణం :60అ.ల వెడల్పురోడ్డు, పడమర:ప్రతిపాదిత 40అ.ల వెడల్పురోడ్డు. **షెడ్యూల్-బి ఆస్తి:** (ఆస్తి వెండీ/లకి విక్రయించడానికి అంగీకరించబడింది): 17వ అంతస్తులో రెసిడెన్షియల్ ఫ్లాట్ నెం.5177ని కలిగి ఉన్న ఉమ్మడి ఏరియాతో సహా 1900చ.అ.ల సూపర్ బిల్ట్-అప్ ఏరియాతో కూడిన రెసిడెన్షియల్ ఫ్లాట్ టవర్ నెం.5లో "రామకృష్ణ వెనుజియా" అని పిలువబడే బహుళ అంతస్థుల నివాస అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లోని బేస్‌మెంట్‌లలో ఒక కార్ పార్కింగ్/లతోపాటు 39చ.గ.లకు సమానమైన స్థలంయొక్క అవిభక్త వాటా షెడ్యూల్ "ఏ" ఆస్తి (ఓపెన్ ఏరియా/టోట్-లాట్ ఏరియా మరియు క్లబ్‌హౌస్‌ను వదిలివేయడం)లోని మరియు అపార్ట్‌మెంట్ సరిహద్దులుగా ఉంది: తూర్పు: ఓపెన్ టు స్కై, పడమర: ఉమ్మడి కారిడార్ & ఓపెన్, ఉత్తరం: ఓపెన్ టుస్కై, దక్షిణం: ఓపెన్ టు స్కై.	18/04/2024 / 5490344.00	29/02/ 2024
6	గువ్వల పుష్పలత/ గువ్వల నాగేశ్వరరావు/ జమ్ములదిన్నె సోనియా కృష్ణ/ గువ్వల సందీప్/ ఎఫ్‌బి 81 గజాల రాజం బస్తీ కొత్తగూడెం, కొత్తగూడెం కోల్స్, ఖమ్మం- 507101/ LBVJW00005197685	రాజుపేట గ్రామం తిరువూరు నగర పంచాయతీ ఇలాకా, తిరువూరు మండలం, తిరువూరు ఉప జిల్లా తిరువూరి మండల రిజిస్ట్రీ: కృష్ణా జిల్లాలోని రెవెన్యూ గ్రామ ఆర్ఎస్.నెం.132/12 (ఒకటి ముప్పైరెండు/ పన్నెండు)లోని దక్షిణం వైపు ఎక 0.04 సెంట్లలోని ఎక 08 సెంట్ల దక్షిణం వైపునగల సైట్ యొక్క 193.6చ.గ.లు (161.849 చ.మీ.ల) విస్తీర్ణంలోని ఆస్తి విలువ రూ.1,17,000/- గల 1వ యుఎస్ గువ్వల వెంకటేశ్వర్ ఆస్తి వివరాలు కవరుచేస్తున్న రుణ పత్రం/ ఆస్తి పత్రంలో వివరించినట్లుగా సరిహద్దులు: ఉత్తరం: గువ్వల వెంకటేశ్వరరావు ఆస్తి, దక్షిణం:గువ్వల శేఖర్ ఆస్తి, తూర్పు: నగర పంచాయతీ రోడ్డు, పడమర: నాటకశాల సత్యనారాయణ ఆస్తి.	19/04/2024 / 3426486.00	03/01/ 2024
7	పేరం సుబ్బారావు / పేరం తానిత/2-99 సత్యకురూప నిలయం, ప్రభుహారిక రెసిడెన్సీ దగ్గర, కోటేవారి రామవరపాడు, విజయవాడ-521108/ LBVJW0 0005529921 / LBVJW00005529933	**(ఎ) ఆస్తి షెడ్యూల్:** కానూరు గ్రామం, కృష్ణా జిల్లా పరిధిలోని, విజయవాడ జిల్లా రిజిస్ట్రార్, పడమట సబ్-రిజిస్ట్రార్ జిల్లా, పెనమలూరు మండలం, కానూరు గ్రామ పంచాయితీ ఏరియాలోని 342. 22చ.గ.ల విస్తీర్ణపు రీసర్వే నెం.22/2లోని అసెస్‌మెంట్ నెం.12671, డోర్ నెం.19-773/4 కలిగిన ఫ్లాట్ మొత్తం భాగం, ఇది పైన పేర్కొన్న పద్ధతిలో మరియు ఇప్పటి వరకు నా స్వంత ఆధీనంలో ఉన్న స్థలానికి సరిహద్దులు క్రింది విధంగా ఉన్నాయి: తూర్పు: రామినేని శివాజీ మొదలైన వారి ఆస్తి 44అ.లు, దక్షిణం: పోతిరెడ్డి సునీత ఆస్తి 70 అ.లు, పడమర: 33 అ.ల వెడల్పు రహదారి 44 అ.ల ఉత్తరం: తుమ్మల లక్ష్మి ఆస్తి 70 అ.లు. ఈ సరిహద్దుల మధ్య 342.22చ.గ.లు లేదా 286.13చ.మీ.ల, 28.0 చ.గజాలు లేదా 23.40 చ.మీ.ల విస్తీర్ణంలోని అవిభక్త మరియు పేర్కొనబడని స్థలం. **(బి) ఆస్తి యొక్క షెడ్యూల్:** మొదటి అంతస్తు, ఫ్లాట్ నెం.ఎఫ్ఎఫ్-2 "శ్రీ శివ బాలాజీ టవర్స్" పేరుగల కమ్యూనల్ హౌసింగ్ నిర్మాణంలో పై ఏ-షెడ్యూల్ ప్రకారం మొత్తం ప్లాట్‌లో నిర్మించబడింది. ఫ్లాట్ నెం.ఎఫ్ఎఫ్-2 యొక్క సరిహద్దులు క్రింది విధంగా ఉన్నాయి: తూర్పు: ఓపెన్ టు స్కై, దక్షిణం: ఓపెన్ టు స్కై, పడమర: కారిడార్ మరియు మెట్లు, ఉత్తరం: ఎఫ్ఎఫ్-1. నమోదిత ఆస్తి ఈ సరిహద్దుల మధ్య 636.9చ.అడుగుల పునాది ప్రాంతం, 80.0చ.అ.ల ఉమ్మడి ఏరియా, 80.0చ.అ.లకార్ పార్కింగ్ ప్రాంతం, ప్రత్యేక ఇనుము, కలప ఫర్నిచర్ మొదలైనవి, లాట్రిన్, బాత్రూమ్, విద్యుత్ సేవతో సహా అన్ని సౌలభ్యం హక్కులు , ఫ్లాట్‌లకు విద్యుత్ ఫిట్టింగ్‌లు, సెక్యూరిటీ డిపాజిట్, ట్రాన్స్‌ఫర్మేషన్ ఛార్జీలు ఫ్లాట్‌లు భరించాలి. జాయింట్ రోడ్లు, ఉమ్మడి మార్గాలు, మెట్లు, డ్రైనేజీలు, నీరు, మోటార్, లిఫ్ట్ మొదలైన సకల సౌకర్యాలతో పేర్కొన్న హౌసింగ్ కాంప్లెక్స్‌తో సహా అన్ని ఉమ్మడి వనరులలో ఉమ్మడి హక్కులతో సహా బ్రదర్స్ కమ్యూనల్ హౌసింగ్ కాంప్లెక్స్‌లోని మీకు ఈ రోజున విక్రయించబడుతుంది.	15/04/2024 / 2523095.00	04/03/ 2023
8	పెరుగు ఫణీంద్ర కుమార్/ షేక్ నూర్జహాన్/ నెం.502 అమృత రెసిడెన్సీ, మెయిన్ రోడ్ వెటర్నరీ హాస్పిటల్ ఎదురుగా, గొల్లపూడి,విజయవాడ- 521225/ LBVJW00006051059/ LBVJW00006063139	**ఆస్తి యొక్క ఏ షెడ్యూల్:** తాడేపల్లి గ్రామం, తాడేపల్లి మండలం, మంగళగిరి సబ్ రిజిస్ట్రీ, గుంటూరు జిల్లాలోని పాత డోర్ నెం.73కు సంబంధించి రీసర్వే నెం.73/1, 73/2, 73/3, 73/44, 73/5, 73/10/1, 73/12, 73/13, 73/15, 73/ 18, 73/20, 73/21/3లోని ఎక 9.31 సెంట్లకు సమానమైన 45060.4చ.గ.ల పూర్తి విస్తీర్ణంలో 54.62చ.గ.లఉమ్మడి విస్తీర్ణపు విడదీయలేని మరియు పేర్కొనబడని ఆస్తి మొత్తం భాగం, అన్ని సౌలభ్యం హక్కులతో కింది సరిహద్దుల్లో: తూర్పు: జివ్వాజీ సత్యనారాయణ, జివ్వాజి హనుమంత రావు మరియు ఇతరుల ఆస్తి, దక్షిణం: ప్రతిపాదిత 60 అ.ల వెడల్పు రోడ్డు పడమర: జెడ్‌పి రోడ్, ఉత్తరం: దేవస్థానం ఆస్తి (జిల్లా పరిషత్ ల్యాండ్). **బి-షెడ్యూల్:** అసంపూర్తి రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్ ట్రిపుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్ నెం. జి1, గ్రౌండ్ ఫ్లోర్‌లో, యూనిట నెం.1ఏ, తూర్పు ముఖంగా, భవనం నెం.9, ఎపిసిఆర్‌డిఏ ప్రకారం అమ్మకం/బిల్ట్-అప్‌ఏరియా1566.05చ.అ.లు, రేరాప్రకారం కార్పెట్ ఏరియా 1047.88 చ.అ.లు. రేరా ప్రకారం బాల్కనీ & యుటిలిటీ 88.26చ.అ.లు, బిల్డింగ్ 1, 2, 3, 5, 6, 8, 9, 10లోని ఒక కార్ పార్కింగ్ (అనగా 1 కార్ పార్కింగ్ & డ్రేన్‌వేస్) దిగువ బేస్‌మెంట్, ఎగువ బేస్‌మెంట్ (గ్రౌండ్ + 9 పై అంతస్తులు, సౌకర్యాలు (క్లబ్ హౌస్) (గ్రౌండ్ + 3 పై అంతస్తులలో నిర్మించిన అపర్ణ అమరావతి పేరు మరియు శైలిలో, ఏ-షెడ్యూల్ ప్రాపర్టీలో పేర్కొన్న పూర్తి విస్తీర్ణం లిఫ్ట్ మరియు జనరేటర్‌ని ఉపయోగించడంతో సహా అన్ని సౌలభ్యం హక్కులతో: సరిహద్దులు: తూర్పు: ఉమ్మడి కారిడార్, దక్షిణం: ఓపెన్ టు స్కై, పడమర: ఓపెన్ టు స్కై, ఉత్తరం: ఓపెన్ టు స్కై.	08/04/2024 / 4983521.00	29/02/ 2024
9	మహ్మద్ ఫాతిమా ఖాతున్/ పఠాన్ ఖాసిం ఖాన్ బాబు/ 3-14/1, మల్లెం పుదినుతక్కి గుంటూరు-522303/ LBVJW00005175196/ LBVJW00005397799	ఇప్పటం గ్రామం, మెల్లంపూడి గ్రామం, తాడేపల్లి మండలం, మంగళగిరి సబ్‌రిజిస్ట్రీ, గుంటూరు జిల్లా లోని డోర్ నెం.219/3సి, అసిస్ట్ నెం.117, బిల్డింగ్ మరియు షెడ్ డోర్ నెం.3-14/1తో సైట్ యొక్క 171చ.గ.లు (142.97చ.మీ.ల) విస్తీర్ణం మొత్తం కవరుచేస్తున్న రుణ పత్రం/ ఆస్తి పత్రంలో వివరించినట్లుగా, సరిహద్దులు: ఉత్తరం: పంచాయతీ బజార్, దక్షిణం: ఆళ్ల ముక్కంటి రెడ్డి ఆస్తి, తూర్పు: ఆళ్ల లక్ష్మీబాయమ్మ తదితరుల ఆస్తి, పడమర: పంచాయతీ బజార్.	25/04/2024 / 3136907.00	02/02/ 2024
10	శంకరశెట్టి లోకేష్/ శంకరశెట్టి ఝాన్సీ లక్ష్మి/ డి.నెం.7-17-271/9, శ్రీనగర్ 7/7 గుంటూరు 522002/ LBGTR00006155466/ LBGTR00006156366	గుంటూరు జిల్లా, కొరిటెపాడు ఉపజిల్లా, గోరంట్ల గ్రామపంచాయతీ ప్రస్తుతం గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గోరంట్ల గ్రామం, గోరంట్ల గ్రామం, డి.నెం.513, ఎక 6.64 సెంట్ల విస్తీర్ణం కలిగియున్న రుణ పత్రం /ఆస్తిపత్రంలో వివరించినట్లుగా మరియు ఎక 0.75 సెంట్లు, ఎల్.పి.నెం.4/2001, మరియు దానిని ఖాళీ సైట్ యొక్క 187చ.గ.ల విస్తీర్ణం కవరుచేస్తున్న ఫ్లాట్ నెం.56 ఉన్న ఒకే ఫ్లాట్‌గా విభజించబడింది: సరిహద్దులు: ఉత్తరం: ఫ్లాట్ నెం.55-49.6 అ.లు, దక్షిణం: ఫ్లాట్ నెం.57-49.6 అ.లు, తూర్పు: ఫ్లాట్ 61-34 అ.లు, పడమర: 40 అ.ల వైడ్ రోడ్, 34 అ.లు	23/04/2024 / 2178055.00	03/02/ 2024

నోటీసు సరిగా బట్వాడాఅగుట కొరకు తగిన చర్యలు తీసుకోబడుతున్నాయి. పై రుణగ్రహీతలు/ మరియు/లేదా వారి హామీదారులు (వర్తించినట్లుగా) సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 యొక్క నియమాల ప్రకారం తగిన చర్యలు తీసుకోవటంతో పాటు ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 60 రోజులు కాలవ్యవధిలోగా బకాయి మొత్తాలను చెల్లించవలసిందిగా సలహా ఇవ్వబడుచున్నది.

తేది: జూన్ 06, 2024
ప్రదేశం: విజయవాడ

అధీకృత అధికారి
ఐసిఐసిఐ బ్యాంక్‌లిమిటెడ్

సంపాదకీయం

ధరాభారం

దేశ వ్యాప్తంగా ప్రజానీకం ఎన్నికల హడావిడిలో మునిగిఉన్న వేళ కేంద్ర ప్రభుత్వం గుట్టుచప్పుడు కాకుండా భారీ భారాన్ని మోపింది. కౌంటింగ్ కూడా జరగక ముందే కేంద్రం మోపిన ఈ భారాన్ని అత్యధికమంది ప్రజానీకం గుర్తించనే లేదు. జేబులు ఖాళీ కావడం ప్రారంభమైన తరువాతే అత్యధికులు ఈ భారాన్ని గుర్తించారు. ఇటువంటి వంచనా విన్యాసాలు నరేంద్రమోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వానికి కొత్తేమీ కాదు. గతంలో కూడా ఈ తరహా అనుభవాలు ముఖ్యంగా పెట్రో ఉత్పత్తుల ధరల విషయంలో దేశ ప్రజానీకానికి ఉన్నాయి. ఎప్పటికప్పుడు మోసపు మాటలతో ప్రజానీకాన్ని మభ్య పెట్టే మోడీ ప్రభుత్వం ఈ సారి కూడా అటువంటి పనికే తెగబడింది. లోక్‌సభకు ఏడు విడతల పోలింగ్ ప్రక్రియ జూన్ ఒకటవ తేదీన ముగిసిన విషయం తెలిసిందే. ఆ మరుసటి రోజే (జూన్ 2) దేశ వ్యాప్తంగా టోల్ ఛార్జీలను పెంచింది. అదే రోజు దేశ వ్యాప్తంగా అమూల్, మదర్ డెయిరీ సంస్థలు పాల ధరలను పెంచుతూ నిర్ణయం తీసుకున్నాయి. ఈ రెండూ ప్రభుత్వ నియంత్రణలో ఉండే సంస్థలే కావడం గమనార్హం. ఈ సంస్థలు ధరల పెంపునకు సంబంధించి ప్రతిపాదనలు ఇచ్చి కొన్ని నెలలైనట్లు సమాచారం. ఇంత కాలం ఆ ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వం ఎందుకు పక్కన పెట్టిందో, పోలింగ్ ప్రక్రియ ముగిసీ, ముగియగానే ఎందుకు అనుమతించిందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

టోల్ ఫీజుల సవరణకు సంబంధించిన నిర్ణయం వార్షిక ప్రాతిపదికన జరుగుతుంది. ఈ ఏడాది కూడా దానికి సంబంధించిన ప్రతిపాదనలను గత డిసెంబర్, జనవరి నెలల్లోనే నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఎఐ) కేంద్ర ప్రభుత్వానికి అందచేసింది. నూతన ఆర్థిక సంవత్సరంలో మొదటిరోజైన ఏప్రిల్ ఒకటి నుండి ఈ ప్రతిపాదనలు అమలులోకి రావాల్సి ఉంది. ఎన్నికల సమయం కావడంతో ఆ ప్రతిపాదనలకు తాత్కాలికంగా నిలుపుదల చేసిన కేంద్ర ప్రభుత్వం పోలింగ్ ప్రక్రియ ముగిసిన మరుసటి రోజు నుండే పెంపునకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో దేశ వ్యాప్తంగా ఉన్న 855 టోల్‌ప్లాజాల్లో సగటున 5 శాతం టోల్‌ఫీజు పెరిగింది. ఈ పెంపునకు సంబంధించిన ముందస్తు సమాచారం ఏమాత్రం లేకపోవడంతో అనేక చోట్ల వాహనదారులు ఇబ్బందులను ఎదుర్కున్నట్లు వార్తలు వచ్చాయి. కనీసం 5 రూపాయల నుండి 20 రూపాయల వరకు రోజువారీ ప్రయాణీకులపైనా, నెల పాస్‌లున్న వారికి రూ100 నుండి 400 రూపాయల వరకు భారం పడినట్లు వార్తలు వచ్చాయి. కేంద్ర ప్రభుత్వ రోడ్డు రవాణా, హైవేల మంత్రిత్వశాఖ చేపట్టిన ఏడు పనుల్లో 7.50 లక్షల కోట్ల రూపాయల మేర అవకతవకలు చోటుచేసుకున్నట్లు గత ఏడాది కాగ్ ఇచ్చిన నివేదికలో పేర్కొంది. ఆ నివేదికలోని అంశాలపై ఇంతవరకు నామమాత్రపు చర్యలు కూడా తీసుకోని కేంద్ర ప్రభుత్వం టోల్ ఫీజుల పెంపునకు మాత్రం అనుమతిచ్చింది.

పాల ధరల పెంపు విషయంలోనూ ఇంతే. అన్ని రకాల పాలపై లీటరకు రెండు రూపాయల వంతున పెంచుకోవడానికి అమూల్, మదర్ డెయిరీలకు కేంద్ర ప్రభుత్వం అనుమతిచ్చింది. ద్రవ్యోల్బణం పెరుగుతుండటంతో ఉత్పత్తి ఖర్చు పెరగుతోందని, ఫలితంగా ధరలు పెంచాల్సి వస్తోందని ఈ సంస్థలు ప్రభుత్వానికి నివేదించాయి. నెలల తరబడి దేశవ్యాప్తంగా చేసిన ఎన్నికల ప్రచారంలో ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచామని, ధరలను నియంత్రించామని కేంద్ర మంత్రులు చేసిన ప్రచారానికి ఇది విరుద్ధం కావడం గమనార్హం. పోలింగ్ ప్రక్రియ ముగిసిన వెంటనే ధరల పెంపునకు అనుమతివ్వడంతో కేంద్ర ప్రభుత్వ పెద్దల మాటల్లోని అసలు నిజం బట్టబయలైంది. 2022లో అమూల్ సంస్థ మూడు సార్లు ధరలను పెంచింది. అదే సంవత్సరం మార్చి డిసెంబర్ నెలల మధ్య మదర్ డెయిరీ దఫ దఫాలుగా లీటర్‌కు పది రూపాయాలు పెంచింది. ఎన్నికల ఏడాది కావడంతో 2023లో ఎటువంటి పెంపు చేయని కేంద్ర ప్రభుత్వం ఆ ప్రక్రియ ముగిసిన వెంటనే బాదుడు ప్రారంభించింది. ఏరు దాటాక తెప్ప తగలేయడం మోడీ సర్కారుకు కొత్తేమీ కాదు. అందుకే ప్రజలు ఎన్నికల్లో కర్ర కాల్చి వాతపెట్టినట్టు తీర్పిచ్చారు. దీని నుంచైనా బిజెపి ప్రభుత్వం ఏమైనా నేర్చుకుంటుందేమో చూడాలి. లేని పక్షంలో ప్రతిఘటనకు సిద్ధం కావడమే ప్రజానీకం ముందున్న మార్గం.

మహనీయుల మాట

నా శత్రువు నోరు విప్పకుండా చేయగల బలం, బలగం, అధికారం నాకు వున్నప్పటికీ అతను తన అభిప్రాయాలను వెల్లడించే స్వేచ్ఛను నేను హరించను. చివరికి అతని మాటలు నాపై విమర్శలైనా సరే! అదే ప్రజాస్వామ్యం.

- అబ్రహం లింకన్

Abraham Lincoln

అంతర్జాతీయం

పాలస్తీనా ప్రజల ఊచకోతను వెంటనే ఆపాలి

పి. అజయ కుమార్

ఇజ్రాయిల్ 2023, అక్టోబర్ 7 నుండి పాలస్తీనీయులను ఊచకోత కోస్తోంది. దీనికి అతి పెద్ద మద్దతుదారు అమెరికా. రఫా ప్రాంతంలో తలదాచుకుంటున్న శిబిరాలపై ఇజ్రాయిల్ బాంబు దాడులు చేసి మే 26 ఆదివారం 45 మంది పాలస్తీనా పౌరుల మరణానికి కారణమైంది. మే 29 నాటికి అక్టోబర్ 7 నుండి ఇజ్రాయిల్ కొనసాగిస్తున్న మారణకాండలో 36 వేల మందికి పైగా సాధారణ పౌరులు మరణించడం ప్రపంచాన్ని కలచివేస్తున్నది. మరణించిన వారిలో 15,239 మంది బాలలు ఉన్నారు. 81,026 మంది గాయాలపాలయ్యారు.

147 మంది జర్నలిస్టులు ఈ దాడుల్లో మరణించారు. వందలాది మంది ఆరోగ్య కార్యకర్తలు తమ ప్రాణాలు కోల్పోయారు. ఇజ్రాయిల్ దాడుల కారణంగా మొత్తం గాజాలోని పాలస్తీనా పౌరులు 20 లక్షల మంది ఎటువంటి నీడలేని కాందిశీకులుగా మారిపోయారు.

ఇదంతా ఎందుకు జరుగుతోంది?

అక్టోబర్ 7న ఇజ్రాయిల్ పై హమాస్ చేసిన దాడికి ప్రతీకారంగా ఇజ్రాయిల్ ఈ దాడులకు పాల్పడుతోంది. హమాస్ ప్రభుత్వంలో ఉన్న సంస్థ. అలాగే ఇజ్రాయిల్‌లో నెతన్యాహు నాయకత్వంలో ప్రభుత్వం ఉంది. కానీ అక్టోబర్ 7 ముందు నుండే ఇజ్రాయిల్ అంతకు ముందు జరిగిన అంతర్జాతీయ ఒప్పందాలను ఉల్లంఘించి జోర్డాన్ నది పశ్చిమ ఒడ్డున వున్న వెస్ట్‌బ్యాంక్‌ను క్రమేపీ ఆక్రమించుకునేలా తన పౌరులను ప్రోత్సహించింది. వారికి దన్నుగా తన మిలట్రీని మోహరించింది. అడ్డు వచ్చిన పాలస్తీనా పౌరులపై కాల్పులు జరపడం, అరెస్టులు చేసి జైళ్లలో పెట్టడం వంటి దుర్మార్గాలకు పాల్పడింది. ఎదురు తిరిగిన వారందర్నీ కాల్చివేయడం ఇజ్రాయిల్‌కు ఒక రివాజుగా మారింది. మొదట్లో గాజాతో పాటు వెస్ట్‌బ్యాంక్ ప్రాంతమంతా పాలస్తీనా ఆధీనంలో ఉండేలా అంతర్జాతీయ ఒప్పందం కుదిరింది.

ఇరవయ్యవ శతాబ్దం చివరి నాటికి వెస్ట్‌బ్యాంక్ ప్రాంతంలో 40 శాతమే పాలస్తీనా చేతుల్లో మిగిలింది. అంతమేరకే మరలా ఒప్పందాలు కుదిరాయి. వాటిని కూడా ఇజ్రాయిల్ ఉల్లంఘించి పాలస్తీనా పౌరులను తమ స్వస్థలాల నుండి వెళ్లగొడుతోంది. ఈ క్రమంలో వందలాది మంది ప్రాణాలు తీసింది. హమాస్‌ను ఉగ్రవాదిగా పరిగణించేట్లు అయితే ఇజ్రాయిల్‌ను అంతకంటే పెద్ద ఉగ్రవాదిగా పరిగణించాలి.

పాలస్తీనా పౌరుల స్పందన

అక్టోబర్ 7 తర్వాత గాజా ప్రాంతానికి మిలటరీని పంపి హమాస్‌ను ధ్వంసం చేయాలనే సాకుతో ఇజ్రాయిల్ సామాన్య పౌరులపై దాడులు చేస్తూ మహిళలు, పిల్లలతో సహా వేలాది మందిని చంపింది. దక్షిణం నుంచి ఉత్తరానికి, ఉత్తరం నుంచి దక్షిణానికి తరుముతూ 20 లక్షల మంది పాలస్తీనీయులను తమ సొంత గడ్డపై శరణార్థులుగా మార్చింది. పౌరుల నివాసాలు, ఆస్తులన్నింటినీ ధ్వంసం చేసింది.

ఇజ్రాయిల్ బాంబులతో నివాసాలు ధ్వంసమై ప్రాణాలు కోల్పోతున్న పరిస్థితుల్లో కూడా పాలస్తీనా పౌరులు దాడులు జరగ్గానే వందలాది మంది తమ తోటి పౌరుల రక్షణ కోసం పరుగులెత్తి వారిని ఆసుపత్రులలో చేర్చడం, శిథిలాల్లో చిక్కుకున్న వారిని కాపాడే ప్రయత్నం చేస్తున్నారు. ఎటువంటి భయం లేకుండా, ఒక్క క్షణం కూడా ఆలోచించకుండా తమ వారిని కాపాడే ప్రయత్నం చేయడం ఒక పోరాటంగా కూడా పరిగణించాలి. తమ నివాసాలు కుప్పకూలినప్పటికీ ఎప్పటికైనా తిరిగి తమ స్వస్థలాలకు చేరుకుని తీరతామని చెప్పడం వారి పట్టుదలకు నిదర్శనం.

ఇజ్రాయిల్ అమానవీయంగా గాజా వాసులకు ఇతర దేశాల నుండి ఆహార సహాయం అందకుండా కూడా అడ్డుకుంటోంది. శిబిరాలపై బాంబులు వేసిన తర్వాత బూడిదైన శిథిలాల మధ్య ఆహారం ఉందేమోనని పౌరులు వెతుక్కోవడం చూస్తే గుండె తరుక్కుపోతుంది. డాక్టర్లు, ఆరోగ్య కార్యకర్తలు తమ ప్రాణాలను కూడా పణంగా పెట్టి ఆసుపత్రులను నడిపించే ప్రయత్నం చేశారు. వాటిని కూడా హమాస్ ఉగ్రవాదులు ఉన్నారనే పేరుతో వరుసగా ఇజ్రాయిల్ ధ్వంసం చేస్తోంది.

అమెరికా మొదటి దోషి

ఈ పరిణామాలకు కారణం సామ్రాజ్యవాద అమెరికా. తన రాజకీయ ప్రయోజనాల కోసం పశ్చిమ ఆసియా ప్రాంతంలో ఇజ్రాయిల్ మారణ హోమానికి వెన్నుదన్నుగా నిలుస్తోంది. తాజాగా శిబిరాలపై జరిగిన బాంబు దాడులను తన మిత్రులతో సహా ప్రపంచ దేశాలు ఖండిస్తుంటే, బాంబులు వేసి పౌరులను చంపడం పెద్ద తప్పిదంగా అమెరికా పరిగణించడం లేదని ప్రకటించింది. అంతకు ముందు ఆయుధ సరఫరా కొనసాగింపుగా ఏప్రిల్ మూడో వారంలో మరో 2,20,000 కోట్ల రూపాయలు విలువ చేసే యుద్ధ ఆయుధాలను ఇజ్రాయిల్‌కు సరఫరా చేయాలని నిర్ణయించింది. తన రాజకీయ ప్రయోజనాలతో పాటు ఆయుధాలను అమ్ముకోవడానికి ఇజ్రాయిల్‌ను ఎగదోస్తూ పాలస్తీనా పౌరుల మరణానికి ప్రథమ కారణంగా నిలుస్తోంది.

ఇజ్రాయిల్ దాష్టీకాన్ని ఖండిస్తూ ఐక్యరాజ్య సమితిలో ఎప్పుడు తీర్మానం పెట్టినా దాన్ని అమెరికా వీటో చేస్తోంది. చివరకు పాలస్తీనా పౌరులకు చేసే ఆహార సరఫరాను కూడా అడ్డుకుంది. అమెరికాలో ఎన్నికలు జరగబోతున్న సందర్భంలో అధికారంలో ఉన్న డెమొక్రాట్లు, ప్రతిపక్షంలో ఉన్న రిపబ్లికన్లు పోటీ పడి నియంత నెతన్యాహుకు మద్దతుగా నిలుస్తున్నారు. అందుకే రెండు పార్టీలు కలిసి యుద్ధ సామాగ్రి సరఫరాకు పార్లమెంట్లో ఆమోదం తెలుపుతున్నాయి. అధికారంలో ఉన్న డెమొక్రాట్ల అధ్యక్షుడు జోబైడెన్, రిపబ్లికన్ పోటీదారు ట్రంప్ కంటే తాను ఎక్కడ వెనకబడి పోతానేమోనని పోటీపడి నెతన్యాహు దాడులను బాహాటంగా సమర్థిస్తున్నారు. తన దేశంలోని విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులు పాలస్తీనా పౌరుల మారణహోమాన్ని నిరసిస్తూ శాంతియుతంగా చేస్తున్న ఆందోళనలను కర్కశంగా అణచివేస్తున్నారు.

మోడీ ప్రభుత్వ వైఖరి

ఒక పక్కన ఐక్యరాజ్య సమితిలో పాలస్తీనాకు అనుకూలమైన తీర్మానాలను బలపరుస్తూనే మరో పక్క ఇజ్రాయిల్‌కు తాను కూడా ఆయుధాలు సరఫరా చేస్తూ అమెరికాకు తోకగా మోడీ ప్రభుత్వం వ్యవహరిస్తోంది. అదానీ కంపెనీ, ఇజ్రాయిల్‌కు చెందిన ఆల్‌బిట్ కంపెనీలు కలిసి ఉత్పత్తి చేసిన 26 హెర్మెస్ యుద్ధ డ్రోన్‌లను మోడీ ప్రభుత్వం ఇజ్రాయిల్‌కు పంపింది. తాజాగా యుద్ధంలో ఉపయోగించే పేలుడు సామాగ్రితో ఒక ఓడ ఇండియాలోని చెన్నై ఓడరేవు నుండి బయలు దేరింది. మధ్యలో ఆగడానికి ఆ ఓడ స్పెయిన్ దేశ ఓడరేవుకు వెళితే దాన్ని అక్కడ అనుమతించలేదు.

కొనసాగుతున్న ఇజ్రాయిల్ దాష్టీకాలు

శిబిరాల్లో తల దాచుకుంటున్న పౌరులను ఇజ్రాయిల్ ఊతకోత కోస్తూ, శరణార్థి శిబిరాల చుట్టూ యుద్ధ ట్యాంకులను, డ్రోన్‌లను మోహరిస్తోంది. మొదట శిబిరాల్లో హమాస్ ఉగ్రవాదులు దాగి ఉన్నారు కాబట్టి బాంబు దాడులు చేశానని చెప్పిన ఇజ్రాయిల్, ప్రపంచ దేశాలు ఖండించిన తర్వాత ఆ శిబిరాల మీద బాంబు దాడి చేయడం తీవ్రమైన పొరపాటు అని అంగీకరించింది. అదే సమయంలో యుద్ధం కొనసాగిస్తానని ప్రకటించింది. మొత్తం వెస్ట్‌బ్యాంక్‌ను, గాజా ప్రాంతాన్ని ఆక్రమించుకునే లక్ష్యంతో దాడులు కొనసాగిస్తోంది.

పాలస్తీనా గుర్తింపు

మొదటి నుండీ పాలస్తీనా సమస్యకు పరిష్కారం పాలస్తీనా ప్రాంతాన్ని ఒక సార్వభౌమ దేశంగా గుర్తించడంలోనే ఉందని అందరూ అనుకుంటున్నదే. దీనికి పూర్తిగా అడ్డుపడుతున్నది అమెరికా. తాజాగా ఐర్లాండ్, స్పెయిన్, నార్వే దేశాలు కూడా పాలస్తీనాను స్వతంత్ర దేశంగా గర్తించాయి. 2024, మే లో 193 ఐక్యరాజ్య సమితి సభ్య దేశాలలో 145 దేశాలు పాలస్తీనాను సార్వభౌమ దేశంగా గుర్తించాయి. ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీకి కేవలం పాలస్తీనా ఒక ఆహ్వానితురాలిగా ఉంది. పూర్తి సభ్య దేశంగా గుర్తించాల్సిన అవసరం ఉంది. దీనికి ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో సభ్యురాలిగా ఉంటూ వీటో పవర్ ఉన్న అమెరికా అడ్డుపడుతోంది.

నాగరిక సమాజంగా, ఆధునిక సమాజంగా ఉన్న నేటి ప్రపంచంలో ఇప్పటికీ పాలస్తీనాను ఒక స్వతంత్ర దేశంగా గుర్తిం చకపోవడాన్ని ప్రపంచ ప్రజాస్వామ్యవాదులంతా ఖండించాలి. పాలస్తీనా భూభాగాన్ని తిరిగి పాలస్తీనాకు స్వాధీనం చేసి దాన్ని వెంటనే ఒక సార్వభౌమ దేశంగా గుర్తించా ల్సిన అవసరం నేడు మరింతగా ఉంది. దీనికి అడ్డుపడుతున్న అమెరికా, ఇజ్రాయిల్ చర్యలను ప్రపంచ దేశాలు పూర్తిగా అడ్డుకో వాలి. భారతదేశ ప్రజలు కూడా ఈ పనిలో భాగస్వాములు కావాలి.

/ వ్యాసకర్త సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు /

నాగరిక సమాజంగా, ఆధునిక సమాజంగా ఉన్న నేటి ప్రపంచంలో ఇప్పటికీ పాలస్తీనాను ఒక స్వతంత్ర దేశంగా గుర్తించకపోవడాన్ని ప్రపంచ ప్రజాస్వామ్యవాదులంతా ఖండించాలి. పాలస్తీనా భూభాగాన్ని తిరిగి పాలస్తీనాకు స్వాధీనం చేసి దాన్ని వెంటనే ఒక సార్వభౌమ దేశంగా గుర్తించాల్సిన అవసరం నేడు మరింతగా ఉంది. దీనికి అడ్డుపడుతున్న అమెరికా, ఇజ్రాయిల్ చర్యలను ప్రపంచ దేశాలు పూర్తిగా అడ్డుకోవాలి. భారతదేశ ప్రజలు కూడా ఈ పనిలో భాగస్వాములు కావాలి.

మొదటి నుండీ పాలస్తీనా సమస్యకు పరిష్కారం పాలస్తీనా ప్రాంతాన్ని ఒక సార్వభౌమ దేశంగా గుర్తించడంలోనే ఉందని అందరూ అనుకుంటున్నదే. దీనికి పూర్తిగా అడ్డుపడుతున్నది అమెరికా. తాజాగా ఐర్లాండ్, స్పెయిన్, నార్వే దేశాలు కూడా పాలస్తీనాను స్వతంత్ర దేశంగా గర్తించాయి. 2024, మే లో 193 ఐక్యరాజ్య సమితి సభ్య దేశాలలో 145 దేశాలు పాలస్తీనాను సార్వభౌమ దేశంగా గుర్తించాయి. ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీకి కేవలం పాలస్తీనా ఒక ఆహ్వానితురాలిగా ఉంది. పూర్తి సభ్య దేశంగా గుర్తించాల్సిన అవసరం ఉంది. దీనికి ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో సభ్యురాలిగా ఉంటూ వీటో పవర్ ఉన్న అమెరికా అడ్డుపడుతోంది.

సెటైర్

తేలని లెక్కలు

సుబ్రమణ్యం

గగన్ వర్మ మరణించాడు. తనకిప్పుడిప్పుడే మరణం లేదని గగన్‌కు గట్టి నమ్మకం ఉండేది. తన నమ్మకాన్ని ఎంత గట్టిగా ప్రకటిస్తూ వచ్చాడంటే...నా బోటి పరిశీలకులు సైతం గగన్ చాలా కాలం బతికేలా ఉన్నాడన్న అభిప్రాయంతో ఉండేవాళ్ళు. కాని ఎంతటి వారికైనా మరణము తప్పదు కదా. అందుచేత గగన్ వర్మ ఉన్నట్టుండి ...పోయాడు.

పరలోకం మీద గగన్ వర్మకు గట్టి విశ్వాసం ఉండేది. ఆ పరలోకానికే తానూ చేరి దైవం రక్షణలో ఉంటాననుకున్నాడు. ఆ విశ్వాసమే గగన్ ను పరలోకపు ప్రవేశ ద్వారం వద్దకు చేర్చింది. అక్కడ ఉన్న ద్వారపాలకుడు గగన్ వర్మను చూడగానే తలుపులు తెరిచాడు. చిరునవ్వుతో లోపలికి అడుగుపెట్టిన గగన్ నిర్ఘాంతపోయాడు. అది స్వర్గం కాదు. నరకం !

"ఏమిటీ అన్యాయం ? నేను స్వర్గానికి పోవలసినవాడిని. నన్ను ఇక్కడికి ఎందుకు కేటాయించారు ? నేను ఒప్పుకోను. అప్పీలు చేసుకుంటాను " అని ప్రకటించాడు. పరలోకంలో సత్వర న్యాయం అమలౌతుంది కదా. అక్కడ వాయిదాలు, బెయిళ్ళూ ఉండవు మరి. వెంటనే అప్పిలేట్ కోర్టు న్యాయమూర్తి ముందుకి గగన్ ను చేర్చారు.

"చెప్పండి గగన్ వర్మ గారూ ? మిమ్మల్ని నరకానికి ఎందుకు పంపకూడదో కారణాలు తెలపండి " అని న్యాయమూర్తి అడిగారు. అప్పుడు గగన్ " అయ్యా న్యాయమూర్తిగారూ ! నేను భూలోకంలో రాజ్యాన్ని పాలించిన కాలంలో నాకు తెలిసి అన్నీ పుణ్యకార్యాలే చేశాను. 40 లక్షల మందికి వితంతు పెన్షన్లు నెలనెలా వచ్చేలా చేశాను. 60 లక్షల మందికి వృద్ధాప్య, వికలాంగుల పెన్షన్లు వచ్చేలా చేశాను. ఇంకా అనేక లక్షల మంది చిన్న వృత్తులవారికి, రైతులకు తోడ్పాటు అందించాను. తల్లి కడుపు స్కీం ద్వారా తమ బిడ్డల్ని చదివించుకునేందుకు తోడ్పాటు అందించాను. దాని వలన లాభం పొందినవారు కూడా లక్షల్లోనే ఉన్నారు. మరి వారందరి దీవెనలూ నాకే కదా ఉంటాయి? అందరి దీవెనలు పొందగలిగినప్పుడు నేను నరకానికి ఎందుకు పోవాలి? " అని గగన్ వర్మ తన వాదనను అత్యంత వేదనాభరితంగా వినిపించేడు.

అప్పుడు న్యాయమూర్తిగారు తన దగ్గరున్న చిట్టా బైటకు తీసేడు. దానిని పరిశీలించి ఇలా చెప్పేడు : "గగన్ వర్మ గారూ ! మీరు కేవలం మీ పాలనలో చేసిన పుణ్యకార్యాలనే ఇక్కడ చెప్పారు తప్ప... మీరు చేసిన అన్ని పనులనూ పేర్కొనలేదు. మచ్చుకి: కరెంటు చార్జీలు పెంచేశారు. ఆ చార్జీలు ఎంతెంత పెరిగాయో, ఆ బిల్లులు కట్టలేక ఎన్ని లక్షల మంది ప్రజలు మిమ్మల్ని బిల్లులు కట్టిన ప్రతీసారీ తిట్టుకున్నారో మీకు తెలుసా ? మా దగ్గర రికార్డు ఉంది. ఆస్తి పన్ను పెంచేశారు. పేదవాళ్ళని కూడా విడిచిపెట్టకుండా చెత్త పన్ను వసూలు చేశారు. లక్షల మంది స్కీము వర్కర్ల గోడు పట్టించుకోలేదు సరికదా వాళ్ళని జైళ్ళలో పెట్టారు. ఇళ్ళ నుంచి బైటకు రాకుండా వాళ్ళని నిర్బంధించిన సందర్భాలెన్నో మీకు గుర్తున్నాయా ? సమాజానికి జ్ఞానబోధ చేసే ఉపాధ్యాయుల ఉసురు పోసుకున్నారు. లక్షల మంది కౌలుదారులను గాలికొదిలేశారు. కోట్లాది మంది అసంఘటిత కార్మికులకు కనీస వేతనాలను కనీసమైనా పెంచినది లేదు. ఇంకా..." న్యాయమూర్తి చెప్పబోతూంటే గగన్ వర్మ ఆపాడు.

"అయ్యా! అలాంటివి తమరు పట్టించుకోరాదని నా మనవి. ఎందుకంటే మొదటిది: నేను చేసిన పుణ్యకార్యాల ముందు ఇవన్నీ చాలా తక్కువ. పైగా మీరు శలవిచ్చిన చాలా పనులు హస్తినాపురం నుండి చక్రవర్తుల వారు పంపిన ఆదేశాలను బట్టి చేశానే తప్ప మరోటి కాదు. "

న్యాయమూర్తికి ఆగ్రహం వచ్చింది. "మూర్ఖుడా ! మరణించాక కూడా నీ ధోరణి మారదా? ఎవరు చెప్పినదీ వినిపించుకోవా? నీ హితవు కోరి అనేకమంది నీ పాలన గురించి చెప్పిన సలహాలు, అభిప్రాయాలు అప్పుడు పెడచెవిన పెట్టావు. ఇక్కడికి చేరావు. ఆఖరిసారి చెప్తున్నాను విను ! నువ్వు చేసిన పుణ్యకార్యాలకన్నా పాపాలే ఎక్కువగా ఉన్నాయి. ఆ పాపాల లెక్కల్ని నువ్వు ఎక్కడా రాసుకోలేదు. నీ సేవకులు కూడా ఎవరూ రాసినట్టు లేదు. పైగా నువ్వేటూ ఎవరు చెప్పినా వినిపించుకునే రకం కాదని నీ సైన్యం యావత్తూ ఏకాభిప్రాయంతో ఉంది. అందుకే వాళ్ళెవ్వరూ నీకు చెప్పే సాహసం చేయలేదు. ఇక హస్తినాపురం చక్రవర్తి అంటావా ! అతగాడికి కూడా హెచ్చరిక వెళ్ళింది. అతగాడి సమయం వచ్చినప్పుడు అతడూ నీ దగ్గరకే వస్తాడు. అప్పుడు ఇద్దరూ తీరుబాటుగా మీ మీ తప్పుల వాటాలను తేల్చుకుందురు గాని. నీ అప్పీలును తిరస్కరిస్తున్నాను" అన్నాడు.

"అయ్యా! కోపగించుకోకండి. నా బాధలో నేనున్నాను. కాస్త జాలి చూపండి. నా సంగతి సరే. మరి నా స్థానంలో ఇప్పుడు పట్టాభిషిక్తుడు కాబోతున్నవాడి సంగతేమిటి? అతగాడేమైనా పుణ్యాత్ముడా? అతడికి ఈ విజయం ఎలా వచ్చింది? ఇది న్యాయమా? " అని గగన్ అడిగాడు ఉక్రోషంగా.

" ఓయి గగన్ వర్మా ! మీ రాజ్యంలో ప్రజలకు నిజమైన తీర్పు చెప్పే అవకాశం ఎక్కడుంది? 'లాఠీ దెబ్బలు తినాలా లేక బెత్తం దెబ్బలు తినాలా అన్నది ఎంచుకోండి' అన్న చందాన నడుస్తున్నాయి రాజకీయాలు. ప్రజలని దోపిడీ నుంచి విముక్తి చేసే రాజకీయాలనేవి ఉన్నాయని, వాటిని కూడా ఎంచుకోవచ్చునని ప్రజలు గ్రహించనంత కాలమూ అటు లాఠీనో, ఇటు బెత్తాన్నో ఎంచుకుంటూనే వుంటారు. దెబ్బలు తింటూనే వుంటారు. గతంలో సైకిల్ తొక్కి తొక్కి చెమటలెక్కిపోయాక కాసేపు ఫ్యాన్ గాలి కింద కూర్చుందామనుకున్నారు. ఇప్పుడు ఆ ఫ్యాన్ కి బిల్లులు కట్టలేక, మళ్ళీ సైకిలెక్కుదామనుకున్నారు. ప్రజలు తమకు నిజంగా మేలు చేసే రాజకీయాలేమిటో తెలుసుకునే రోజూ వస్తుందిలే. నువ్విక్కడ ఎంతో కాలం ఒంటరిగా ఉండనక్కరలేదు. నీకు తోడు ఇంకా చాలామంది పాలకుల్ని ప్రజలే ఇక్కడికి పంపుతారు."

పాపం గగన్ వర్మ ! నరకంలో కూచుని ఇంకా తన పుణ్యకార్యాల లెక్కల్నే మళ్ళీ మళ్ళీ సరి చూసుకుంటున్నాడు!

"మూర్ఖుడా ! మరణించాక కూడా నీ ధోరణి మారదా? ఎవరు చెప్పినదీ వినిపించుకోవా? నీ హితవు కోరి అనేకమంది నీ పాలన గురించి చెప్పిన సలహాలు, అభిప్రాయాలు అప్పుడు పెడచెవిన పెట్టావు. ఇక్కడికి చేరావు. ఆఖరిసారి చెప్తున్నాను విను ! నువ్వు చేసిన పుణ్యకార్యాలకన్నా పాపాలే ఎక్కువగా ఉన్నాయి. ఆ పాపాల లెక్కల్ని నువ్వు ఎక్కడా రాసుకోలేదు. నీ సేవకులు కూడా ఎవరూ రాసినట్టు లేదు. పైగా నువ్వేటూ ఎవరు చెప్పినా వినిపించుకునే రకం కాదని నీ సైన్యం యావత్తూ ఏకాభిప్రాయంతో ఉంది. అందుకే వాళ్ళెవ్వరూ నీకు చెప్పే సాహసం చేయలేదు. ఇక హస్తినాపురం చక్రవర్తి అంటావా ! అతగాడికి కూడా హెచ్చరిక వెళ్ళింది. అతగాడి సమయం వచ్చినప్పుడు అతడూ నీ దగ్గరకే వస్తాడు. అప్పుడు ఇద్దరూ తీరుబాటుగా మీ మీ తప్పుల వాటాలను తేల్చుకుందురు గాని. నీ అప్పీలును తిరస్కరిస్తున్నాను"

జనవాక్యం

ప్రత్యేక హోదా కోసం పోరు

వైసిపి పాలకులు ప్రత్యేక హోదా సాధిస్తామని నమ్మబలికి, తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చి, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి పూర్తి మెజారిటీ ఉంది కనుక మేము ఏమీ చేయలేమంటూ నీళ్ల నమిలారు! వారికున్న సమస్యలతో లాలూచీ పడినట్లు అప్పట్లో విమర్శలు కూడా వచ్చాయి. ఇదే సందర్భంలో గతంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక హోదాకు బదులు ప్రత్యేక ప్యాకేజీకి అంగీకరిస్తే జనసేన అధినేత పవన్ కల్యాణ్ అందుకు అభ్యంతరం వ్యక్తం చేస్తూ పాచిపోయిన లడ్డూగా అభివర్ణించారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీ వారు తాము అధికారంలోకి వస్తే ప్రత్యేక హోదా ఇస్తామంటున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు కేంద్రంలో ప్రభుత్వ ఏర్పాటుకు మన ఎంపీల మద్దతు కీలకం కనుక రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు ప్రత్యేక హోదా సాధన కోసం గట్టిగా కృషి చేయాలి. గత అయిదు సంవత్సరాలుగా రాష్ట్రంలో ఒక్క పరిశ్రమ కూడా నెలకొల్పలేదు. పరిశ్రమలు రావాలంటే రాయితీలు తప్పనిసరి. మరి ఎన్.డి.ఎ.లో భాగస్వామ్య పక్షంగా ఉంటూ కీలక పాత్ర పోషిస్తున్న జనసేనతోబాటు, టిడిపి ఈ దిశగా ప్రయత్నించాలి. ప్రజలకు మేలు చేస్తే తప్పక ఆదరిస్తారు. లేకుంటే ఇంటికే!

- గరిమెళ్ల రామకృష్ణ,
ఏలూరు, ఏలూరు జిల్లా.

సంక్షేమ హాస్టళ్లను సంస్కరించరే!

నిరుపేద విద్యార్థులకు ఉత్తమ విద్యతోపాటు వసతి సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం సంక్షేమ హాస్టళ్లను ఏర్పాటు చేసింది. పాలకుల నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపంతో సంక్షేమ హాస్టళ్ల సమస్యలకు నిలయాలుగా మారాయి. దశాబ్దాల క్రితం నిర్మించిన భవనాల్లోనే నేటికీ వసతి గృహాలను కొనసాగిస్తున్నారు. ఎప్పుడు కూలతాయోనని భయం గుప్పిట్లో విద్యార్థులు కాలం వెళ్లదీస్తున్నారు. మరి కొన్ని చోట్ల అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా గదులు, మరుగుదొడ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలు చోట్ల సరిపడా సిబ్బంది లేక పర్యవేక్షణ కొరవడింది. ఏ ఒక్క హాస్టల్లోనూ మెనూ పాటించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. అపరిశుభ్ర వాతావరణం, నాసిరకం సామగ్రితో విద్యార్థులు తరచూ ఫుడ్ పాయిజన్‌కు గురవుతున్నారు. ఇప్పటికైనా భావిభారత పౌరులను తీర్చిదిద్దే సంక్షేమ హాస్టళ్లను చక్కదిద్దాల్సిన అవసరం ఎంతైనా వుంది.

- అప్పన్న గొనప,
విశాఖపట్నం.

భ్రూణ హత్యలు దుర్మార్గం

నేటి ఆడపిల్లలు అన్ని రంగాలలో రాణిస్తున్నా ఇంకా పుత్రుడు కావాలనే భావజాలం నుంచి తల్లిదండ్రులు బయటపడలేకపోవడం అత్యంత దురదృష్టకరం! ఈ మధ్య కాలంలో కర్ణాటక ప్రభుత్వం అల్ట్రా స్కానింగ్ గది లోకి గర్భిణులతో పాటు వచ్చే అటెండర్లను నిషేధిస్తూ సర్క్యులర్ జారీ చేయడం ఎంతైనా శుభ పరిణామం, హర్షణీయం. ఎందుకంటే అటెండర్ల రూపంలో అల్ట్రా స్కానింగ్ గది లోకి వచ్చి వీడియో తీసి మరీ లింగ నిర్ధారణ చేయడమే కాదు. తద్వారా మహిళ కడుపులో వున్నది ఆడపిల్ల అని తేలితే నిర్దాక్షిణ్యం గా అబార్షన్ చేయిస్తుండటం అత్యంత ఆందోళన కరం. ఇక 2011 లెక్కల ప్రకారం కశ్మీర్, హర్యానా, మహారాష్ట్ర లలో 120 మంది అబ్బాయిలకు కేవలం 100 మందే అమ్మాయిలు వున్నారు. ఇలాంటి దారుణ పరిస్థితి ప్రస్తుత సమాజంలో వున్న నేటికీ ఒడిషా, కర్ణాటక లలో లింగ నిర్ధారణ జరిపించి మరీ ఆడపిల్లలను ఏ మాత్రం జాలి, దయ, కరుణ లేకుండా వారిని గర్భంలోనే ఛిద్రం చేస్తున్న దయనీయ పరిస్థితి మన ముందుంది. అయితే సింగపూర్, థాయిలాండ్, దుబాయ్ దేశాలలో లింగ నిర్ధారణ చేయడం నేరం కాకపోవడంతో ఈ బలహీనతను ఆధారంగా చేసుకొని కొందరు ఒక రాకెట్ లాగా ఏర్పడి ఆ వీడియోలను ఈ దేశాలలోని వైద్యులకు పంపించి మరీ లింగ నిర్ధారణ చేయించి ఆ తర్వాత అబార్షన్ చేయిస్తున్నారు. అంటే ఎంతటి వికృత, అమానుష చేష్టలు ప్రస్తుత సమాజంలో పొడ చూపుతున్నాయో కదా. తాజాగా మాండ్యాలో ఇలాంటి అపాయకరమైన, రాకెట్‌ను పోలీసులు ఛేదించి పట్టుకుని దేశ వ్యాప్తంగా కూడా గట్టి నిఘా వుంచారు. ఈ పరిస్థితిలోనే కర్ణాటక ప్రభుత్వం ఈ అంశంపై కొత్త సర్క్యులర్ జారీ చేసి కొరడా ఝుళిపించింది. ఏది ఏమైనా భ్రూణ హత్యలకు పూనుకోవద్దు. ఆడపిల్లను పుట్టనిద్దాం. బతకనిద్దాం. ఎదగనిద్దాం.

- బుగ్గన మధుసూదనరెడ్డి,
బేతంచెర్ల, నంద్యాల జిల్లా.

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@gmail.com

కేంద్రంలో మళ్లీ సంకీర్ణ రాజకీయాలు

- సంకీర్ణ ధర్మాన్ని పాటించని బిజెపి
- భాగస్వామ్యపక్షాలే పణంగా ఎదుగుదల

ఢిల్లీలో బుధవారం జరిగిన ఎన్‌డిఎ సమావేశంలో ప్రధాని మోడీ, టిడిపి అధ్యక్షులు చంద్రబాబు, జెడియు అధినేత నితీష్‌కుమార్

న్యూఢిల్లీ : ఈ సారి లోక్‌సభ ఎన్నికలు రెండు రకాలుగా చరిత్ర సృష్టించాయి. నరేంద్ర మోడీ వరుసగా మూడోసారి ప్రధాని పదవిని చేపట్టనున్నారు. గతంలో ఈ అర్హత సాధించిన వ్యక్తి ఒక్కరే. ఆయనే దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ. ఇక రెండో అంశానికి వస్తే పదేళ్ల తర్వాత మళ్లీ సంకీర్ణ రాజకీయాలను దేశం చూడబోతోంది. సంకీర్ణ భాగస్వాముల ఒత్తిడి వల్లే అనే పదం గతంలో తరచూగా వినబడేది, కానీ 2014లో మోడీ ప్రధాని అయిన తర్వాత ఆ పదం వినబడటమే మానేసింది. అయితే తాజాగా ప్రజలిచ్చిన తీర్పుతో మళ్లీ సంకీర్ణ రాజకీయాలకు తెర లేచింది.

ఈ ఎన్నికల్లో బిజెపి 240 సీట్లతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అవసరమైన మెజారిటీకి 32 సీట్లు తగ్గాయి. దీంతో బిజెపి స్వంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేని పరిస్థితి నెలకొంది. అయితే ఇప్పటివరకు కనీసం పార్టీ పేరుతో కూడా కాకుండా మోడీ సర్కార్, మోడీ హామీలు అని పదే పదే జపించిన బిజెపి నేతల నోటి నుండి కొత్తగా ఎన్‌డిఎ ప్రభుత్వం అని వినబడుతోంది. ఎన్నికల ఫలితాలు వెలువడిన రోజు సాయంత్రమే ప్రధాని మోడీ ఇందుకు సిద్ధమై పోయారు. బిజెపి ప్రధాన కార్యాలయంలో పార్టీ కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతూ, అనేకసార్లు ఎన్‌డిఎ ప్రభుత్వమని ఉచ్ఛరించారు. ఒకే నాయకుడు పేరుతో ఎన్నికల్లో పోరాడిన పార్టీకి ఇది కొంత ఇబ్బందికర పరిస్థితే. తాజాగా మారుతున్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ఇప్పుడు పార్టీ లేదా నేతల కన్నా కూటమే కీలకంగా మారే పరిస్థితి నెలకొంటుంది.

ఎన్నికల ముందస్తు పొత్తుల్లో భాగస్వామ్య పక్షాలైన టిడిపి, జెడియు ప్రధాన పాత్ర పోషించనున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో టిడిపి 16 సీట్లను గెలుచుకోగా, బీహార్‌లో జెడియు 12 సీట్లను గెలుచుకుంది. ఇక బీహార్‌లో మరో భాగస్వామి ఎల్‌జెపి (రాం విలాస్) 5 సీట్లు, ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన 7 సీట్లను గెలుచుకున్నాయి. వీరందరూ కలిస్తే ప్రభుత్వానికి అవసరమైన మెజారిటీ వస్తుంది. కింగ్‌మేకర్లుగా మారిన చంద్రబాబు, నితీష్ కుమార్‌లు ఇప్పటికే చర్చల కోసం ఢిల్లీ చేరుకున్నారు. భవిష్యత్తులో ఫిరాయింపుల సమస్య తలెత్తిన పక్షంలో తమకు అవకాశం వుండేలా చూసుకునేందుకు లోక్‌సభ స్పీకర్ పదవి కోసం ప్రయత్నిస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

మిత్రులతో బిజెపి వ్యవహరించిన తీరు

పదేళ్ళ తర్వాత బిజెపి సంకీర్ణ ధర్మాన్ని అనుసరించాల్సిన పరిస్థితులు తలెత్తిన నేపథ్యంలో గత దశాబ్ద కాలంలో బిజెపి ఎలా తన మిత్రపక్షాలను పోగొట్టుకుందో ఇక్కడ గుర్తు చేసుకోవాల్సి వుంది. సంకీర్ణ ధర్మాన్ని బిజెపి ఏనాడూ పాటించిన దాఖలాలు కానరావు. తన ఎదుగుదలే ప్రధానంగా భావించిందే తప్ప భాగస్వామ్యపక్షాల బాగుపడటాన్ని ఆ పార్టీ అభిలషించింది లేదు. పైగా అవకాశమిచ్చిన ప్రతిసారి అణచివేతకే ప్రయత్నించిందన్న విమర్శలను బిజెపి ఎదుర్కొంటోంది.

మోడీ అధికారంలోకి వచ్చిన వెంటనే మొదటిసారిగా నితీష్ కుమార్‌నే బిజెపి వదులుకుంది. ఆ తర్వాత నుండి ప్రతిసారి నితీష్ అటు ఇటూ గెంతులు వేస్తూనే వచ్చారు. తాజా ఎన్నికల సమయంలో కూడా ఇండియా బ్లాక్‌లో వుంటారనుకున్న ఆయన హఠాత్తుగా ఎన్‌డిఎలో చేరి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఒకప్పుడు భాగస్వామి అయిన పంజాబీ శిరోమణి అకాలీదళ్ (ఎస్‌ఎడి) కూడా రైతాంగం నిరసనల సమయంలో బిజెపితో తెగతెంపులు చేసుకుంది. ఒరిస్సా ముఖ్యమంత్రి బిజూ పట్నాయక్‌తో ఒప్పందం కుదుర్చుకునేందుకు మోడీ సాగించిన యత్నాలు విఫలమవడంతో ఆకస్మాత్తుగా బిజూ జనతాదళ్ (బిజెడి) కూడా కంటగింపుగా మారింది. ఇక తెలుగుదేశం పార్టీతో బిజెపి సంబంధాలు ఎప్పుడూ నిలకడగా లేవు. మోడీ ప్రభుత్వంలో చంద్రబాబు చేరినప్పటికీ 2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలో స్వతంత్రంగా పోటీ చేసేందుకు ఆకస్మాత్తుగా కూటమి నుండి బయటకు వచ్చేశారు. అదే సమయంలో ఆయన కార్యాలయాలపై ఐటి దాడులు కూడా జరిగాయి. ఆ విషయాన్ని చంద్రబాబు మర్చిపోలేదు. 2023లో స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కుంభకోణంలో జోక్యం వుందని ఆరోపణలతో అరెస్టు చేయడం ఆయనకు పెద్ద ఎదురుదెబ్బ. తాజాగా ఎన్నికల ప్రచార సమయంలో కూడా మోడీ వ్యతిరేకంగా మాట్లాడితే ఇడి, ఐటి దాడులు తప్పవంటూ ఆయన వ్యాఖ్యలు కూడా చేశారు. అయితే ఇప్పుడు సంకీర్ణ పంథాలో నడిచే సమయంలో ఆయన జాగ్రత్తగా వ్యవహరిస్తారని భావిస్తున్నారు.

సంకీర్ణ భాగస్వాములను పణంగా పెట్టి ఎదిగే లక్షణం కేంద్రంలో భాగస్వామ్య పక్షాలతో బిజెపి సంబంధాలు ఎప్పుడూ వివాదాస్పదంగానే వున్నాయి. 2019లో హర్యానా అసెంబ్లీ ఎన్నికల తర్వాత ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైనప్పుడు మెజారిటీ కోసం దుష్యంత్ చౌతాలా నేతృత్వంలోని జెజెపిని వాడుకున్న బిజెపి తాజాగా 2024 సీట్ల సర్దుబాటు చర్చల్లో మరీ ఎక్కువ డిమాండ్ చేస్తున్నారంటూ సంబంధాలు తెగ తెంపులు చేసుకుంది. మహారాష్ట్రలోకూడా ముందస్తు పొత్తులు వున్నప్పటికీ బిజెపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేకపోయింది. తర్వాత శివసేన, ఎన్‌సిపిలను పణంగా పెట్టి మరీ తానుకున్నది చేసింది. ఈ పరిస్థితులతో రాబోయే రోజుల్లో పరిస్థితులు ఎలా రూపుదిద్దుకుంటాయో ఇప్పుడే ఊహించడం కూడా కష్టమే. చంద్రబాబు, నితీష్ కుమార్‌లు ఏం అడుగుతారు? బిజెపి ఎంతవరకు వారి కోసం కిందకు దిగివస్తుంది? వంటి వన్నీ త్వరలో తేలే అంశాలు.

19 వరకూ కేజ్రీవాల్ కస్టడీ పొడిగింపు

న్యూఢిల్లీ : ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ జ్యుడీషియల్ కస్టడీని ఈ నెల 19 వరకూ ఢిల్లీలోని కోర్టు బుధవారం పొడిగించింది. గతంలో విధించిన జ్యుడీషియల్ కస్టడీ బుధవారంతో ముగియడంతో ఢిల్లీలోని రోస్ అవెన్యూ కోర్టులో కేజ్రీవాల్‌ను హాజరు పర్చారు. జడ్జి కావేరి బవేజా కస్టడీని పొడిగించారు. అలాగే వైద్య కారణాలతో ఏడు రోజుల బెయిల్ కోరుతూ కేజ్రీవాల్ దాఖలు చేసిన మధ్యంతర బెయిల్ పిటిషన్‌ను కూడా జడ్జి తిరస్కరించారు. అయితే అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారం కోసం సుప్రీంకోర్టు ఇచ్చిన బెయిల్ గడువు ముగియడంతో ఈ నెల 2న తీహార్ జైలులో కేజ్రీవాల్ లొంగిపోయిన సంగతి తెలిసిందే.

గుజరాత్‌లో రూ.130 కోట్ల కొకైన్ పట్టివేత

అహ్మదాబాద్ : గుజరాత్‌లోని కచ్ తీరంలో రూ.130 కోట్ల విలువైన కొకైన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గాంధీధామ్ పట్టణంలోని మితి రోహర్ ప్రాంతంలో స్మగ్లర్లు సముద్ర తీరంలో మాదకద్రవ్యాలను దాచి పెట్టారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు బుధవారం తనిఖీలు చేపట్టి 13 ప్యాకెట్ల కొకైన్‌ను పట్టుకున్నారు. దీని విలువ రూ.130 కోట్లకు పైగా ఉంటుందని పేర్కొన్నారు. వీటిని తరలిస్తున్న నిందితులను అదుపులోకి తీసుకున్నారు. గత ఏడాది సెప్టెంబర్‌లో ఇదే ప్రాంతంలో రూ.800 కోట్ల విలువైన 80 కొకైన్ ప్యాకెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

కెన్‌ఫిన్ హోమ్స్ లిమిటెడ్
CanFinHomes Ltd (Sponsor: CANARA BANK) HOME LOANS + DEPOSITS Translating Dreams into Reality
బ్రాంచ్ చిరునామా : డి.నెం. 40-5-9/17, సిద్ధార్థ కాలేజ్ బస్టాప్ దగ్గర, మొగల్రాజపురం, విజయవాడ-520010,
ఫోన్. 08662474781, 2481731, మొబైల్ నెం.7625079119,
E-mail : vijaywada@canfinhomes.com. CIN No. : L85110KA1987PLC008699

అనుబంధం -IV-A [రూల్ 9(1) కి సంబంధించిన నిబంధనలను చూడండి]
స్థిరాస్తుల అమ్మకం కొరకు ప్రకటన
సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002లోని రూల్ 9(1) సదుపాయము క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకపు నోటీసు

ఈ నోటీసు ద్వారా ప్రత్యేకించి "ఋణగ్రహీత(లు) మరియు హామీదారు(లు)" మరియు సాధారణ ప్రజానీకమునకు తెలియజేయునది ఏమనగా, సెక్యూర్డు క్రెడిటర్‌కు తనఖా / కుదువ పెట్టిన క్రింద తెలిపిన స్థిరాస్తిని కెన్‌ఫిన్ హోమ్స్ లిమిటెడ్, మొగల్రాజపురం, విజయవాడ బ్రాంచి యొక్క అధీకృత అధికారి భౌతికంగా స్వాధీనం చేసుకొని కెన్‌ఫిన్ హోమ్స్ లిమిటెడ్ కు చెందిన బకాయి మొత్తమును ఋణగ్రహీత : శ్రీ షేక్ సద్దాం హుస్సేన్ మరియు శ్రీ షేక్ ఖాజా పీర్ ల నుండి తేది.05.06.2024 నాటికి భవిష్య వడ్డీ మరియు ఇతర ఛార్జీలతో కలుపుకొని రూ.1,00,77,644/- (అక్షరాల ఒక్క కోటి డెబ్బై ఏడు వేల ఆరు వందల నలభై నాలుగు రూపాయలు మాత్రమే) వసూలు చేసుకొనుటకు క్రింద తెలిపిన ఆస్తిని "ఎక్కడ ఎలా ఉన్నదో, ఏది ఎలా ఉన్నదో మరియు ఏదైతే ఎలా ఉన్నదో అది అలానే" ప్రాతిపదికన తేది.26.06.2024 న అమ్మటకు నిర్ణయించడమైనది. సదరు ఆస్తి యొక్క రిజర్వు ధర రూ.35,00,000/-(అక్షరాల ముప్పై ఐదు లక్షల రూపాయలు మాత్రమే) మరియు ధరావత్తు సొమ్ము రూ.3,50,000/-(అక్షరాల మూడు లక్షల యాభై వేల రూపాయలు మాత్రమే) గా నిర్ణయించడమైనది.

స్థిరాస్తి వివరములు :
ఆంధ్రప్రదేశ్, విజయవాడ, అజిత్‌సింగ్ నగర్, ముత్యాలంపాడు, కనకదుర్గ నగర్ వద్ద క్రొత్త అసెస్‌మెంట్ నెం.140262, పాత అసెస్‌మెంట్ నెం.31140ఎ/202ఎఫ్, వార్డు నెం.16, డోర్ నెం.43-107/1, ప్లాటు నెం.07, ఆర్.యస్.నెం.2/1బి, 2/2 లలోని 120 చ.గ.లు విస్తీర్ణం గల భూమి యావదాస్థినకు హద్దులు : ఉత్తరం : జి.రమణమ్మ గారికి చెందిన ప్లాటు నెం.06, దక్షిణం: ప్లాటు నెం.08, తూర్పు : ఆంధ్రప్రభ వారికి చెందిన ప్లాటు, పడమర : 20 అ.లు వెడల్పు రోడ్డు.
ఋణభారాలు : లేవు
అమ్మకం యొక్క వివరణాత్మక నియమ నిబంధనలను అధికారిక వెబ్‌సైట్ కేన్‌ఫిన్ హోమ్స్ లిమిటెడ్ www.canfinhomes.com వద్ద లభించును. క్రింద తెలిపిన లింకు అనగా ఇందుమూలముగా తెలియజేయడమేమనగా https://canfinhomes.com /SearchAuction.aspx ను రిఫర్ చేయండి.
తేది : 05.06.2024
ప్రదేశం : విజయవాడ
సం/-అధీకృత అధికారి, కెన్‌ఫిన్ హోమ్స్ లిమిటెడ్

ఈ ఎన్నికల ఫలితాలు బిజెపికి గట్టి దెబ్బ : కేరళ సిఎం

తిరువనంతపురం : ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను ధ్వంసం చేసేలా బిజెపి చేస్తున్న ప్రయత్నాలకు 2024 లోక్‌సభ ఫలితాలు గట్టి దెబ్బ అని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ బుధవారం అన్నారు. కాషాయ పార్టీకి అనుకూలంగా చేసిన ప్రచారాన్ని ప్రజలు తిరస్కరించారని పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాలపై విజయన్ స్పందిస్తూ మతతత్వాన్ని ఉపయోగించి ముందుకు సాగాలన్న బిజెపి ఎత్తులను భారత ప్రజలు విచ్ఛిన్నం చేశారని అన్నారు. త్రిసూర్‌లో బిజెపి విజయాన్ని చాలా సీరియస్‌గా చూస్తున్నామని, దీనిపై సమీక్ష చేయనున్నామని ఒక ప్రకటనలో తెలిపారు.

మీ సోదరి అయినందుకు గర్వపడుతున్నాను

- ప్రియాంక భావోద్వేగ పోస్టు

న్యూఢిల్లీ : 'మీ సోదరి అయినందుకు గర్వపడుతున్నా'నని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీని ఉద్దేశించి ఆ పార్టీ మరో నేత, ఆయన సోదరి ప్రియాంక గాంధీ పేర్కొన్నారు. ఈ మేరకు సోషల్ మీడియాలో ప్రియాంక భావోద్వేగంగా ఒక పోస్టు చేశారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెల్లడైన నేపథ్యంలో ఈ పోస్టును చేశారు. ఎన్నికల యుద్ధభూమిలో రాహుల్‌గాంధీ సత్యాన్ని, నమ్మకాన్ని ప్రియాంక గాంధీ అభినందించారు. 'ఎవరు ఎన్ని అన్నా.. ఎన్ని చేసినా.. మీ నమ్మకాన్ని అనుమానించినా మీరు ధైర్యంగా ఉన్నారు. మీ నమ్మకాన్ని విడిచిపెట్టలేదు. నిజం కోసం పోరాటం ఆపలేదు. నిజాలను అణగదొక్కడానికి వారు అబద్ధాలను ప్రచారం చేసినా.. మీరు కోపం, విద్వేషం వ్యక్తం చేయలేదు' అని ప్రియాంక ప్రశంసించారు. రాహుల్ తన హృదయంలోని ప్రేమ, నిజం, దయతో పోరాటం చేసినందుకు ప్రియాంక అభినందించారు. 'ఇప్పటి వరకూ నిన్ను చూడలేని వారిని ఇప్పుడు నిన్ను చూడనీ.. కానీ మాలో చాలా మందికి తెలుసు, చూశాం నువ్వు మా అందరికంటే ధైర్యవంతుడని' అని ప్రియాంక తెలిపారు.

ట్రెక్కింగ్‌కు వెళ్లి ఐదుగురి మృతి

న్యూఢిల్లీ : ప్రతికూల వాతావరణం కారణంగా ఒక ట్రెక్కింగ్ బృందం దారి తప్పడంతో ఇందులోని ఐదుగురు సభ్యులు మరణించారు. ఈ ఘటన ఉత్తరాఖండ్‌లో ఉత్తరకాశీ జిల్లాలోని సహస్ర తాల్‌లో జరిగింది. బుధవారం సాయంత్రం వరకూ 13 మందిని రక్షించారు. మొత్తంగా 22 మంది ఉన్న ఈ ట్రెక్కింగ్ బృందంలో మిగిలిన సభ్యులను రక్షించడానికి భారత వైమానిక దళం కూడా ప్రయత్నిస్తోంది. ఈ ఘటన గురించి ఉత్తరకాశీ జిల్లా కలెక్టర్ మెహర్బన్ సింగ్ బిష్ట వివరాలు వెల్లడించారు. ఈ ట్రెక్కింగ్ బృందం కర్ణాటకకు చెందినదిగా తెలిపారు.

విలువల పరిరక్షణ న్యాయమూర్తుల బాధ్యత

- ఆక్స్‌ఫర్డ్‌లో జస్టిస్ చంద్రచూడ్ ప్రసంగం



న్యూఢిల్లీ : వ్యవస్థను పరిరక్షించగల రాజ్యాంగ విలువలను కాపాడుతూ వాటిని కొనసాగించేలా చూడడమన్నది న్యాయమూర్తుల బాధ్యత అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ పేర్కొన్నారు. సమాజంలో న్యాయాధికారులు పోషించగల మానవీయ పాత్ర అనే అంశంపై ఆయన బుధవారం ఆక్స్‌ఫర్డ్ యూనియన్ సొసైటీలో ప్రసంగించారు. తదనంతరం విద్యార్థుల ప్రశ్నలకు ఆయన సమాధానాలు చెప్పారు. న్యాయ వ్యవస్థలోకి మరింత పారదర్శకతను చొప్పించడంలో సాంకేతికత పాత్రను ప్రముఖంగా ప్రస్తావించారు. సోషల్ మీడియాలో న్యాయమూర్తులనుద్దేశించి అన్యాయమైన విమర్శలు కొన్ని వస్తున్నాయన్న విషయాన్ని ఆయన అంగీకరించారు. సాంకేతిక పరిజ్ఞాన ప్రభావం కారణంగా సమాజంలోని విస్తృత వర్గానికి న్యాయ వ్యవస్థ చేరువవడానికి దోహదపడుతోందన్నారు. ప్రజాస్వామ్యంలో న్యాయ వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తుంది. అందువల్లే సమాజానికి ఏది మంచిదనే భావనతో చూసి న్యాయమూర్తులు వ్యవహరిస్తారని అన్నారు. తీర్పులిచ్చే సమయంలో రాజకీయంగా, సామాజికంగా ఒత్తిళ్ళను ఎదుర్కొన్నారా? అని ప్రశ్నించగా న్యాయమూర్తిగా తన 24 ఏళ్ళ కెరీర్‌లో ఎన్నడూ అధికార వర్గాల నుండి ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లను ఎదుర్కొనలేదని స్పష్టం చేశారు. ప్రభుత్వ రాజకీయ విభాగానికి దూరంగా న్యాయ వ్యవస్థ వుంటుంది. అయితే తాము తీసుకునే నిర్ణయాలు స్థూలంగా రాజకీయాలపై ఎలాంటి ప్రభావాన్ని చూపుతాయో తెలుసుకుని వుండాలన్నారు. అదేమీ రాజకీయ ఒత్తిడి కాదని, నిర్ణయం వల్ల కలిగే ప్రభావాల గురించి న్యాయస్థానం తెలుసుకోవడమేనని అన్నారు. సమాజంలో అమానవీయ ప్రభావాలపై పోరాడేందుకు, ఒడిదుడుకులను చక్కదిద్ది వ్యవస్థను సక్రమంగా వుంచేందుకు న్యాయాన్ని ఒక సాధనంగా మార్చేందుకు న్యాయ వ్యవస్థ కృషి చేస్తుందని చంద్రచూడ్ తన కీలకోపన్యాసంలో పేర్కొన్నారు. న్యాయ యంత్రాంగం మానవీయంగా వుండేలా చూసేందుకు సాంకేతికతకు సంబంధించిన మంచి చెడులను అర్థం చేసుకుని ఆచరించడం చాలా ముఖ్యమని పేర్కొన్నారు.

తెల్లవారుజామున 3:30 గంటలకు విచారణా..?

ఇడిపై సుప్రీం ఆగ్రహం

న్యూఢిల్లీ : తెల్లవారుజామున 3.30 గంటలకు నిందితులను విచారించడం ఏమిటని.. ఇడిని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఈ ఘటన విషయంలో ఇడిపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఒక కేసులో నిందితున్ని తెల్లవారుజామున విచారణకు పిలిచి ఆ వ్యక్తిని నిద్రపోనివ్వకుండా విచారించిన ఇడి అధికారుల చర్యను సుప్రీంకోర్టు వెకేషన్ బెంచ్ బుధవారం ప్రశ్నించింది. 'మీరు ఉదయం 10.30కి ఎవరికైనా ఫోన్ చేయండి. అప్పుడు, మీరు ఆ సమయంలో వ్యక్తిని అరెస్టు చేసినట్లు కోర్టు పరిగణిస్తుంది. అలాంటప్పుడు తెల్లవారుజామున 3.30 గంటలకు వ్యక్తిని ప్రశ్నించడం ఏంటి?' అని జస్టిస్ ప్రశాంత్‌కుమార్మిశ్రా, కెవి విశ్వనాథన్‌లతో కూడిన వెకేషన్ బెంచ్ ప్రశ్నించింది. ఈ అంశంపై సమాధానం ఇచ్చేందుకు మరింత సమయం కావాలని ఇడి తరపు న్యాయవాది కోరడంతో కేసు విచారణను కోర్టు వాయిదా వేసింది. కాగా, ఈ కేసులో అరెస్టు ప్రక్రియను ప్రశ్నిస్తూ నిందితులు దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఇప్పటికే ఇడి నోటీసులు జారీ చేసింది.

అంతరిక్ష వాసంలో ప్రపంచ రికార్డు

- ఎక్కువ రోజులు గడిపిన వ్యక్తిగా రష్యా వ్యోమగామి

మాస్కో : అంతరిక్షంలో ఎక్కువ రోజులు గడిపిన వ్యక్తిగా రష్యా వ్యోమగామి ఒలేగ్ కోనొనెంకో ప్రపంచ రికార్డును నెలకొల్పాడు. గతంలో 878 రోజులు గడిపిన గెన్నాడి పడల్కా రికార్డును ఒలేగ్ అధిగమించాడని రష్యా అంతరిక్ష సంస్థ తెలిపింది. కోనొనెంకో జూన్ 5న అంతరిక్షంలో మొత్తం 1,000 రోజులకు చేరుకుంటారని తెలిపింది. సెప్టెంబర్ చివరి నాటికి అతను 1,110 రోజులను పూర్తి చేస్తాడని అంచనా వేస్తున్నట్లు పేర్కొంది. "నేను నాకిష్టమైన పనిని చేయడానికి అంతరిక్షంలోకి వెళతాను, రికార్డులు నెలకొల్పడానికి కాదు" అని కొనోనెంకో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) నుండి ఒక ఇంటర్వ్యూలో చెప్పారు. అతను భూమి నుండి 263 మైళ్ళు (423 కిమీ) కక్ష్యలో ఉన్నాడు. "నా విజయాలన్నింటికి నేను గర్వపడుతున్నాను, కానీ అంతరిక్షంలో మానవుడు గడిపిన మొత్తం కాలానికి సంబంధించిన రికార్డు ఇప్పటికీ రష్యన్ వ్యోమగామి చేతిలో ఉన్నందుకు నేను మరింత గర్వపడుతున్నాను." అని పేర్కొన్నారు.

గాజాలో కొనసాగుతున్న ఇజ్రాయిల్ దాష్టీకాలు..

గాజా : మరోవైపు పాలస్తీనా పౌరులపై ఇజ్రాయిల్ దాష్టీకాలు కొనసాగుతూనేవున్నాయి. బుధవారం నాటికి గడిచిన 24 గంటల్లో గాజాపై ఇజ్రాయిల్ సైనికులు జరిపిన వివిధ రకాల దాడుల్లో 75 మంది మరణించారు. ఒకవైపు ఇజ్రాయిల్ యుద్ధోన్మాదాన్ని నిస్సిగ్గుగా సమర్థిస్తూ వస్తున్న అమెరికా మరోవైపు బందీల విడుదల, కాల్పుల విరమణ అంటూ మొసలికన్నీళ్లు కార్చుతోంది. ఈ దిశగా ఒప్పందం కుదుర్చేందుకు ప్రయత్నిస్తున్నట్లుగా గొప్పలు చెప్పుకుంటోంది. కొద్ది రోజుల క్రితం బైడెన్ ప్రతిపాదించిన మూడంచెల ప్రణాళికను ప్రాంతీయ, అంతర్జాతీయ శక్తులు సమర్థించినా ఇజ్రాయిల్ మాత్రం తిరస్కరిస్తోంది. తమ మూడంచెల ప్రణాళికకు మద్దతివ్వాలంటూ ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిని అమెరికా కోరింది. ఇందుకు సంబంధించిన ముసాయిదా తీర్మానాన్ని మండలిలోని 14 మంది సభ్యులకు పంచినట్లు అమెరికా రాయబారి లిండా థామస్ తెలిపారు.

మోడీకి ఎదురుదెబ్బ

- అంతర్జాతీయ మీడియా వ్యాఖ్య

కత్తిరింపులు

న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై జాతీయ మీడియానే కాదు.. ప్రపంచ మీడియా కూడా దృష్టిని సారించింది. ఈ ఎన్నికల్లో బిజెపి, దాని కూటమికి చేదు ఫలితాలు వచ్చాయని నివేదించాయి. ఇది మితిమీరిన మోడీ ఒంటెద్దు పోకడలకు, విద్వేష భావజాలానికి వ్యతిరేకంగా ప్రజలు ఇచ్చిన తీర్పుగా అభివర్ణించాయి. ది వాషింగ్టన్ పోస్ట్, ది గార్డియన్, బిబిసి వంటి అంతర్జాతీయ వార్త సంస్థలు కేంద్రంలో బిజెపి తీరును కడిగిపారేశాయి. వాటి కథనాల సారాంశం కుప్లంగా..

మోడీకి, ఆయన పార్టీకి పెద్ద ఎదురుదెబ్బ : ది వాషింగ్టన్ పోస్ట్

అమెరికా డైలీ 'ది వాషింగ్టన్ పోస్ట్'.. భారత్‌లోని లోక్‌సభ ఎన్నికలు ప్రధాని మోడీకి, ఆయన పార్టీ (బిజెపి)కి పెద్ద ఎదురుదెబ్బగా అభివర్ణించింది. ప్రధాని మోడీ నాయకత్వాన్ని ఊహించని తిరస్కరణగా ఓటర్లు నిర్ణయించారని పేర్కొన్నది. ఈ ఫలితాలు దశాబ్దాలలో అత్యంత ప్రబలమైన భారత రాజకీయ నాయకుడి అజేయత ప్రకాశాన్ని ప్రభావితం చేశాయని వివరించింది. ఇన్నేండ్ల తర్వాత తొలిసారి మోడీ బలహీనంగా కనిపించారని ది వాషింగ్టన్ పోస్ట్ రాసుకొచ్చింది.

మెజారిటీ కోల్పోయిన మోడీ : ది గార్డియన్

ఎన్నికల్లో బిజెపికి విజయం ఏకపక్షమని వేసిన అంచనాలు నిజం కాలేదని బ్రిటీశ్ డైలీ ది గార్డియన్ పేర్కొన్నది. బలమైన ప్రధానికి, ఆయన హిందూ జాతీయవాద రాజకీయాలకు వ్యతిరేకంగా దేశంలోని అనేక ప్రాంతాల్లో ఎదురుదెబ్బలు తగిలినట్టు స్పష్టమైందని వివరించింది. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు మోడీకి 'ఊహించని దెబ్బ'గా ఎలా నిలిచాయో తన కథనంలో 'ది గార్డియన్' రాసుకొచ్చింది.అలాగే, ఎన్నికల ప్రచారాల్లో మత రాజకీయాలను తీసుకొచ్చి ఓట్లను పొందుదామని బిజెపి భావించిందని వివరించింది. ప్రతిపక్ష ఇండియా కూటమి విజయాన్ని హైలెట్ చేసింది.

తగ్గిన మెజారిటీతో మోడీ విజయం : బిబిసి

లోక్‌సభ ఎన్నికల్లో తక్కువ మెజారిటీతో ప్రధాని మోడీ విజయాన్ని సాధించారని బీబీసీ నివేదించింది. మోడీ పదేండ్ల పాలనకు ఈ ఎన్నికలు రెఫరెండం అని అంతా భావించారనీ, అయితే, ఎన్నికల ఫలితాలు మాత్రం ఎక్కువగా నిరుత్సాహపర్చాయని వివరించింది. ఆశించిన ఫలితాలు సాధించకపోవటంతో దేశవ్యాప్తంగా బిజెపి కార్యాలయాలు 'విచారంగా, చీకటి'గా కనిపించాయని బిబిసి రిపోర్టర్లు పేర్కొన్నారు. ప్రతిపక్ష పార్టీలు బిజెపికి పోటీనిచ్చాయని బిబిసి గుర్తించింది.

అధికారం కోసం కావాలి సాయం : ది న్యూయార్క్ టైమ్స్

ది న్యూయార్క్ టైమ్స్.. మోడీ తన ప్రాభవాన్ని కోల్పోయారని పేర్కొన్నది. ఈ ఎన్నికల్లో ఆయన అధికారంలో ఉండాలంటే ఇతర పార్టీల సాయం కావాల్సి ఉంటుందని నివేదించింది. ఈ ఎన్నికల్లో ప్రభుత్వ వ్యతిరేకత మోడీపై కనబడిందని వివరించింది.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
ఫౌండర్స్ శాఖ
రాబర్ట్‌సన్‌పేట,రవీంద్రనాథ్ ఠాగూర్ రోడ్,మచిలీపట్నం -521001
స్వాధీనత ప్రకటన (రూల్ 8(1)) (స్థిరాస్తి కొరకు)
సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 (చట్టం 54 / 2002) క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 9 తో చదవబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ యూనియన్ బ్యాంకు అఫ్ ఇండియా, ఫౌండర్స్ శాఖ. అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు తేది. 29-02-2024 న డిమాండ్ నోటీసు జారీచేసి సదరు నోటీసు అందుకున్న తేదీ నుండి 60 రోజులలోగా నోటీసులో తెలిపిన బకాయి రూ.15,46,905/-(అక్షరాల పదిహేను లక్షల నలభై ఆరు వేల తొమ్మిది వందల ఐదు మాత్రమే) మరియు తదుపరి వడ్డీ చెల్లించవలసినదిగా ఋణగ్రహీత మరియు హామీదారులను కోరియున్నారు. 1) శ్రీమతి అబ్దుల్ షంషున్నిస్సా భర్త:అబ్దుల్ ఖయ్యూమ్,2)శ్రీ.హుస్సేన్ మహమ్మద్ తండ్రి: అబ్దుల్ ఖయ్యూమ్,3)అబ్దుల్ అహ్మద్ తండ్రి:అబ్దుల్ ఖయ్యూమ్ డోర్ నెం.4/705-1,చెక్కమేడ రోడ్, గంగానమ్మ గుడి దగ్గర,రాజుపేట,మచిలీపట్నం-521001సదరు మొత్తాన్ని చెల్లించుటలో ఋణగ్రహీతల మరియు తనఖాదారు విఫలమైనందున సదరు రూల్స్‌లోని రూల్ 9 తో చదువబడే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద దిగువ వివరించిన స్థిరాస్తిని దిగువ సంతకందారు తేది. 30-05-2024 న స్వాధీనం చేసుకొన్నారని ఋణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి ఈ నోటీసు ద్వారా తెలుపడమైనది.
ఈ స్థిరాస్తితో ఏ విధమైన లావాదేవీలు జరుపరాదని, ఏవేని లావాదేవీలు జరిపిన యెడల అవి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వారికి బకాయి రూ.15,46,905/- మరియు దానిపై తదుపరి వడ్డీ మరియు ఛార్జీలకు బద్ధులై ఉంటారని ముఖ్యంగా ఋణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియజేయడమైనది.
ఋణగ్రహీతలు సెక్యూర్డు ఆస్తులు విడిపించుకొనుటకు గడువు లభ్యతపై సదరు చట్టంలోని సెక్షన్ 13(8)లోని నిబంధనలు గమనించగలరు.
స్థిరాస్తి వివరములు
కృష్ణా జిల్లా,మచిలీపట్నం,రాజుపేట,చెక్కమేడ రోడ్డు,గంగానమ్మ టెంపుల్ దగ్గర పాత డోర్ నెం:4/705, ప్రస్తుత డోర్ నెం:4/705-1 విస్తీర్ణంలో 233.75 చ.గ లేదా 195.44 చ.మీ,(అనగా, గిఫ్ట్ డీడ్ 998/2013 73 చ.గ నెట్‌సైట్ విస్తీర్ణం 16.75 చ.గ.లు) ఆమోదించబడిన ప్లాన్ 102.77 చ.గ రెసిడెన్షియల్ ల్యాండ్ & బిల్డింగ్, చెక్కమేడ రోడ్డులో, గంగానమ్మ టెంపుల్ దగ్గర, రాజుపేట, మచిలీపట్నంలో గ్రౌండ్ & ఫస్ట్ ఫ్లోర్ AC షీట్ షెడ్‌లో ఉంది. మిస్టర్ అబ్దుల్ ఖయ్యూమ్ చెందిన ఆస్తి తూర్పు: రోడ్డు-25 అడుగులు, దక్షిణం: జాయింట్ వే భాగం & హుస్సేన్-75 అడుగులు,పశ్చిమం:అమీర్ సాహెబ్ సైట్ -31 అడుగులు,ఉత్తరం: పంజా సైట్-75.అడుగులు
తేది : 30-05-2024
ప్రదేశం : మచిలీపట్నం
సం/- అధీకృత అధికారి
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

यूनियन बैंक ऑफ इंडिया भारत सरकार का उपक्रम
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భారత ప్రభుత్వ రంగ సంస్థ
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
లక్ష్మీపురం బ్రాంచి, గుంటూరు
బహిరంగ ప్రకటన

వ.నెం.	లాకర్ నెం.	లాకర్ హోల్డర్ పేరు
1.	జి.ఎఫ్-183	ఇనుమళ్ళ వి.ఎస్.జి. మోహన్ శర్మ, ఎఫ్.ఎఫ్.-3, లక్ష్మీ టవర్స్, 4/7, బ్రాడీపేట, గుంటూరు - 2
2.	జి.ఎఫ్-237	జి. చౌదరయ్య, గణపవరం, చిలకలూరిపేట
3.	జి.హెచ్-306	బోడేపూడి లలితకుమారి, కేరాఫ్. జి. వెంకటేశ్వరరావు,3వ లైన్, విద్యానగర్, గుంటూరు.
4.	జి.సి-72	గంటా శ్రీనివాసరావు, తండ్రి : రామచంద్రరావు, డి.నెం. 5-87-109, మెయిన్ రోడ్డు, లక్ష్మీపురం, గుంటూరు.
5.	జి.హెచ్-320	అన్నపరెడ్డి పద్మశిరీష, భర్త : ప్రకాశ్‌రెడ్డి, ఫ్లాట్ నెం. 511, పల్నాడు టవర్స్, 1వ లైన్, రాజేంద్రనగర్, గుంటూరు.
6.	జి.ఎఫ్-242	కల్లం పెరిరెడ్డి, తండ్రి : కె. బ్రహ్మారెడ్డి, డి.నెం. 26-30-2/11, 3వ లైన్, ఎటి అగ్రహారం, గుంటూరు - 522006.
7.	ఎస్.బి-41	మండడపు సత్యనారాయణ మూర్తి, తండ్రి : రాధాకృష్ణ మూర్తి, డోర్ నెం. 5-72-56, పండరీపురం, 3వ లైన్, గుంటూరు - 522002
8.	జి.ఇ-159	డి. వెంకటరావు, 2/11, బ్రాడీపేట, గుంటూరు - 522007
9.	ఎస్.బి-46	కాకరపర్తి రాణి, ఎఫ్.ఎఫ్-5, శివ అపార్ట్‌మెంట్, 2వ లైన్, 5వ క్రాస్, అరండల్‌పేట, గుంటూరు.

అయితే మీరు, పైన పేర్కొన్న లాకర్ హోల్డర్‌లు లాకర్ ఫీజు చెల్లింపులో డిఫాల్ట్‌గా ఉన్నారు. మరియు దానితో రిజిస్టర్డ్ అడ్రస్‌పై బ్యాంక్ అనేక నోటీసులు ఇచ్చినప్పటికీ బ్రాంచ్‌ని సంప్రదించలేదు. కాబట్టి ఈ నోటీసు తేది నుండి 3 (మూడు) నెలలలోపు వెంటనే శాఖను సంప్రదించవలసిందిగా మరియు బ్యాంక్‌కు చెల్లించవలసిన బకాయిలను తక్షణమే చెల్లించవలసి ఉంటుంది.
అయితే, మీరు బకాయిలను క్లియర్ చేయలేదు మరియు బకాయిల రికవరీ కోసం శ్రద్ధగా మరియు పదేపదే అనుసరించినప్పటికీ మీరు ఇప్పటికీ డిఫాల్ట్‌లోనే ఉన్నారు. తత్ఫలితంగా, అద్దె లాకర్‌పై మీ అన్ని హక్కులు జప్తు చేయబడతాయి. మరియు మీకు కేటాయించిన లాకర్‌ను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు బ్యాంక్‌కు హక్కు ఉంటుంది.
అయితే, తిరిగి స్వాధీనం చేసుకొనే హక్కును ఉపయోగించి బ్యాంక్ మీరు చెప్పిన లాకర్‌ను స్వాధీనం చేసుకుంది మరియు నోటీసు ప్రచురించిన తేది 08-10-2024 నుండి 3 (మూడు) నెలలలో (తేది (సమయం 2.30 ని॥)) మీ ఖర్చు మరియు పర్యవసానాల ప్రకారం దానికి తెరవాలని మీరు బకాయిలను 3 (మూడు) నెలల రోజులలోపు చెల్లించవలసిందిగా కోరుతున్నాము. (ఈ నోటీసు ప్రచురణ తేది)
దయచేసి మీరు పైన పేర్కొన్న ఖర్చులను చెల్లించడంలో విఫలమైతే మరియు 3 (మూడు) నెలలలోపు ఆర్టికల్స్ ను స్వాధీనం చేసుకోవడంలో విఫలమైతే, పైన పేర్కొన్న బకాయిలను తీర్చడానికి అవసరమైన ఆర్టికల్స్ / ప్రాపర్టీల భాగాన్ని బ్యాంక్ విక్రయిస్తుంది. ఖర్చులు అలాగే అమ్మకపు ఖర్చు, ఇంకా వేలం అమ్మకం తర్వాత మిగిలిన ఆర్టికల్స్ ఏవైనా సురక్షితమైన స్థలంలో ఉంచబడితే, మీరు చెల్లించాల్సిన ప్రస్తుత అద్దెకు రెట్టింపు వార్షిక అద్దెకు చెల్లించాలని దయచేసి గమనించగలరు.
తేది 05-06-2024
సం/- బ్రాంచి మేనేజర్

ఆందోళన చేస్తున్న నైజీరియన్లు

వేతనాలు పెంచాలని నైజీరియా కార్మికుల సమ్మె

అబుజా : వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ నైజీరియా కార్మికులు దేశవ్యాప్త సమ్మె చేపట్టారు. ఈ నిరసన కారణంగా విమాన రవాణా, విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ముఖ్యంగా దేశంలోని అతి ముఖ్యమైన ముర్తాలా మహమ్మద్ అంతర్జాతీయ విమానాశ్రయం పూర్తిగా స్తంభించిపోయింది. దేశ ద్రవ్యోల్బణం మరియు ఆర్థిక సంక్షోభం జీవన వ్యయాన్ని పెంచాయి. కానీ కార్మికులకు వేతనాలు మాత్రం పాతాళానికి పడిపోతున్నాయి. ఈ సందర్భంలో దేశంలోని కార్మికులు జీవన సంక్షోభాలను ఎదుర్కోవటానికి కార్మికులకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. "మేము జీవన వేతనాన్ని డిమాండ్ చేస్తున్నాము" అని నైజీరియన్ లేబర్ కాంగ్రెస్ తెలిపింది. అంతేకాదు ప్రస్తుతం మన కార్మికులు ఆకలి చావులు అందుకుంటున్నారని లేబర్ కాంగ్రెస్ దేశ కార్మికుల పరిస్థితిని వివరించింది. ఈ వేతనంతో కార్మికులు బతకలేని పరిస్థితి నెలకొంది. జీవన స్థితిగతులను మెరుగుపరచాలని వేతనాలు పెంచాలని కోరుతూ కార్మికులు ఒక్కతాటిపైకి వచ్చి దేశవ్యాప్త సమ్మె చేపట్టారు. నైజీరియన్ లేబర్ కాంగ్రెస్ మరియు ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ఈ పోరాటాన్ని సమన్వయం చేయడానికి నైజీరియా అంతటా కార్మికులను ఏకం చేశాయి. నైజీరియాలో కార్మికులకు ప్రస్తుత నెలవారీ వేతనం 30,000 నైరా (రూ. 1,693) మాత్రమే. దేశ ప్రభుత్వం రెండుసార్లు పెంచుతామని హామీ ఇచ్చినా ఇప్పటి వరకు నెరవేరలేదు. ఈ పరిస్థితిలో వేతనాలను రెట్టింపు చేయడం కూడా ఆర్థిక సంక్షోభాన్ని అధిగమించడానికి సహాయపడదు. అందువల్ల నెలకు 4 లక్షల 94 వేల నైరా (రూ. 27,840) అందించాలనే డిమాండ్ తో రెండు యూనియన్ కాంగ్రెస్ లు పోరాడుతున్నాయి.

జీవన సౌరభం

గెలవడంలో ఓడిపోవచ్చు కానీ.. ప్రయత్నంలో ఓడిపోకూడదు..

ఐదో తరగతి పూర్తయ్యాక ...

హాయ్ ఫ్రెండ్స్,

నా పేరు హర్షిత్. నేను ఐదో తరగతి చివర్లో కంప్యూటర్ కోడింగ్ పరీక్ష రాశాను. ఐదో తరగతి ఆఖరి పరీక్ష రోజు ఒక పూట బడి పెట్టారు. పరీక్ష రాసి వచ్చి, మా తమ్ముడితో కలసి ఆడుకున్నాను. ఆ తర్వాత రోజునే మా అమ్మమ్మ వాళ్ళ ఊరు వెళ్లాను. అక్కడ మా బంధువుల పిల్లలందరినీ కలిశాను. మేమంతా బాగా ఆడుకున్నాము. సాయంత్రం వేళల్లో పొలం గట్లు పక్కనే ఆడుకుంటుంటే భలే సరదాగా అనిపించింది. పొలానికి, ఊరికి మధ్య ముళ్ళ చెట్లు వేశారు. అటువైపు రోజూ వెళ్లొద్దని అమ్మమ్మ మరీ మరీ చెప్పింది. అమ్మమ్మ చెప్పినట్లే చేశాం. ఒకసారి పొలం పక్కన బంతి ఆట ఆడుకుంటుంటే, అది ముళ్ళ చెట్లలో పడింది. చాలా కష్టం మీద, నేను నా మిత్రులు దాన్ని తీశాం. ఆ రోజు నుండి అటువైపు వెళ్లకుండా ఇంటి పెరట్లోనే ఆడుకున్నాం. ఇలా నేను ఈ నెల మొత్తం చాలా ఆనందంగా గడిపాను.

వి.హర్షిత్,
6వ తరగతి,
అరవింద మోడల్ స్కూలు, మంగళగిరి.

వేసవి విడిది

ఊరూరా గుడి వలే బడులు
బడులు విద్యా విజ్ఞానానికి నెలవులు
బడులున్న చోటునే వసించుము
బడులు లేని చోట ఉండకుము

ఎండలొస్తే వేసవి సెలవులు
వేడి నుంచి కాస్త విరామాలు
పిల్లలకు సెలవులు ఆట విడుపులు
బడులకు కాదులే సెలవులు

విడిది అందించు ఆతిథ్యాలు
బడులు ఎలక్షన్‌లకు విడుదులు
పిల్లలకు వేసవిలో సెలవులు
కొత్త ప్రపంచాన్ని చూపే తెరలు

సెలవులు సరదాలకు అద్దం పట్టు
అమ్మమ్మల ఇండ్లే ఆటపట్టు
విహార యాత్రలు చేపట్టు
కొత్త ప్రదేశాలు చూసేటట్టు

ఆకాశం కనిపించే వాకిళ్ళు లేవు
ఆరుబయట అందమైన అరుగులు లేవు
కథలు చెప్పే పెదరాశి పెద్దమ్మలు లేరు
అరచేతిలో గూగులమ్మ కథ వేరు

ఆనాటి పూటకుళ్ళ ఇండ్లు
ఈనాటి అందమైన హోటళ్ళు
పిల్లలు సెలవులు గడిపేదే విడిది
ఎండైనా వానైనా పిల్లలకు విసుగేది!

– పి.బక్కారెడ్డి,
97053 15250.

బొమ్మరిల్లు

రాయల.మోక్షిత్,
3వ తరగతి, ఐన్‌ఫాంట్ జీసస్ స్కూల్,
పెద్దపాడు,
టెక్కలి, శ్రీకాకుళం.

బోయిని సాత్విక,
ఏడవ తరగతి,
జక్కాపూర్,
సిద్దిపేట జిల్లా.

కుల దీప్ సాయి,
6వ తరగతి,
కే. బరినేపల్లి,
కలికిరి.

టి. కీర్తి వర్ధన్ గౌడ్,
మూడవ తరగతి,
కరీంనగర్.

పిల్లలతో ఇలా మెలగండి ...

ఒకప్పటి తరానికి ఈనాటి పిల్లల తరానికి చాలా వ్యత్యాసం కనపడుతోంది. దీంతో ఈ రోజుల్లో పిల్లల పెంపకం తల్లిదండ్రులకు పెద్ద సవాలుగా తయారైంది. ఈ తరం పిల్లల్లో చాలామంది హైపర్ యాక్టివ్‌గా ఉంటున్నారు. ఇంకొందరు పదిమందిలో ఉన్నా.. నిశ్శబ్దంగా తమ పనిలో తాము నిమగ్నమవుతుంటారు.

ఇలాంటి పిల్లలను అలాగే వదిలేస్తే.. పెద్దయ్యాక వారిలో ఆత్మన్యూనతా భావం పెరిగిపోతుంది. చొచ్చుకుపోయే స్వభావం లేకుండా పోతుంది. అలా జరగకుండా ఉండాలంటే పిల్లల ప్రవర్తనపై ఓ కన్ను వేయాలి.

పిల్లలు నిరంతరం చదువులు, ఆటల్లో మునిగిపోకుండా ఇంటిపనిలో భాగం చేయాలి. వారికి చిన్న చిన్న పనులు నేర్పుతుండాలి. పనిచేసే క్రమంలో ఎన్నో కొత్త విషయాలు నేర్చుకుంటారు. ఇది వాళ్ల మానసిక ఎదుగుదలకు బాగా దోహదపడుతుంది.

పిల్లలకు వారి అనుభవాల ఆధారంగా కథలు చెప్పడం నేర్పించాలి. దీనివల్ల వారి జ్ఞాపకశక్తి మెరుగుపడుతుంది. వారిలోని లోపాలను వారు అధిగమించగలుగుతారు. పిల్లలు సరిగ్గా కమ్యూనికేట్ చేయడానికి, ఎమోషనల్ డెవలప్‌మెంట్ కోసం.. తల్లిదండ్రులు పిల్లలతో ఆరోగ్యకరమైన, దృఢమైన బంధాన్ని ఏర్పరచుకోవాలి.

పిల్లలు ఏవైనా ప్రశ్నలు అడిగినపుడు విసుగు తెచ్చుకోకుండా, సమాధానాలు చెప్పాలి. దీనివల్ల వారికి కొత్త విషయాలు తెలుసుకోవాలనే కుతూహలం పెరుగుతుంది. కొత్త విషయాలు తెలుసుకుంటున్న కొద్దీ వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.

ఏమైనా అడిగినపుడు తిట్టి, కొట్టి నిశ్శబ్దంగా కూర్చోబెడితే వారు ప్రశ్నించే తత్వాన్ని కోల్పోతారు. ఇది అలాగే కొనసాగితే వారి అభివృద్ధికి మీరే అడ్డుతగిలినట్టు అవుతుంది. కాబట్టి పిల్లలను ఎప్పటికప్పుడు గమనించుకుంటూ తప్పొప్పులను సరిచేస్తూ ఉండాలి.

మార్చాల్సిన టైం వచ్చింది..

వంటగదిలో ప్లాస్టిక్ డబ్బాలు, బెడ్ రూమ్‌లో పరుపులు, దిండ్లు, నేలమీద పరచిన కార్పెట్లు కొంత కాలం తరువాత సూక్ష్మక్రిములు, హానికర బ్యాక్టీరియాలతో నిండిపోతాయి. చూడడానికి బాగానే కనిపిస్తున్నా నిర్ధిష్ట సమయం తరువాత వాటిని తప్పకుండా మార్చుకోవాలి.

ఎప్పుడు మార్చాలి?

కార్పెట్లు : రోజులు గడిచే కొద్దీ కార్పెట్లపై దుమ్ము, పెంపుడు జంతువుల బొచ్చు, అలర్జీ కారకాలు పేరుకుపోతాయి. ఇవి శ్వాస సమస్యలు, అలర్జీలకు దారితీస్తాయి. కార్పెట్లను వాక్యుమ్ క్లీనర్లతో శుభ్రపర్చుకోవాలి. ఏడాదికోసారి ఆవిరితో శుభ్రం చేసుకోవాలి. వీటి జీవితకాలం పదేళ్లు.

దిండ్లు : వీటిపై చర్మ మృతకణాలు, దుమ్ముక్రిములు (డస్ట్ మైట్స్), చెమట పేరుకుపోతాయి. ఇవి అలర్జీలు, శ్వాస సమస్యలకు కారణమవుతాయి. దిండ్లకు గలీబులు వాడాలి. వాటిని క్రమం తప్పకుండా ఉతుక్కోవాలి. దిండ్లను ఒకటి రెండేళ్లకు మించి వాడకూడదు.

లూఫాలు : శరీరాన్ని శుభ్రం చేసుకోవడానికి వాడే లూఫాలు తడి వాతావరణంలో బ్యాక్టీరియాకు ఆవాసాలుగా మారిపోతాయి. వీటిని మూడు నాలుగు వారాలకోసారి మార్చాలి.

ప్లాస్టిక్ డబ్బాలు : కాలం గడిచేకొద్దీ ప్లాస్టిక్ డబ్బాల్లో పగుళ్లు వస్తాయి. గీతలు పడతాయి. అలా హానికరమైన బ్యాక్టీరియాకు కేంద్రాలుగా మారతాయి. ప్రతి రెండు మూడేళ్లకోసారి ప్లాస్టిక్ డబ్బాలను మార్చాలి.

కటింగ్ బోర్డులు : కూరగాయలు తరుగుతున్నప్పుడు బోర్డులపై గాట్లు ఏర్పడతాయి. ఇవి బ్యాక్టీరియా పెరుగుదలకు దోహదపడతాయి. నెలలు గడిచేకొద్దీ కటింగ్ బోర్డులను కడగడం కూడా కష్టమైపోతుంది. వీటిని ఒకటి రెండేళ్లకు ఓసారి మార్చుకోవాలి.

నాన్ స్టిక్ ప్యాన్లు : కాలక్రమంలో నాన్ స్టిక్ ప్యాన్ల కోటింగ్ చెరిగిపోతూ ఉంటుంది. దాంతో వంట వండేప్పుడు ప్యాన్ల నుంచి హానికరమైన రసాయనాలు విడుదలవుతాయి. చౌకైనవి కాకుండా ఖరీదైన ప్యాన్లు ఎంచుకోవాలి. వాటిని ఎక్కువసేపు వేడిచేయడం మానుకోవాలి. నాన్ స్టిక్ ప్యాన్లను మూడు నుంచి ఐదేళ్లు మాత్రమే వాడాలి.

కిచెన్ స్పాంజ్‌లు : వీటిని ఒకటి రెండు వారాలకు మించి వాడకూడదు. ఎక్కువ రోజులైతే తడిగా ఉంటాయి కాబట్టి బ్యాక్టీరియా అభివృద్ధి చెందుతుంది. క్రిములు నశించిపోవడానికి స్పాంజ్‌ను రోజూ ఓ నిమిషంపాటు మైక్రోవేవ్స్‌లో వేడిచేయాలి. లేదంటే తిరిగి వాడుకోగలిగే సిలికాన్ స్క్రబర్స్‌ను ఎంచుకోవాలి.

రోజుకు రెండు లవంగాలు

మన వంటింట్లో ఎప్పుడూ అందుబాట్లో ఉండే లవంగాలు ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉంటాయి. రోజుకి రెండు లవంగాలను తీసుకోవడం వల్ల అనేక లాభాలు ఉన్నాయి.

లవంగాలలో విటమిన్ బి1, విటమిన్ సి, బీటా కెరోటిన్ వంటి పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. ఇందులో విటమిన్ కె, ప్రోటీన్, కార్బోహైడ్రేట్లు కూడా సంవృద్ధిగా ఉన్నాయి. అలాగే సోడియం, జింక్, మెగ్నీషియం, ఫాస్ఫరస్, జింక్ వంటి పోషకాలు ఎంతో ప్రయోజనం కలిగిస్తాయి.

జలుబు, దగ్గు, ముక్కు కారటం వంటి సీజనల్ సమస్యలతో బాధపడుతున్న వారు లవంగాలు తీసుకోవడం వలన ఉపశమనం కలుగుతుంది. ఎందుకంటే దీనిలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. లవంగాలను రోజూ తీసుకోవడం వల్ల జీర్ణ సమస్యలను దూరం చేసుకోవచ్చు.

హద్దుల్లేని ఆర్భాటం

- ప్రీవెడ్డింగ్ వేడుకల కోసం భారీసెట్టింగులు
- సామాన్యులకు ఇబ్బందులు
- అంబానీల తీరును కడిగిపారేసిన విదేశీ వార్తా సంస్థలు



న్యూఢిల్లీ : భారతదేశ సంపన్న ప్రముఖుల్లో ఒకరైన ముకేష్ అంబానీ చిన్న కుమారుడు అనంత్ అంబానీ, రాధికా మర్చంట్‌ల వివాహ ముందస్తు వేడుకలు మే 29 నుండి జూన్ 1 వరకు ఆర్భాటంగా, అట్టహాసంగా ఒక క్రూయిజ్ షిప్‌లో జరిగాయి. దేశ, విదేశీ ప్రముఖులతో కూడిన 800 మంది ప్రయాణికులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. వారికి అందించిన వివిధ రకాల దేశ, విదేశీ ఆహార పదార్థాలు, పానియాలు ఇలా ప్రతి ఒక్కటీ ప్రజలను ఆకర్షించాయి. ఈ వేడుకల్లో మన బాలివుడ్ సెలబ్రిటీలు కూడా పలువురు పాల్గొన్నారు. అక్కడి విందు వినోదాలను ఆస్వాదించారు. అయితే, ఆ షిప్‌లోని అతిథులకు ఆతిధ్య సత్కారాల సేవలు అందించిన బృందం మాత్రం చాలా అసంతృప్తిగా వుందని కొన్ని విదేశీ టాబ్లాయిడ్‌లు పేర్కొన్నాయి.

ఇందుకు సంబంధించి వాటిలో ఒక వార్తాపత్రిక ఇచ్చిన శీర్షిక అందరి దృష్టిని ఆకర్షించింది. 'సరిగా వ్యవహరించని సంపన్న వివాహ బృందం' అనే హెడ్డింగ్‌తో ప్రచురించిన ఆ వార్త ఈ విధంగా వుంది. "అట్టహాసంగా జరిగే వివాహ ముందస్తు వేడుకల కోసం విచ్చేసిన భారత సంపన్న సమాజంలోని ప్రముఖులు మధ్యధరా సముద్ర తీరంలోని జెనోవా పోర్ట్‌లో ఆగి, తెల్లవారే వరకు చెవులు పిక్కటిల్లే శబ్దాలతో సంగీతం విన్న తర్వాత పోలీసులకు అనేక ఫిర్యాదులు అందాయి. జులైలో జరిగే అనంత్ అంబానీ వివాహానికి ముందుగా జరుగుతున్న ఈ వేడుకకు హాజరైన 800మంది ప్రముఖుల కోసం ఏకంగా 13.9 కోట్ల యూరోల వ్యయం అవుతుందని అంచనా వేశారు." అతిథుల కోసం పీతలతో చేసిన శాండ్‌విచ్ కావాలని కోరితే వాటిని వండి వడ్డించడానికి ఇటలీలోని జెనోవాలో పూనీ 2 రెస్టారెంట్ మేనేజర్ తిరస్కరించారని కూడా ఆ వార్త పేర్కొంది. పది వేల యూరోలు ఇస్తామన్నా కూడా ఆయన అంగీకరించలేదని తెలిపింది. వారి ప్రవర్తన, వ్యవహార శైలి చాలా దారుణంగా వుందని, అస్సలే మాత్రం బాగా లేదని మేనేజర్ ఆండ్రియా మిరోలి వ్యాఖ్యానించారు.

మా రెస్టారెంట్‌కు మంచి చరిత్ర వుందని దాన్ని కాపాడుకోవాల్సిన అవసరం వుందన్నారు. ఈ వేడుకల కోసం అంబానీలు మొత్తంగా పోర్టోఫినో బేను అద్దెకు తీసుకోవడంతో స్థానికులు, అక్కడకు వచ్చే సామాన్య పర్యాటకులు కూడా కొంతమేరకు ఇబ్బందులు పడ్డారు. గతంలో కూడా ఈ ఏరియాను అద్దెకు తీసుకుని తమ వేడుకలను నిర్వహించుకున్న ప్రముఖులు వున్నారు. కానీ వారు స్థానికులు, పర్యాటకులు ఆ ప్రాంతాన్ని సందర్శించేందుకు అనుమతించారు. అంబానీలు అలా చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆ పత్రిక పేర్కొంది.

తగ్గిన 'ముస్లిం' ప్రాతినిధ్యం

- కాంగ్రెస్ నుంచి అధికంగా ఏడుగురు విజయం
- బిజెపి నుంచి శూన్యం

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా 18వ లోక్‌సభకు గానూ మొత్తం 543 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో.. మైనారిటీలైన ముస్లిం అభ్యర్థులు తక్కువ మంది మాత్రమే ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా పలు పార్టీల నుంచి మొత్తం 78 మంది బరిలో ఉండగా.. 24 మంది మాత్రమే గెలిచినట్టు సమాచారం. 2019 లోక్‌సభ ఎన్నికల్లో 115 మంది ముస్లిం అభ్యర్థులు పోటీలో ఉండగా, 27 మంది ఎన్నికయ్యారు. బిజెపి నుంచి ఏ ఒక్క అభ్యర్థి ఎన్నిక కాకపోవటం గమనార్హం.

కాంగ్రెస్ నుంచి అధికం

కాంగ్రెస్ నుంచి అత్యధికంగా ఏడుగురు విజయం సాధించారు. యూపీలోని ప్రధాన ప్రతిపక్షం సమాజ్‌వాదీ పార్టీ (ఎస్‌పి) నుంచి నలుగురు గెలిచారు. పశ్చిమ బెంగాల్‌లోని అధికార తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) నుంచి ఐదుగురు లోక్‌సభకు ఎన్నికయ్యారు. కాంగ్రెస్ మిత్రపక్షం ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయూఎంఎల్) నుంచి ముగ్గురు, నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సి) నుంచి ఇద్దరు విజయం సాధించారు. ఎంఐఎం నుంచి ఒకరు, స్వతంత్రులు ఇద్దరు గెలుపొంది 18వ లోక్‌సభకు వెళ్లనున్నారు.

పారిస్‌లోని ఆర్సే మ్యూజియం ఎదుట విగ్రహాలపై 'సోషల్ క్లీనింగ్' ఆపాలంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న దృశ్యం

ఒలింపిక్స్ పేరుతో పేదల గెంటివేత

పారిస్: వచ్చే నెల 26 నుంచి ఆగస్టు 11 వరకు జరిగే వేసవి ఒలింపిక్స్ కోసం పారిస్ సుందరీకరణలో భాగంగా నగరంలోని పేదల కొంపలను తొలగించి బయటకు తరిమేస్తుండడాన్ని మానవతావాద సంస్థ మెడిసన్ డుమాండే తీవ్రంగా వ్యతిరేకించింది. ఆ సంస్థ కో ఆర్డినేటర్ పాల్ అలౌజీ బుధవారం నాడిక్కడ మీడియాతో మాట్లాడుతూ, గత 13 నెలల కాలంలో 12,545 కుటుంబాలను ఖాళీ చేయించారని విమర్శించారు. వీరికి 7 వేల గృహాలు అవసరం కాగా, ఇంతవరకు వెయ్యి మాత్రమే ప్రభుత్వం నిర్మించిందని అన్నారు. పేదలను అవాంఛనీయ వ్యక్తులుగా భావించి వారిని నగనరం నుండి తరిమేయడం దారుణమని అన్నారు. పారిస్ నగర సోషలిస్టు మేయర్ హిడాల్గో కూడా దీనిని తప్పుపట్టారు. అయితే, ఇది కేంద్ర ప్రభుత్వ నిర్ణయమని ఇందులో తాను జోక్యం చేసుకోలేనని అన్నారు. పారిస్ ఒలింపిక్స్‌భద్రతా ఏర్పాట్ల కోసం 32 కోట్ల యూరోలను ఖర్చు చేస్తున్నారు. 35వేల మంది దాకా భద్రతాసిబ్బందిని ఇందుకోసం ప్రత్యేకంగా మోహరించారు.

చెలరేగిన బౌలర్లు

- టి20 ప్రపంచకప్‌లో టీమిండియా బోణి
- బౌలింగ్‌లో మెరిసిన హార్దిక్, బుమ్రా
- ఐర్లాండ్‌పై ఎనిమిది వికెట్ల తేడాతో గెలుపు

న్యూయార్క్: టి20 ప్రపంచకప్ టీమిండియా బోణీ కొట్టింది. గ్రూప్-ఎ లీగ్ పోటీలో భాగంగా ఐర్లాండ్‌తో బుధవారం జరిగిన తొలి పోటీలో టీమిండియా ఎనిమిది వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఐర్లాండ్‌ను టీమిండియా బౌలర్లు కట్టడి చేయడంతో ఆ జట్టు 16ఓవర్లలో 96పరుగులకే ఆలౌటైంది. ఆ లక్ష్యాన్ని టీమిండియా 12.2ఓవర్లలో 2వికెట్లు కోల్పోయి ఛేదించింది. కెప్టెన్ రోహిత్ శర్మ(52) రిటైర్డ్ హర్ట్ కాగా.. పంత్(36) మ్యాచ్‌ను ముగించాడు. కోహ్లి(1), సూర్యకుమార్ యాదవ్(2) నిరాశపరిచారు. తొలుత ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా, జస్ప్రీత్ బుమ్రాకి తోడు ఆర్ష్‌దీప్ కూడా రాణించడంతో ఐర్లాండ్ జట్టు 96పరుగులకే కుప్పకూలింది. టాస్ గెలిచిన రోహిత్ శర్మ తొలిగా బౌలింగ్‌కే మొగ్గుచూపాడు. కెప్టెన్ నమ్మకాన్ని బౌలర్లు వమ్ము చేయలేదు. బ్యాటింగ్‌కు దిగిన ఐర్లాండ్‌ను 16ఓవర్లలో 96 పరుగులకు ఆలౌట్ చేశారు. బౌన్స్ అవుతున్న బంతులతో ఐర్లాండ్ బ్యాటర్లు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. మరోవైపు స్వింగ్ కూడా ఉండడం, కొన్ని బంతులు మరీ తక్కువ ఎత్తులో రావడం బ్యాటర్లు అయోమయానికి గురయ్యారు. ఐర్లాండ్ ఇన్నింగ్స్‌లో గారెత్ డెలానీ అత్యధికంగా 26 పరుగులు చేశాడు. జాషువా లిటిల్ 14, కర్టిస్ కాంఫర్ 12, లోర్కాన్ టకర్ 10 పరుగులు చేశారు. టీమిండియా బౌలర్లలో హార్దిక్ పాండ్యాకు మూడు, ఆర్ష్‌దీప్ సింగ్, బుమ్రాకు రెండేసి, సిరాజ్, అక్షర్ పటేల్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. ఛేదనలో టీమిండియా ఓపెనర్లు రోహిత్ శర్మ అర్ధసెంచరీతో రాణించినా.. మరో ఓపెనర్ కోహ్లి(1) నిరాశపరిచాడు. వీరిద్దరూ తొలి వికెట్‌కు 22పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఆ తర్వాత రోహిత్-పంత్ టీమిండియాను విజయ తీరాలకు చేర్చాక.. రోహిత్ శర్మ రిటైర్డ్ హర్ట్‌గా మైదానాన్ని వీడాడు.

టి20 ప్రపంచకప్‌లో నేడు
పప్పున్యుగెయా × ఉగాండా వేదిక: గయానా; ఉ.5.00గం॥లకు
ఆస్ట్రేలియా × ఒమన్ వేదిక: బార్బొడాస్; ఉ.6.00గం॥లకు
అమెరికా × పాకిస్తాన్ వేదిక: డల్లాస్; రా.9.00గం॥లకు

స్కోర్‌బోర్డు..

ఐర్లాండ్ ఇన్నింగ్స్: బల్బెరి (బి)ఆర్ష్‌దీప్ 5, స్టెర్లింగ్ (సి)పంత్ (బి)ఆర్ష్‌దీప్ 2, టక్కర్ (బి)హార్దిక్ పాండ్యా 10, హారీ టెక్కర్ (సి)కోహ్లి (బి)బుమ్రా 1, ఛాప్టర్ (సి)పంత్ (బి)హార్దిక్ 12, డంకెల్ (సి)బుమ్రా (బి)సిరాజ్ 3, డెల్లనీ (రనౌట్)సిరాజ్/పంత్ 26, మార్క్ అడైర్ (సి)దూబే (బి)హార్దిక్ 3, మెక్ కర్థీ (సి అండ్ బి)అక్షర్ 0, జోషూ లిట్టిల్ (బి)బుమ్రా 14, వైట్ (నాటౌట్) 2, అదనం 15. (16ఓవర్లలో ఆలౌట్) 96పరుగులు. **వికెట్ల పతనం:** 1/7, 2/9, 3/28, 4/36, 5/44, 6/46, 7/49, 8/50, 9/77, 10/96 **బౌలింగ్:** ఆర్ష్‌దీప్ సింగ్ 4-0-35-2, సిరాజ్ 3-0-13-1, బుమ్రా 3-1-6-2, హార్దిక్ పాండ్యా 4-1-27-3, అక్షర్ పటేల్ 1-0-3-1, జడేజా 1-0-7-0.

ఇండియా ఇన్నింగ్స్: రోహిత్ శర్మ (రిటైర్డ్ హర్ట్) 52, విరాట్ కోహ్లి (సి)వైట్ (బి)అడైర్ 1, రిషబ్ పంత్ (నాటౌట్) 36, సూర్యకుమార్ యాదవ్ (సి)డకెల్ (బి)వైట్ 2, దూబే (నాటౌట్) 1, **వికెట్ల పతనం:** 1/22, 2/91 **బౌలింగ్:** అడైర్ 4-0-27-1, లిట్టిల్ 4-0-42-0, కర్థీ 2.2-0-18-0, ఛాప్టర్ 1-0-4-0, వైట్ 1-0-6-1.

ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ డబుల్స్
సెమీస్‌కు బొప్పన్న-ఎబ్డెన్

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ పురుషుల డబుల్స్ సెమీఫైనల్లోకి రోహన్ బొప్పన్న-మాథ్యూ ఎబ్డెన్ జంట ప్రవేశించింది. బుధవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో ఇండో-ఆస్ట్రేలియా ద్వయం 7-6(7-3), 5-7, 6-1తో 10వ సీడ్ బెల్జియంకు చెందిన గిల్లే-విలేజిన్‌లను చిత్తుచేశారు. ఉత్కంఠభరితంగా సాగిన ఈ పోటీలో బొప్పన్న జంట మూడో సెట్‌ను టై బ్రేక్‌లో చేజిక్కించుకొని మరో గ్రాండ్‌స్లామ్ టైటిల్‌కు రెండడుగుల దూరంలో నిలిచారు. సెమీస్‌లో వీరు 11వ సీడ్, ఇటలీకి చెందిన బొలెల్లి-వవస్సోరీలతో తలపడనున్నారు.

రూడ్, అల్కరాజ్ కూడా..

టాప్‌సీడ్ నొవాక్ జకోవిచ్‌కు మరోసారి నిరాశ తప్పలేదు. క్వార్టర్స్‌కు చేరిన ఊపులో ఉన్న జకోవిచ్.. గాయం కారణంగా మ్యాచ్ ఆడకుండానే ఓటమిని అంగీకరించారు. 7వ సీడ్ రూడ్(డెన్మార్క్)తో బుధవారం తలపడాల్సిన నొవాక్ జకోవిచ్.. నిష్క్రమణతో రూడ్ సెమీస్‌కు చేరాడు. ఇక 3వ సీడ్ అల్కరాజ్(స్పెయిన్) వరుససెట్లలో 8వ సీడ్ సిట్సిపాస్‌ను చిత్తుచేసి సెమీస్‌కు చేరాడు. అల్కరాజ్ 6-3, 7-6(7-3), 6-4తో సిట్సిపాస్‌ను ఓడించాడు. ఇక మహిళల సింగిల్స్‌లో టైటిల్ రేసులో నిలిచిన 4వ సీడ్, కజకిస్తాన్‌కు చెందిన రైబకినా, 2వ సీడ్ సబలెంక(బెలారస్) పోరాటం ముగిసింది. బుధవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో రైబకినా 2-6, 6-4, 4-6తో 12వ సీడ్ ఇటలీకి చెందిన పోలిని చేతిలో అనూహ్యంగా ఓటమిపాలైంది. మరో క్వార్టర్స్‌లో సబెలంకా 7-6(7-5), 4-6, 4-6తో రష్యాకు చెందిన అన్‌సీడెడ్ ఆండ్రీవా చేతిలో పోరాడి ఓడింది. సెమీస్‌లో ఆండ్రీవాతో పోలిని తలపడనుంది.

ఒలింపిక్స్ పనులు అసంపూర్ణం

- నిర్వాహకులు

పారిస్: పారిస్ వేదికగా జులై 26నుంచి ఆగస్టు 11వరకు జరిగే ఒలింపిక్స్ పనులు అసంపూర్ణంగా ఉన్నట్లు నిర్వాహకులు అంగీకరించారు. ఏ క్రీడను ఎక్కడ నిర్వహించాలనే అంశంపై ఇప్పటివరకు ఓ నిర్ణయానికి రాలేదని, ఈ విషయమై మల్లగుల్లాలు పడుతున్నామని వారు తెలిపారు. ముఖ్యంగా సర్ఫింగ్ క్రీడకు సంబంధించి తాహితీలోని పసిఫిక్ సముద్ర జలాల్లో నిర్వహించాల్సి ఉండగా.. అక్కడ ఏవిధమైన ఏర్పాట్లు లేకపోవడమే ఇందుకు ప్రధాన కారణమని వారన్నారు. ఇప్పటికిప్పుడు ఇక్కడ ఏర్పాట్లు మొదలుపెడితే కర్బన ఉద్గారాలతో అక్కడి సముద్ర జీవులకు హాని కలుగుతుందనే భయం వారిలో నెలకొంది. దీంతో ఈ క్రీడను ప్రత్యక్షంగా వీక్షించేందుకు అభిమానులు బీచ్‌కు వచ్చే అవకాశం లేదని, ఒకవేళ వచ్చినా ఈ క్రీడను చాలా దూరంగా ఉండి వీక్షించాల్సి ఉంటుందన్నారు. ఈ కారణంగా చాలామంది టెలివిజన్‌లకే పరిమితమౌతారని నిర్వాహకులు భావిస్తున్నారు. 2012 లండన్, 2016 రియో ఒలింపిక్స్‌తో పోలిస్తే సముద్ర జీవులకు హాని కలిగించే కర్బన ఉద్గారాలను గట్టిగా నియంత్రించాలని నిర్వాహకులు భావిస్తున్నారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68